www.jagritiweekly.com

సంపుటి : 77 సంచిక : 48 పుటలు : 52

జాగృతి

కలి 5127-శ్రీ విశ్వావసు ఆశ్వీయుజ శుద్ధ పాడ్యమి

22-28 సెప్టెంబర్ 2025

వెల : ₹20/-

23 సెప్టెంబర్
ఆయుర్వేద
దినోత్సవం
సందర్భంగా
ప్రత్యేక సంచిక

అజరామరం.. ఆయుర్వేదం

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

జాగృత 'సంఘ శతాబ్ది'

- ఆత్మ విస్మృతి అంటే ఏమిటి?
- ఒక జాతి ఉనికిని ప్రకటించే అన్ని అంశాలను గాలికి వదిలిపెట్టడం.
- ఆత్మగౌరవాన్ని పూచిక పుల్లలా పరిగణించడం.
- ఆ జాతి జ్ఞానసంపదను కొల్లగొట్టి, అట్టలు మార్చి మళ్లీ తీసుకొచ్చి అంటగడుతుంటే మహా ప్రసాదంలా తీసుకోవడం.
- ఆ జ్ఞానం నీ పూర్వికులదే అని ప్రపంచం గుర్తు చేసినా, రుజువులు చూపించినా నమ్మకపోవడం.
- తప్పని స్థితిలో ఏదో విదేశీ సంస్థ ముద్ర వేస్తే, ఇది మాది అని అప్పుడు ఆ జ్ఞానం వెంటపడడం. ఆఖరికి ఆ జాతి స్వాతంత్ర్య సాధనకు కూడా పరదేశీ సిద్ధాంతాలను ఎరువు తెచ్చుకోవడం.
- ఏదీ ఆ జాతి?
- మన భారతజాతే!
- ఇలాంటి దుస్థితి నుంచి బయటపడవేయడానికి మహా సాంస్కృతిక ఉద్యమాన్ని, పునరుజ్జీవనోద్యమాన్ని నిర్మించిన సంస్థ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్.
- ఇది ఆ మహా సంస్థ శతాబ్ది.
- ఆ వందేళ్ల ప్రయాణం ఎలా సాగిందో అక్షరరూపంలో మీ ముందుకు తెస్తుంది ఈ దీపావళి ప్రత్యేక సంచిక.

సంచిక తేదీ : అక్టోబర్ 20, 2025

త్వరపడండి!

అదనపు కాపీల కోసం పాఠకులు, ఏజెంట్లు అక్టోబర్ 06లోగా జాగృతి కార్యాలయానికి 9959997013 నంబరుకు ఫోన్ చేసి లేదా వాట్సప్‌లో సంప్రదించవచ్చు.

పేజీలు: 300
వెల: 200/-

- 25 నుంచి 50 కాపీలు ఆర్డరు చేసిన వారికి 30 శాతం
- 51 నుంచి 99 కాపీలు ఆర్డరు పెట్టుకున్న వారికి 35 శాతం
- 100, ఆ పైన కాపీలకు 40 శాతం డిస్కౌంట్ లభిస్తుంది.
- పార్శిల్ ఖర్చులు అదనం

jagritiweekly.com facebook.com Jagriti Telugu Weekly youtube.com/@Jagrititv 3-4-228/4/1, Kachiguda, Hyderabad-027.

యంత్రం కాదు.. ఏఐ మంత్రి..!

ప్రతీ రంగంలోనూ వేగంగా విస్తరిస్తున్న కృత్రిమ మేధస్సు – ఏఐ ఇప్పుడు రాజకీయాల్లోకి కూడా ప్రవేశించింది. ఏకంగా మంత్రి పదవిని దక్కించుకుంది. ఇది అల్బేనియా మహిళల సంప్రదాయ వస్త్రధారణలో కనిపిస్తుంది. అల్బేనియా దేశంలో అత్యంత ప్రాముఖ్యత కలిగిన అవినీతిని అరికట్టే మంత్రిత్వ శాఖను నిర్వహించనుంది. ఏఐ మంత్రికి డియోల్లా అని నామకరణం చేశారు. అల్బేనియా భాషలో డియోల్లా అంటే సూర్యుడు అని అర్థం. ఇదే విషయంపై అల్బేనియా ప్రధాన మంత్రి ఎడి రమ మాట్లాడుతూ అవినీతిని అరికట్టే పనిలో డియోల్లాను నియమించినట్టు ప్రకటించారు. ప్రపంచంలోనే మొట్టమొదటి ఏఐ మంత్రిని నియమించడం ద్వారా అల్బేనియా చరిత్ర సృష్టించింది. ఎడి రమ నాలుగవ సారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తున్నారు.త్వరలో తన పదవీకాలాన్ని ప్రారంభించనున్నారు. డియోల్లా ప్రభుత్వం వివిధ ప్రాజెక్టుల కోసం ఆహ్వానించే పబ్లిక్ టెండర్ల ప్రక్రియను పర్యవేక్షిస్తుంది. రాజకీయ ప్రభావాన్ని తగ్గిస్తుంది. ప్రభుత్వ వ్యయాన్ని పరిశీలిస్తుంది. అవినీతి లేకుండా 100 శాతం పారదర్శకతను తీసుకొనివస్తుంది. అల్బేనియా ఒక పేదదేశం. అక్కడ పబ్లిక్ టెండర్లలో అవినీతి సర్వసాధారణం. ప్రధాని రమ ప్రకారం డియోల్లా అవినీతి రహిత వ్యవస్థను తీసుకురావడానికి సహాయపడుతుంది. భౌతికంగా కాకుండా వర్చువల్‌గా ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొంటుంది. ప్రధాని రమ దేశరాజధాని టిరానాలో జరిగిన అధికార సోషలిస్ట్ పార్టీ సమావేశంలో ఈ కొత్త నిర్ణయాన్ని ప్రకటించారు. అయితే ఏఐ మంత్రి నియామకాన్ని ప్రతిపక్షాలు తప్పుపట్టాయి. డియోల్లాకు జవాబుదారీతనం ఉండదని వేలెత్తి చూపాయి. సైబర్ భద్రతా సమస్యలు తలెత్తుతాయనే ఆందోళన వ్యక్తం చేశాయి. విపక్ష నేతలు ఏఐ మంత్రి నియామకాన్ని వ్యతిరేకిస్తూ సోషల్ మీడియాలో కామెంట్లు పోస్టు చేశారు.

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
Editor : Dr. Goparaju Narayana Rao.

సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.

జి.తుకారాం : సర్క్యులేషన్ మేనేజర్
040-27561453 / 9959997013

సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)

కె. దుర్గారెడ్డి : అసోసియేట్ ఎడిటర్ -
సబ్ ఎడిటర్ : - 9959991304

డిజైనర్ : చిగుళ్ల కుమార్, ఎడ్ల కృష్ణ

చందాదారులకి గమనిక

చందాలను ఎవ్వరికి వ్యక్తిగతంగా చెల్లించవద్దు. మీ దగ్గరకు వచ్చే బల్క్ మెంబర్లకు (కార్యకర్తలకు) మాత్రమే చెల్లించి రసీదు తీసుకోగలరు. లేదా కింద ఇచ్చిన అకౌంట్ ద్వారా చెల్లించగలరు.

ఫోన్ పే, గూగుల్ పే నుండి చెల్లించడానికి జాగృతి అకౌంట్ "To Bank / UPID" ఆప్షన్ వాడండి.

Link / QR Code ద్వారా మీ చందా చెల్లించినప్పుడు Remarks దగ్గర కట్టించిన కార్యకర్త పేరు ఫోన్ నెం. తప్పకుండా రాయించండి.

విడి ప్రతి రూ.20

5 సం॥ల చందా రూ.4000 **సంవత్సర చందా రూ.850**

బ్యాంకు ఖాతా వివరాలు

A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch.
IFSC : UTIB0002157, PAN : AAATJ3829L

- సర్క్యులేషన్ మేనేజర్, జాగృతి

చరిత్ర పునరావృత్తమవుతుందన్నది నిత్యసత్యం. చరిత్ర ప్రతీకారం కూడా తీర్చుకోగలదన్నది నవీన సత్యం కాబోలు. ముస్లిం వలసలతో చాప కింద నీరులా, పచ్చగడ్డిలో పాములా పాశ్చాత్య ప్రపంచంలో సాగిపోతున్న పరిణామాల సారం ఇంతేననిపిస్తున్నది. సెప్టెంబర్ 13వ తేదీన లండన్ వీధులలో మార్మోగిన నినాదం అంతరార్థం అదే కూడా. ఇప్పుడు బలంగా వినిపించిన 'మా దేశాన్ని మాకు ఇవ్వండి!' అన్న నినాదం ఒక దశాబ్దకాలంగా ఇంగ్లండ్‌లో రూపుదిద్దుకుంటున్నది. దేశాన్ని ఎవరి నుంచి ఇవ్వాలి? ముస్లింల నుంచి. వలసదారుల పేరుతో దేశంలోకి చొరబడి తమ ఆచార వ్యవహారాలను ధ్వంసం చేస్తున్నవారి నుంచి. ఇది ఆందోళనకారుల డిమాండ్.

యునైటెడ్ కింగ్‌డమ్‌ను ఏకం చేయండి, మా దేశాన్ని మాకు ఇవ్వండి అంటూ లండన్‌లో లక్ష గళార్చన జరిగింది. వ్యాపారం పేరిట, పడవల మీద దేశానికి వచ్చి తిష్ట వేస్తూ, దేశీయుల అవకాశాలను, ఆర్థిక వనరులను దోచు కుంటున్న వారిని ఆపండి అంటూ ప్రభుత్వాన్ని హెచ్చరించారు ఉద్యమకారులు. చరిత్ర విని నవ్విపోయే నినాదమిది. ఈస్టిండియా కంపెనీల పేరుతో ఫ్రాన్స్, పోర్చుగీస్, ఇంగ్లండ్ అలా ప్రపంచం మీద పడి దోచుకున్నవే. తురుష్కులు కానిస్టాంట్‌నోపెల్‌ను స్వాధీనం చేసుకున్న తరువాత సముద్రమార్గాలు కనుగొని, తూర్పు దేశాలకు వచ్చారు. వాళ్లు సాగిన మార్గమంతా విధ్వంసమే. వారు వ్యాపారం పేరుతో అడుగుపెట్టిన దేశాలు తమదైన ఆత్మ తమ ముందే క్షీణించి పోతుంటే ప్రేక్షక పాత్ర వహించవలసి వచ్చింది. ఎన్ని జాతులు, ఎన్ని సంస్కృతులు, ఎన్ని భాషలు, ఎన్ని కళలు, ఎన్ని విలువలు, ఎంత విజ్ఞానశాస్త్రం ఆ కంపెనీల పదఘట్టనల కింద నిస్సహాయంగా కన్నుమూశాయో చరిత్రకు తెలుసు. ఇప్పుడు ఈ చేదు అనుభవం బ్రిటన్ అనే ఆ వలసవాద దేశానికే ఎదురైంది. నిజానికి చరిత్ర ఆ దేశానికి మేలే చేసింది. ఆ కంపెనీల ఆధునిక దృక్పథంలోని కుట్రను అర్థం చేసుకోవడానికి నాడు మనకు శతాబ్దాలు పట్టింది. కానీ కొన్ని దశాబ్దాలలోనే ఇంగ్లండ్ ముస్లిం వలసదారులతో ప్రమాదాన్ని పసిగట్టగలిగింది. 17,18,19 శతాబ్దాలలో వారు ఏం చేశారో, అదే ఇప్పుడు ముస్లిం వలస రూపంలో పునరావృత్తమైంది. వెంటనే తలకెక్కింది. ఇంగ్లండ్‌కు ఇలాంటి గుణ పాఠం

శాలివాహన 1947 శ్రీ విశ్వావసు ఆశ్వీయుజ శుద్ధ పాడ్యమి

లోపలి పేజీలలో...



ముఖపత్ర కథనం

అజరామరం..
ఆయుర్వేదం..

లోపలి పేజీలలో..

ధారావాహిక నవల

గణపతిదేవుడు

- మత్తి భానుమూర్తి

20లో

ప్రత్యేక వ్యాసం

త్రిశక్తి స్వరూపిణీ! నమోస్తుతే..

32లో

జాగృతి

సంపాదకీయం

అవసరమేనని చాలామంది భావిస్తున్నప్పటికీ, పక్క ఇల్లు కాలుతుంటే కర్తవ్యాన్ని గ్రహించడంలో విజ్ఞత, విచక్షణ అనివార్యమన్న వాస్తవిక దృష్టి ఇప్పుడు తప్పదు.

సెప్టెంబర్ 13 నాటి ఆ భారీ నిరసన ప్రదర్శన అక్షరాలా ఇస్లామీకరణకు వ్యతిరేకంగా జరిగినదే. దీనికి నాయకత్వం వహించినవారు టామీ రాబిన్సన్. అసలు పేరు స్టీఫెన్ యాక్లిస్ లెన్నాన్, పత్రికా రచయిత. లక్ష మంది నుంచి లక్షన్నర వరకు హాజరైనట్టు లెక్కలు ఉన్న ఈ ప్రదర్శన బ్రిటన్ చరిత్రలోనే అతి పెద్దదని మెట్రోపాలిటన్ పోలీసులు కూడా అంగీకరించారని వార్తలు వచ్చాయి. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ప్రపంచ కోటీశ్వరుడు ఎలాన్ మస్క్,

లండన్ ప్రదర్శన

ఫ్రాన్స్‌కు చెందిన ఎరిక్ జెమ్మర్, వలస చట్టాలకు వ్యతిరేకంగా జర్మనీలో పోరాడుతున్న పీటర్ బైస్టోన్ కూడా ఉద్రేక పూరిత ప్రసంగాలే చేశారు. గడచిన దశాబ్దకాలంగా ఇంగ్లండ్ ఇస్లామిక్ వలసదారులతో పడుతున్న అవస్థలు, అవమానాలు ఇక చాలునని, స్టార్మర్ ప్రభుత్వం మీద తిరగబడండి అన్న స్థాయిలోనే ప్రసంగించారు. బ్రిటిష్ పౌరునిగా ఉండడం తనకు గర్వకారణమేనని, కానీ దేశం తమ కళ్ల ముందే నాశనమవుతున్నదని మస్క్ నిష్కర్షగా ప్రకటించారు. కోతిపుండు బ్రహ్మరాక్షసి అయినట్టు చిన్న కోతతో మొదలయిన ఈ వలసలు ఇప్పుడు భారీ స్థాయిలో, అక్రమ మార్గాలలో దేశాన్ని కమ్మేస్తున్నాయని మస్క్ చెప్పారు. ఈ వలసలు ఇలాగే కొనసాగితే మీరు హింస కోరుకోకపోయినా దానికి బలికాక తప్పదనే ఆయన శషభిషలు లేకుండా చెప్పారు. ఇప్పుడు మీ దగ్గర ఉన్నవి రెండే మార్గాలు. ఒకటి పోరాడడం. రెండు చనిపోవడమే అని కూడా తేల్చేశారు. అసలు ఐరోపా దేశాలను ఇప్పుడు వలసదారులు భర్తీ చేస్తున్న వాస్తవాన్ని అంతా గుర్తించాలని వక్తలు కరాఖండీగా పేర్కొనడం విశేషం. వాళ్లని వెనక్కి పంపండి, మా దేశాన్ని మాకు ఇవ్వండి అంటూ వక్తలు, ప్రదర్శకులు నినదించడం తీవ్రమైన అంశమే. ఈ ప్రదర్శనకు వ్యతిరేకంగా ఉదారవాదుల ప్రదర్శనను కూడా పోలీసులు అనుమతించారు. అంటే విభజించి పాలించు లక్షణం వాళ్ల రక్తం నుంచి పోలేదు. జాత్యహంకార వ్యతిరేక పోరాటం పేరుతో ఉదారవాదులు పోటీ ప్రదర్శన నిర్వహించారు. వలసలను ఆపడం అమానుషమని వీరి అభిప్రాయం. దీనితో గొడవలు, అరెస్టులు తప్పలేదు.

కొన్ని గణాంకాలు చూస్తే టామీ రాబిన్సన్ ఆందోళనలోని వాస్తవాలను గుర్తించక తప్పదు. ఆ దేశ అధికారిక లెక్క ప్రకారమే 2024 చివరికి 5,15,697 మంది శరణార్థులు ఉన్నారు. వీరు అధికారికంగా వచ్చినవారు. అక్రమంగా వచ్చి, తరువాత దరఖాస్తు చేసుకుని, శరణార్థి హోదా కోసం తిష్ట వేసినవాళ్లు మరొక 1,24,841 మంది. కానీ అటు ఇటుగా వీళ్ల సంఖ్య 10–15 లక్షలన్నదే ఎక్కువ మంది అభిప్రాయం. కొన్నిచోట్ల స్థానికులకంటే, వలసదారులే ఎక్కువయ్యా రన్నది ఆందోళనకారుల ఆరోపణ. ఆఫ్రికా, పాకిస్తాన్ ఇతర ఇస్లామిక్ దేశాల నుంచి వచ్చినవాళ్లు నేరాలకు పాల్పడుతున్నారు. స్థానికులనే చులకనగా చూస్తున్నారు. వలసదారులకు రెడ్ కార్పెట్ పరిచి, హోటళ్లలో ఆశ్రయం కల్పిస్తూ, ఆర్థిక వనరులను వృథా చేయడం ఎందుకన్నదే తీవ్ర జాతీయవాదుల ప్రశ్న. పాకిస్తానీ గ్రూమింగ్ గ్యాంగ్‌ల పేరుతో వలసవచ్చిన వాళ్లే దాదాపు రెండున్నర లక్షల మంది ఇంగ్లిష్ బాలికల మీద వివిధ నేరాలకు పాల్పడ్డారు. ఈ వలసలు, ఈ రెడ్ కార్పెట్ ఆతిథ్యాలు ఇలాగే కొనసాగితే, ముస్లింలకో దేశం అన్న నినాదం వినిపించి తీరుతుంది. ఇదే ప్రదర్శకుల అసలు గుబులు కావచ్చు. ★

36లో

కథ

ఇంద్రచాపం

- ఎమ్. విజయ శ్రీముఖి

ఆయుర్వేద ఇతిహాసం	-	06
ఆహారమే జీవితానికి దిక్సూచి	-	08
నేటి ప్రపంచంలో ఆయుర్వేదం	-	11
జాతీయ ఆరోగ్యయాత్ర (గళమెత్తిన గతం)	-	28
మూడు రంగాల్లో మేటి (మహిళ)	-	30
కూటమి ఏలుబడిలో ప్రగతిపథాన రాష్ట్రం (ఆంధ్రప్రదేశ్)	-	34
గళం విప్పిన గాయం (వివేకాస్త్రం- ది బెంగాల్ ఫైల్స్)	-	39
మార్నింజం-శ్రీరామరాజ్యం-4	-	42
భారత విలువిద్య జట్ల సరికొత్త చరిత్ర! (క్రీడ)	-	43
'మిరాయ్'కు శ్రీరామరక్ష! (సినిమా)	-	50

ఆయుర్వేద

'శ్రీమహావిష్ణువు క్షీరసాగర మథనంలో ధన్వంతరిగా అమృతకలశంతో ఉద్భవించాడు. విషమనే వ్యాధులకు అమృతమనే ఆరోగ్యంతో సమస్త లోకాలను సంరక్షిస్తూ ఆయుర్వేద ఆది దైవంగా పూజలందుకొంటున్నాడు' అంటుంది శ్రీమద్భాగవతం.

ఆయుర్వేదం గురించి చరక సంహిత రమణీయ పౌరాణిక గాథ చెబుతుంది. ప్రాచీన కాలంలో అప్పుడప్పుడే ప్రారంభమౌతున్న వ్యాధుల వలన నిత్యనైమిత్తికాది ధర్మకార్యాలు నిర్వర్తించలేక కొంతమంది వృధ చెందుతున్నారు (అప్పటి వరకు వ్యాధులు లేవు, వైద్యులూ లేరు). వాటిని నివారించడానికి అంగీరస, జమదగ్ని, వశిష్ఠ, కాశ్యప, భృగు, ఆత్రేయ, భరద్వాజ వంటి 53 మందికి పైగా మహర్షులు హిమవత్ పర్వతం దగ్గర సమావేశమైనారు. వ్యాధుల నివారణ ఆయుర్వేదంతో సాధ్యమని జ్ఞానదృష్టితో గ్రహించారు. అలాంటి ఆయుర్వేదం బ్రహ్మదేవుని ద్వారా దక్షప్రజాపతికి, వారి నుండి అశ్వనీ దేవతలకు, అక్కడ నుండి ఇంద్రుని దగ్గరకు చేరినట్టు తెలుసుకొన్నారు. వారిలో ఉత్కృష్ట తపఃశక్తి కల్గిన భరద్వాజ మహర్షి సశరీరంతో ఇంద్రుని వద్దకు వెళ్లి ఆయుర్వేదం గ్రహించి వచ్చి, మహర్షులందరికి యథాతథంగా అందించాడు. వెనువెంటనే రుషులందరు శిష్యులతో ప్రజల ఆరోగ్యాన్ని సంరక్షించేందుకు జనపదాలలో సంచారం ప్రారంభించారు.

ఆత్రేయ మహర్షి కూడా అగ్నివేశాది ఆరుగురు శిష్యులతో వైద్యసేవ చేస్తూ శిష్యులకు శిక్షణనిస్తూ సంచారం చేస్తున్నాడు. సునిశిత బుద్ధి కుశలత కల్గిన అగ్నివేశుడు గురువు బోధనలు, సంభాషణలు, నిర్వహించిన సభలు, చర్చలు యథాతథంగా గ్రంథస్థం చేశాడు. అదే 'అగ్నివేశ తంత్రం'. తరువాతి కాలంలో చరక మహర్షి దీనిని సంస్కరించినందున "చరక సంహిత"గ జగత్ ప్రసిద్ధిపొంది ప్రామాణిక గ్రంథంగా అవతరించింది. వేయి సంవత్సరాల క్రిందటే, గ్రీసు, టిబెట్, అరబ్బి, పార్శి భాషలలోకి ఈ గ్రంథం అనువదించుకున్నారు. దేశభాషలన్నిటితో పాటు లాటిన్, ఆంగ్లం, జర్మన్, చైనీస్ భాషలలోకి తర్జుమా అయింది.

తరువాత కాలంలో అపర ధన్వంతరిగా కాశీ పట్టణంలో అవతరించిన వాడే దివోదాసు. ఆయన శస్త్ర వైద్య పారంగతుడు. అతని కడపటి శిష్యుడు సుశ్రుతుడు. 'సుశ్రుత సంహిత' రచించాడు. ఇది శస్త్ర చికిత్సలో మొదటి ప్రామాణిక గ్రంథం. తదుపరి సిద్ధ నాగార్జునుడు 'ఉత్తర తంత్రం' రచించి సుశ్రుత సంహితను సంపూర్ణ గ్రంథంగా సంస్కరించాడు. చైనా, అరబిక్, లాటిన్, జపాన్, ఆంగ్ల భాషలలోకి దీనిని అనువదించుకున్నారు.

తరువాత వాగ్భటుడు అనే కవి, వైయాకరణుడు, వైద్యుడు, చరక సుశ్రుతాది గ్రంథాలలోని విషయాలను క్రమబద్ధం చేసి, క్రొత్తవి జోడించి 'అష్టాంగ హృదయం' రచించాడు. వివిధ వృత్తాలతో, మనోహర శైలిలో, సుబోధకంగా, ధారణాయోగ్యంగా, కంఠస్థం చేయదగు సూత్రాలతో ఇది ప్రమాణ గ్రంథమై అంతట ఖ్యాతి పొందింది.

చరక సంహిత (8 స్థానాలు 120 అధ్యాయాలు), సుశ్రుత సంహిత (6 స్థానాలు 186 అధ్యాయాలు) అష్టాంగ హృదయం (6 స్థానాలు 120 అధ్యాయాలు) ఈ మూడు 'వృద్ధత్రయం' పేరుతో పిలుచుకునే మొదటి ప్రమాణ గ్రంథాలు. కాలక్రమేణ దేశమంతట వైద్యులు, పండితులు, యోగులు, సిద్ధులు క్రొత్త ఆవిష్కరణలతో వందలాది గ్రంథాల రచన కొనసాగించారు. వాటిలో మాధవకరుని 'మాధవ నిదానం', 'శారంగధర సంహిత', భావమిశ్రుని 'భావ ప్రకాశ్' లఘుత్రయం పేరుతో ఉన్న ప్రమాణ గ్రంథాలు.

వేలాది సంవత్సరాల పూర్వమే నలంద, తక్షశిల, విదర్భ, కాశి మొదలైన పట్టణాలు గొప్ప విద్యాకేంద్రాలలో అనేక శాస్త్రాలతోపాటు ఆయుర్వేద (చికిత్సా శాస్త్ర) బోధన ఉండేది. తక్షశిల విశ్వవిద్యాలయం అష్టాంగ (కాయ, బాల, గ్రహ, ఊర్ధ్వాంగ, శల్య, దంష్ట్ర, జర, వృష) చికిత్సా శాస్త్ర బోధనకు పేరుపొందింది. అష్టాంగ ఆయుర్వేదాచార్యుడిగా ఖండాంతర ఖ్యాతి నార్జించిన జీవకుడు ప్రధానాచార్యుడుగా ఉంటూ బుద్ధభగవానునికి రాజవైద్యుడిగా నియమితుడైనాడు.

మౌర్యచంద్రగుప్తుడు, అశోకుడు, కనిష్కుడి నుండి విజయనగర ప్రభువుల వరకు అన్ని జనపదాల (నగరాలు, పట్టణాల)తో వైద్య పాఠశాలలు, చికిత్సా కేంద్రాలు, ప్రసూతి గృహాలు, జ్యోతిషం, సంగీతం, కథలు, పురాణాలు, మనోధైర్యం కలిగించు నేర్పరితనం కలిగిన వైద్యులు, పరిచారకులను నియమించి ఉచిత వైద్యం అందరికి అందుబాటులో ఉంచి ఆరోగ్యదానం పుణ్యకార్యంగా భావించేవారు.

యావద్దేశంలో వేలాది తెలుగునాట వందలాది శిలా, తామ్ర శాసనముల ద్వారా 11వ శతాబ్దము నుండి 16వ శతాబ్దము వరకు వైద్యులు, వైద్యశాలలు, ఔషధాలు ప్రజారోగ్య రక్షణలో అత్యున్నత స్థితిలో ఉన్నట్లు తెలుస్తుంది.

వైద్య గంజాం కృష్ణప్రసాద్

ఇతిహాసం

క్రీ.శ 1,2 శతాబ్దాలలో ఈజిప్ట్, గ్రీసు, బాగ్దాద్‌ల వరకు ఆయుర్వేదం విస్తరించింది. ముఖ్యంగా బాగ్దాదు నగరంలో ఖలీఫాలు భారతదేశం నుండి వైద్యులు, పండితులను రప్పించి అంతర్జాతీయ వైజ్ఞానిక కేంద్రాలు, చికిత్సాకేంద్రాలు నడిపించారు. 10వ శతాబ్దములో మంగోలుల దండయాత్రలతో ఆ సంస్కృతి, అరేబియా విజ్ఞానం ధ్వంసమైనాయి.

క్రీ.శ. 12వ శతాబ్దం నుండి భారతదేశంపై విదేశీ దురాక్రమణదారుల దండయాత్రలతో ధర్మ సంస్కృతుల విధ్వంసాల పరంపర ప్రారంభమై మొగలుల ఆక్రమణలతో తీవ్రమైంది. ఆయుర్వేద వైద్యులను కొంత ఆదరించినప్పటికి ఔరంగజేబు లాంటి పరమత ద్వేషులు హైందవధర్మం, ఆయుర్వేదం నాశనం చేయడమే ధ్యేయంగా పరిపాలన సాగించారు. యునాని వైద్యానికి ప్రాధాన్యతనిచ్చి పోషించారు.

తరువాత కాలంలో వచ్చిన ఆంగ్లేయులు అవసర నిమిత్తం కొద్దిమంది ఆయుర్వేద వైద్యులకు బిరుదులిచ్చినప్పటికి ఆంగ్ల వైద్య కళాశాలలు, వైద్యశాలలు రాజాదరణతో నిర్వహించి ఆయుర్వేదానికి గుర్తింపు లేకుండా చేశారు. పైగా ఆయుర్వేదం పట్ల దురభిప్రాయం, ఆంగ్ల వైద్యం మీద ఆకర్షణ పెంచే రీతిలో ప్రచారం చేసారు. అలా వందల సంవత్సరాలుగా ఆయుర్వేద ప్రాభవం మసకబారిపోయింది.

దేశంలో జాతీయవైద్యశాస్త్ర (ఆయుర్వేద) పునర్వైభవ యజ్ఞంలో ఎందరో పరంపరాగత వైద్యులు, పండితులు, వైజ్ఞానికులు ఆ జీవనపర్యంతం కఠోరమైన కృషి చేసారు. వారిలో కొందరు: కవిరాజ్ గంగాధరరాయ్(1798–1885 తూర్పు బెంగాల్), పండిత్ శంకర్ దాజి పడే శాస్త్రి (1867–1909 నాశిక్), వైద్యరత్న పండిత్ దివి గోపాలాచార్యులు (1872–1920 చెన్నపట్నం), కవిరాజ్ గణనాథ్ సేన్ సరస్వతి (1877–1945 కలకత్తా), డా॥ ఆచంట లక్ష్మీపతి (అగ్నివైద్యులు/ 1880 – 1962 చెన్నపట్నం), వైద్య యాదవ్‌జి త్రికంజి ఆచార్య (1881–1956 బొంబాయి), వైద్యరత్న కెప్టెన్ జి. శ్రీనివాసమూర్తి (1887–1945 చెన్నపట్నం), (పండిత్ శివశర్మ (1906–1980 లాహోర్–ఢిల్లీ).

వీరి కృషితో 1907 సం. అఖిల భారత ఆయుర్వేద విద్యాపీఠం చెన్నపట్నంలో ప్రారంభమై ఢిల్లీ వరకు విస్తరించింది. అనువంశిక ఆయుర్వేదం చేసే వారికి, ఆయుర్వేదం చదువుకొన్నవారికి ఆయుర్వేదాచార్య, ఆయుర్వేద విశారద లాంటి పరీక్షలు దేశమంతట నిర్వహించి ప్రమాణ పత్రాలు ఇచ్చి వారందరు గుర్తింపు పొందిన వైద్యులుగా అవకాశం పొందారు.

తెలుగునాటి ప్రసిద్ధి చెందిన కవులు కళాకారులు పద్య, గద్య, సామెతల రూపంలో ఆయుర్వేద సూత్రాలు ప్రజల మనసులలో నిరంతరం నిలిచి ఉండేటట్లు చేశారు. 1918 సం॥ నుండి 'ధన్వంతరి' 'ఆయుర్వేద సమ్మేళనం' లాంటి పదుల సంఖ్యలో పత్రికలు ప్రారంభమయినాయి.

1901లో చెన్నపట్నం, 1908లో మైసూరు, 1922లో విజయవాడ, 1927 లో బెనారస్, 1935లో హైదరాబాద్, 1946లో జామ్‌నగర్‌లలో ఆయుర్వేద కళాశాలలు ప్రారంభించారు. నేడు దేశంలో వందలాది కళాశాలలతో శిక్షణ (బి.ఎ.ఎమ్.ఎస్, ఎమ్.డి, ఎమ్.ఎస్., సూపర్ స్పెషాలిటీ) పూర్తి చేసుకొన్నవారు వేలాది మంది వైద్య వృత్తిలోకి వస్తున్నారు.

1988 సం॥లో ఢిల్లీలో రాష్ట్రీయ ఆయుర్వేద విద్యాపీఠం ఏర్పడి అనాదిగా ఉన్న గురు శిష్య పరంపరను తిరిగి కొనసాగిస్తూ అనేక కార్యక్రమాల ద్వారా యువవైద్యులలో ప్రామాణికతను సమర్థతను పెంచడంలో విజయం సాధిస్తున్నది. కేరళ జగత్ ప్రసిద్ధి పొందిన ఆయుర్వేద వైద్యశాలలు, ఔషధ నిర్మాణశాలలు కలిగి అనుభవ పరంపరను ప్రామాణికతతో కొనసాగిస్తూ నూతన ఆవిష్కరణలతో ప్రత్యేకత చాటుకొంటున్నది.

ఆలిండియా ఇనిస్టిట్యూట్ అప్ ఆయుర్వేద ఏ.ఐ.ఐ.ఏ ఢిల్లీలో 2017 సం॥ ప్రారంభమై అనేక శాస్త్రీయ పరిశోధనలు సేవలతో పురోగమిస్తున్నది. కొవిడ్ లాంటి మహమ్మారి నుండి ప్రజారోగ్యం కాపాడడంలో ఆయుర్వేదమే కీలక పాత్ర పోషించినది.

గ్లోబల్ ఆయుష్ ఇన్వెస్టమెంట్ అండ్ ఇన్నోవేషన్ సమ్మిట్‌ను గుజరాత్‌లోని గాంధీనగర్‌లో ప్రధాని నరేంద్రమోదీ 2022 సం॥లో ప్రారంభించారు. అర్జంటినా, బ్రెజిల్, కెనడా, మెక్సికో, ఫిలిప్పైన్స్ లాంటి దేశాలనుండి వచ్చిన ప్రముఖులతో చర్చలు, సంభాషణలు సమావేశాలు, ప్రదర్శనలు జరిపారు. ఉన్నత స్థాయి పరిశోధనలు పరిశ్రమలు, సేవలు ప్రారంభిస్తూ ఈ కార్యము యోజనా బద్ధంగా ప్రపంచవ్యాప్త విస్తరణ, వికాసదిశగా సాగుతున్నది.

ధన్వంతరి జయంతి (దీపావళికి ముందువచ్చు ధన త్రయోదశి) ని 2016 సం॥ నుండి ఆయుర్వేద దినోత్సవంగా భారత ప్రభుత్వం వివిధ కార్యక్రమములతో నిర్వహిస్తున్నది. 2024లో 9వ ఆయుర్వేద దినోత్సవంలో ప్రధాని నరేంద్రమోదీ ఢిల్లీలో ఏ.ఐ.ఐ.ఏ (ఆల్ ఇండియ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద) నాలుగు ఎక్స్‌లెన్స్ సెంటర్స్‌ని ప్రారంభించారు దాదాపు 150 దేశాలలో కార్యక్రమాలు జరిగాయి. ప్రతి సంవత్సరం సెప్టెంబరు 23వ తేదీ ఆయుర్వేద దినోత్సవంగా భారత ప్రభుత్వం ప్రకటించుట ద్వారా భారతదేశం ఆయుర్వే దానికి ప్రపంచ క్యాలండర్ గుర్తింపునిచ్చింది.

2025 ఆయుర్వేద దినోత్సవాన్ని ఉత్సవకార్యక్రమంగా కాకుండా పర్యావరణ సమతుల్యత, జీవనశైలి, రుగ్మతలు, వాతావరణ సంబంధిత వ్యాధులు, మానసిక వత్తిడి నిర్వహణ వంటి సమకాలీన సవాళ్లపై ప్రపంచ వ్యాప్తంగా దృష్టి సారించనుంది. ఈ విధంగా నిత్య నూతనమైన ఆయుర్వేదం "సర్వేసంతు నిరామయాः" సాధనకు విశ్వవ్యాప్త దిశగ కదులుతున్నది.

"సోఽయ మాయుర్వేద శ్శాశ్వతో నిర్దిశ్యతే
అనాదిత్వాత్
స్వభావ సంసిద్ధలక్షణత్వాత్
భావస్వభావ నిత్యత్వా చ్చ"

అనే చరకుని వచనానుసారం ఆయుర్వేదం నిరంతరం ప్రకాశిస్తూనే ఉంటుంది.

సర్వే జనాः
సుఖినోభవంతు

వ్యాసకర్త: చరక ఆయుర్వేద ఆశ్రమం సికింద్రాబాద్ నిర్వాహకులు

ప్రతి మెతుకూ బ్రహ్మస్వరూపంగా భావించగలిగితే, తినే తీరులో గౌరవం, శాంతి, ఆరోగ్యభద్రత - ఇవన్నీ కలుగుతాయి. శరీరంలో ఆమ్లత తగ్గుతుంది. అరిగే ప్రక్రియ తేలికవు తుంది. తినే పరిమాణం సజీవంగా నియంత్రిత మవుతుంది. మానసిక ఉద్వేగాలు పొట్టపై ప్రభావం చూపకుండా ఉంటాయి. తినే ఆహారం నమ్మకంగా ఉంటే మనసు నిజంగా మనవైపే ఉంటుంది

◆ యథా అన్నం తథా మనః

ఆహారమే జీవి

"హృదయం చేతనాధిష్ఠానం" అంటుంది ఆయుర్వేదం. ఆహారమే ఈ చైతన్య ప్రవాహానికి దిశానిర్దేశం చేస్తుంది. ఆహారం శుద్ధిగా ఉంటే మనసు శుద్ధిగా ఉంటుంది. మన భోజన విధానం ఓ తపస్సులాంటిది. మౌనం, కృతజ్ఞత, ధ్యానం ఇవన్నీ పవిత్ర పోషకాలు!

"యథా అన్నం తథా మనః"- 'నువ్వు తినేదే నువ్వు అవుతావు' అనేది సూత్రం. ఆహారం ద్వారానే ఆత్మాభివృద్ధి, మానసిక ఉన్నతి సిద్ధిస్తాయి. మన ఆహారమే మన ఆరోగ్యాన్ని, మనస్తత్వాన్ని, జీవన ధోరణిని నిర్ణయిస్తుంది.

ఆహారం ఒక మౌనయోగం. మనసు స్థిరంగా ఉంటే, ఆహారం సమగ్రంగా అరిగి, శక్తిగా మారు తుంది. ఆగ్రహం, దిగులు, తొందర-వీటికి లోను కాకుండా ప్రశాంతంగా తింటే శరీరం సులభంగా జీర్ణం చేయగలుగుతుంది. తినే పరిమాణాన్ని మనమే నియంత్రించ గలుగుతాం. ఎలాంటిది తింటున్నామో, ఏ పరిస్థితుల్లో తింటున్నామో, మన మనసూ అలాగే ఉంటుంది. అన్నాన్ని గౌరవించి శాంతి భావనతో భుజించాలి! "భోజన కాలే గోవిందనామ స్మరణ" అందుకే!

ఆయుర్వేదం ఆహార మనస్తత్వ శాస్త్రం!

ఆయు స్సత్వ బలారోగ్య సుఖ ప్రీతి వివర్ధనాః
రస్యాః స్నిగ్ధాః స్థిరా హృద్యా ఆహారాः సాత్వికప్రియాः
కట్వామ్ల లవణాత్యుష్ణ తీక్ష్ణ రూక్ష విదాహినः
ఆహారా రాజస స్యేష్టా దుःఖశోకామయ ప్రదాः
యాతయామం గతరసం పూతి పర్యుషితం చయత్
ఉచ్ఛిష్టమపి చామేధ్యం భోజనం తామసప్రియమ్

భగవద్గీత "శ్రద్ధాత్రయవిభాగ యోగం"లో వ్యాసులవారి వివరణ ఇది! మనం తినే తిండిని బట్టి మన మనస్తత్వం, నడవడి, మన ఆరోగ్యం ఎలాంటివో చెప్పవచ్చునంటారీ శ్లోకాల్లో! కొందరు కొన్నింటినే ఇష్టపడతారు. ఈ ఇష్టానిష్టాలకు కారణం వారివారి మనస్తత్వాలే!

'కాశ్యప సంహిత' అనే ఆయుర్వేద గ్రంథం "సత్త్వం ప్రకాశకం విద్ధి, రజశ్చాపి ప్రవర్తకమ్ తమో నియామకం ప్రోక్త మన్యోన్య మిథున ప్రియమ్" అని పేర్కొంది. సత్త్వగుణం- ప్రకాశకం. రజోగుణం- ప్రవర్తకం, తమోగుణం- నియామకం అనే ధర్మాలతో ఈ మూడూ పరస్పరం కలిసి మనిషి మనసుని ఏర్పరుస్తున్నాయని, ఈ మనసు సాత్వికం, రాజసం, తామసం అని మూడు రకాలుగా ఉంటుందని దీని భావం!

మన ఆహార పదార్థాలు ఈ మూడుగుణాల్లో దేన్నో ఒకదాన్ని పెంపు చేసేవిగా ఉంటాయని భగవద్గీత ప్రతిపాదించింది. మన ఆహారమే మన నడవడికి మూలం. 'ఆహారం సైకాలజీ' శాస్త్ర పితామహుడు వ్యాసులవారే!

1. సాత్విక ఆహారం:

"రస్యాः"=పాలు, పంచదార లాంటివి. "స్నిగ్ధాः" = వెన్న నెయ్యి లాంటివి. స్థిరః ఎక్కువ కాలం ప్రభావం ఉండే కేరట్, బూడిద గుమ్మడి లాంటివి, "హృద్యాः"=మనసుకు ఇంపుగా అనిపించేవి. ఇవన్నీ ఆయుష్షుని, సత్త్వ అంటే ఉన్నత వ్యక్తిత్వం, ఆరోగ్యం, సుఖం, సంతృప్తి వీటిని వృద్ధి చేస్తాయి. అవి ఇష్టపడే వ్యక్తులు సాత్విక స్వభావులై ఉంటారన్నాడు. సాత్విక ఆహారం అంటే నాణ్యమైన ఆహారం అని!

దాని వలన మనలో సత్త్వగుణం ఉదయస్తుంది. పాలు, పంచదార, నెయ్యి తిన్నంత మాత్రాన మనుషులు సాత్వికులైపోతారా? అని అడగవచ్చు. లోకంలో ఇంకా మంచితనం బతికుందంటే, సామాజిక వ్యవస్థ నిలబడి ఉందంటే, మనుషులు కొంతైనా సాత్విక పదార్థాలు తీసుకుంటూ ఉండటమే కారణం.

2. రాజస ఆహారం:

వేపుడు పదార్థాలు, మసాలాలు, ఉల్లి, వెల్లుల్లి, ఊరుగాయలు, మద్యపానం వంటివి ఆతురత, కోపం, వికారాల్ని పెంచుతాయి. ఈ రకమైన ఆహారాన్ని ఇష్టపడేవారు యుక్తి కన్నా అహంకారంతో నడిచే స్వభావం ఉన్న వాళ్లు. సమాజంలో హింస, శోకం, అసమానతలకు ఈ రాజస ఆహారమే కారణం. తన పైన తనకు అదుపు లేకుండా ప్రవర్తించే తత్వం రాజసం. ఇవి చింత, శోక, భయ దుఃఖాదుల్ని, బీపీ గుండె జబ్బులు కిడ్నీ జబ్బుల్ని కలిగిస్తాయి. మద్యపానం చేస్తే కామం లాంటి రాజస లక్షణాలు బయటకొస్తాయి. ఇలాంటి ఆహారాల్ని రాజసతత్వం కలిగిన వాళ్లే ఇష్టపడతారు. రాజస ఆహారంతోనే లోక కలహాలు! సమాజంలో పరివర్తన రావాలంటే ఈ రాజసాహారం గురించిన హెచ్చరిక ప్రజలకు బలంగా అందాలి

3. తామస ఆహారం:

సగం పండిన పండ్లు, రుచిని కోల్పోయిన పదార్థాలు, దుర్వాసన కొడుతున్నవి, పాచిపోయినవి,

డా॥ జి.వి. పూర్ణచందు

◆ ఆయుర్వేదంలో భోజన సైకాలజీ

తానికి దిక్సూచి

సగం తిని వదిలేసినవి, అపవిత్ర, శుద్ధిలేని వాటిని తమోగుణ ప్రధానులే ఇష్టపడతారన్నాడు. యాతయామం=expiry date దాటిపోయినవి గతరసం= రసహీనమైనవి, పోషకాల్లేని పిజ్జాలు, మైసూరు బజ్జీల్లాంటి జంక్ ఫుడ్స్ పూతీ=కుళ్లి పోయినవి, పుచ్చిపోయినవి, పర్యుషితం=తాజాదనం కోల్పోయినవి, నిన్ననెప్పుడో వండినవి ఇలాంటివి తమోగుణాన్ని పెంచుతాయి. తామసులే వీటిని ఇష్టంగా తింటారు. తమోగుణం జడత్వాన్నిస్తుంది. శరీరాన్ని, మనోబలాన్ని కూడా ఇవి దెబ్బతీస్తాయి. ఆలస్యం, అయోమయం, అధోగతి వీరి లక్షణాలు. లోకానికి ఏ విధంగానూ ఉపయోగ పడని నిరర్థకజీవులు!

గోబ్లిన్ మోడ్ అనే కొత్త పదాన్ని ఆక్స్‌ఫర్డ్ నిఘంటువులో చేర్చారీ మధ్య. ఏదీ పట్టనితనం, దేనికీ స్పందించక పోవటం, ఎవరెలా పోతే మనకెందు కనుకోవటం ఇవి 'గోబ్లిన్ మోడ్'లో ఉన్న వ్యక్తుల లక్షణాలు. తామస పదార్థాలు తింటే ఇలాంటి లక్షణాలు పెరుగుతాయి.

1903లో george walther groddeck అనే జర్మన్ వైద్యుడు–శరీర ధర్మాలన్నీ మనిషి తినే ఆహారాన్ని బట్టే ఉంటాయని ఒక ప్రతిపాదన చేశాడు. మనసు లోపల ఉండే అంతశ్చేతన మూడు గుణాలు కలిగి ఉంటుందన్నాడు. 1923లో "ది ఈగో అండ్ ది ఇడ్" (Das Ich und das Es) అనే పుస్తకంలో ఫ్రాయిడ్ ఈ గ్రాడెక్ ద్వారానే తాను ఇడ్ (తమోగుణం), ఈగో(రజోగుణం), సూపర్ ఈగో లేదా ఈగో ఐడియల్ (సత్త్వగుణం) అనే త్రిగుణాల గురించి తెలుసుకున్నట్టు రాశాడు. గ్రాడెక్ గారిని 'సైకో సొమాటిక్ మెడిసిన్' కు అలాగే, ఫ్రాయిడ్‌ను సైకో ఎనాలిసిస్ సిద్ధాంతానికి పితామహులుగా ప్రకటించారు.

కానీ, వీళ్లకి కనీసం 2000 యేళ్ల క్రితమే సత్వరజస్తమో గుణాల గురించి చెప్పిన వ్యాసుల వారిని గానీ, సాంఖ్యులను గానీ, ఆయుర్వేద గ్రంథాలను గానీ విస్మరించారు.

ఆహారం - మనసు అనుబంధం

"Can diet impact mental health?" అనే ప్రశ్న వైద్యరంగంలో చర్చలో ఉంది. "Although nutrition certainly does appear to have an impact, there are still many gaps in our knowledge'' అంటే, ఆహారంలో ఉన్న పోషకాలు మన మానసిక స్థితిని ప్రభావితం చేస్తాయన్నది స్పష్టమే, కానీ దాని స్థాయి, విధానం ఇంకా స్పష్టత కావాలి... అని రాస్తున్నారు ఆధునిక పరిశోధకులు. ఆ స్పష్టతని ఆయుర్వేద గ్రంథాలిస్తు న్నాయి.

న్యూట్రిషనల్ సైకియాట్రీ అనే ఆధునిక శాఖ "Food & Mood" అనే విషయమై పరిశోధిస్తూ, కాఫీ, పంచదార, పసుపు, మిర్చి, కాకరకాయ వంటి పదార్థాలలోని రసాయనాలు మెదడు చర్యలపై ప్రభావం చూపుతున్నాయని కనుగొంది.

గోథెన్‌బర్గ్ యూనివర్సిటీకి చెందిన డాక్టర్ సుజన్నె డిక్సన్ "Poor diet is junk for the brain - it may lead to mental disorders" నిస్సారమైన ఆహారం మానసిక అయోమయ స్థితికి దారితీస్తుందని పేర్కొన్నాడు!

ఆహారంతోనే డిప్రెషన్, ఆందోళన, ఆలోచనా స్పష్టతపై ప్రభావం ఉంటుందని కొత్త శాస్త్ర శాఖ "న్యూట్రిషనల్ సైకియాట్రీ" చెబుతుంది: ఆహారం శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక స్థితిని కూడా ప్రభావితం చేస్తుందని, తినేది ఏమిటన్నదానితో పాటు, ఎలా, ఎంత ఎప్పుడెప్పుడూ అన్నది కూడా తగినంత విజ్ఞతతో నిర్ణయించాలని ఆయుర్వేదం చెప్తుంది.

ఒక్క చిన్న ఉదాహరణతో ఈ విషయాన్ని మరింత తేలికగా బోధపరచవచ్చు:

పంచదార తినంగానే శరీరానికి ఉత్తేజం, మనసుకు ఆనందం కలుగుతాయి. కానీ, మళ్లీమళ్లీ తినాలనే యావ పెరిగి తీపిని వ్యసనంగా మార్చు తుంది. Knüppel et al., Scientific Reports, 2017: అధిక చక్కెర డిప్రెషన్, ఆందోళనకు కారణం అని పేర్కొంది!

"యద్దుఃఖం చ మోహం చ, యత్ తామసం ప్రోచ్యతే" మోహం, దుఃఖం కలిగించే ఆహారం తామసికం. సాత్వికమైన చక్కెర తినే విషయంలో నియంత్రణ కోల్పోతే షుగరు పెరగటమే కాదు, డిప్రెషన్ కూడా కలుగుతుందని హెచ్చరిస్తోంది!

భోజనం ఓ తపస్సు

భోజనం అనేది కడుపు నింపటం, పోషించడా లకే కాదు, అది మానసిక పరిపక్వతకు కూడా కారణం అవుతోంది. ఆరోగ్యదాయక భోజన సమృద్ధి ఒక తపఃఫలం. నాణ్యత లేని జంక్ పదార్థాలను ఆబగా తినేవారికి ఎంత డబ్బున్నా ఆ తపఃఫలం దక్కదు.

'భోజనశక్తి' కూడా తపఃఫలమే! వ్యాధులతో నహజీవనం చేస్తూ, షడ్రసోపేత భోజనానికి దూరమైనవారు ఈ తపఃఫలాన్ని కోల్పోతారు. ఆరోగ్యకర ఆహారం పొందటం, సంతుష్టిగా తినటం, ఆహారం మంచిచెడులు అందరికీ చాటి చెప్పటం, అన్నార్తులకు అన్నదానం చేయటం ఇవన్నీ తపఃఫలాలు.

"ఓజస్తేజోద్యుతిధరు"డని భగవంతుణ్ణి పిలుస్తారు. ఓజస్సు(ప్రాణబలం), తేజస్సు (దేహబలం), ద్యుతి (దేహకాంతి) ఈ గుణాలన్నీ అన్నం వలనే సిద్ధిస్తాయి. అన్నం దేవుడి స్వరూపం. మంచి మనసుని, ఆరోగ్యాన్ని, ఆయు వునీ ఇస్తుంది. వీర్యపుష్టి, బలం, శరీరకాంతి పెరుగుతాయి. దప్పిక, తాపం, బడలిక, అలసట తగ్గుతాయి.

"అన్నం వృత్తికరాణాం శ్రేష్ఠః"– పోషకాల్లో అన్నమే శ్రేష్ఠమైందన్నాడు చరకుడు. **"న చ ఆహారసమం కించిత్ భైషజ్యం ఉపలభ్యతె"** ఆహారంతో సమానమైన ఔషధం లేదని కూడా ప్రకటించాడు. మన వైద్యులు ఆహార ఔషధాలను వదిలి, కేవలం మందులతో రోగాల్ని తగ్గించాలని చూడటం వలన మామూలు రోగాలు కూడా దీర్ఘవ్యాధులుగా మారిపోయి, వైద్యం అనేది ఖరీదైన అంశం అయింది.

అన్నానికి కొన్ని లక్ష్యాలు, లక్షణాలు ఉన్నాయి. ఆరోగ్యవంతుడి ఆరోగ్యాన్ని కాపాడటం, అనారోగ్యాన్ని తగ్గించటమే దీని లక్ష్యం, లక్షణం కూడా! అన్నం లేనిది జీవనం లేదు. ఔషధ గుణాల లేనిది అన్నం కాదు. మన వంటపద్ధతులు కేవలం రుచి కోసం కాదు. శక్తి, సుఖం, సార్థకమైన జీవనానికోసం.

అన్నం అంటే ఆకలి కోసం కాదు. అది శరీరానికి శక్తి, మనసుకు మైత్రి, జీవితానికి దిక్సూచి.

మన పూర్వులు ఆహారాన్ని ఔషధంగా చూశారు. దానిలోని శక్తిని అశ్వశక్తిగా గుర్తించారు శరీరానికే కాదు, మనసుకీ, ఆత్మకు కూడా జీవం ఇస్తోంది! అన్నం ఓ రుచి కాదు ఔషధం! ఓ అలవాటు కాదు జీవన శక్తి! ఓ ఆడంబరం కాదు ఆరోగ్యం! అదిజీవనశక్తి, పునరుత్పత్తి శక్తికి అనుసంధానం! అందుకే, అన్నానికి దణ్ణం! ★

వ్యాసకర్త: ప్రఖ్యాత ఆయుర్వేద వైద్యులు, విజయవాడ, 9440172642

ఆయుర్వేదంలో జలగవైద్యం

శాస్త్రీయంగా చిత్రించిన ధన్వంతరి చిత్రం కుడిచేతిలో అమృతకలశం కనిపిస్తుంది. ఎడమ చేతిలో ఒక బండ గీత ఉంటుంది. అది జలగ. పురాతన వైద్యంలో ప్రధాన పరికరం. పురాతన కాలమనే కాదు, 20వ శతాబ్దం ఆరంభం వరకు, అంటే యాంటీబయోటెక్స్ కనుగొనే వరకు జలగలే కొన్ని వ్యాధులను నయం చేయడంలో కీలకంగా ఉపయోగపడినాయి. ప్రముఖ ఆయుర్వేద గ్రంథం 'సుశ్రుత సంహిత'లో జలగ వైద్యం గురించి ఒక అధ్యాయమే ఉంది. ఆధునిక కాలంలో దీనినే మెడిసినల్ లీచ్ థెరపీ (ఎంఎల్‌టీ) అంటున్నారు. లేదా హిరుడినో థెరపీ అంటారు. కొత్త తరహా యాంటీబయోటిక్స్ రాకతో (1930) కొద్దికాలం జలగల థెరపి తగ్గు ముఖం పట్టినా, ఇటీవలి దశాబ్దాలలో మళ్లీ గుర్తింపు పొందుతున్నది.

ఆయుర్వేదంలో రక్తమోక్షణ కర్మ (బ్లడ్‌లెట్టింగ్) ఒక ప్రధాన వైద్య ప్రక్రియ. రక్తజ రోగ (రక్తకణాలలో వచ్చిన దోషంతో వచ్చే వ్యాధి) ఒక వ్యాధి. క్రీస్తు పూర్వం 100-600 సమయంలో వచ్చిన సుశ్రుత సంహిత జలగల వైద్యం గురించి ప్రస్తావించింది. అప్పటి నుంచి ఈ వైద్య ప్రక్రియ మీద వాదప్రతివాదాలు ఉన్నాయి. యూరప్ అంతటా మెడిసినల్ లీచ్ థెరపీ ఉంది. నెపోలియన్ సైన్యంలో డాక్టర్ ఒకరు దీనిని సిఫారసు చేశాడు. 1829-1840 మధ్య పర్షియాలోని ఆసుపత్రులు యాభయ్ నుంచి అరవై లక్షల జలగలు వాడినట్టు ఆధారాలు ఉన్నాయి. ఇదే కాలంలో యూరప్ ఆరు కోట్లు, రష్యా మూడు కోట్లు జలగలను ఉపయోగించాయి. 1980లో అవయవ మార్పిడి శస్త్ర చికిత్సలో నరాలలో గడ్డకట్టిన రక్తాన్ని తొలగించడానికి జలగలను ఉపయోగించారు. 1985లో తెగిన చెవితో వచ్చిన ఐదేళ్ల బాలుడికి హార్వర్డ్ వైద్యుడు జోసెఫ్ ఎంఎల్‌టీ ద్వారా వైద్యం చేశారు. ఆ విధానాన్ని ఉపయోగించి చెవిని అతికించారు. జూన్ 28,2004న ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డీఏ) ఎంఎల్‌టీని వైద్య ప్రక్రియగా నిర్ధారించింది.

శస్త్ర చికిత్సలతో పాటు ఇతర వైద్య ప్రక్రియలలో జలగలను వినియోగించడానికి కారణం హిరుడిన్. హిరుడిన్ అంటే జలగ లాలాజలంలో ఉండే పదార్థం. రక్తాన్ని గడ్డకుండా నిరోధించడం దీని సహజ గుణం. కాబట్టి రక్త ప్రసారం సజావుగా సాగడానికి, వేగం పెరగడానికి కూడా హిరుడిన్ ఉపయోగపడుతుంది. దీనితో శరీరంలో ఆక్సిజన్, న్యూట్రియంట్స్, శరీర కణాలు వృద్ధి జరుగుతుంది. బాధ, మంటను, వాపును తగ్గిస్తుంది. మృతకణాలను తొలగించి, రక్త ప్రసారాన్ని సరిచేసి గాయం తొందరగా మానేందుకు హిరుడిన్ దోహదపడుతుంది. శరీరంలో చేరిన వ్యర్థాలు, విషతుల్యమైన పదార్థాలను తొలగించే శక్తి హిరుడిన్‌కు ఉంది. కొన్ని చర్మవ్యాధుల నివారణకు కూడా ఎంఎల్‌టీ ఉపయోగపడుతుంది. దానితో దాదాపు పదకొండు రకాల వైద్యసేవలు అందుతాయి.

శరీరంలో సమస్య ఉన్న చోట ఒకటి లేదా రెండు జలగలను పట్టిస్తారు. మెడిసినల్ లీచ్‌కి మూడు దవడ భాగాలు ఉంటాయి. ప్రతి భాగంలోను ఒక వరస పళ్లు ఉంటాయి. మనిషి శరీరంలోకి ఈ పళ్లను చొప్పించి (రక్త ప్రతిస్కందక) లాలాజలంలోని హిరుడిన్‌ను పంపిస్తుంది. ఈ ప్రక్రియలో జలగలు పీల్చేది కొన్ని మిల్లీ లీటర్ల రక్తమే. వాటి లాలాజలానికి 12 వ్యాధి నిరోధక లక్షణాలు ఉన్నాయి.

ఆయుర్వేదంలో వైద్య విధానం గొప్ప ప్రాధాన్యం పొందింది. రోగాన్ని బట్టి వీటిని వినియోగించేవారు. ట్యూమర్లు, హెమరోయిడ్స్, అబ్సెస్, బోయిల్స్, చర్మ సమస్యలు, పుళ్లు, గౌట్, కంటి వ్యాధులు, శిరోభారం, హెర్పెస్ జోస్టర్, థ్రాంబోసిస్, గాయాలను నయం చేయడానికి జలగ వైద్యాన్ని ఆశ్రయించేవారు.

జలగలలో రెండు రకాలు. ఒకటి విషతుల్యమైనవి. రెండు విష రహితమైనవి. విషతుల్యమైన జలగలు పట్టుకుంటే దురద, వాపు, తరువాత జ్వరం, వాంతులు వంటి సమస్యలు వస్తాయి. విష రహితమైనవే వైద్యంలో ఉపయోగపడతాయి. భారత దేశంలో హైలం-అన్నెలిడా, క్లాస్- హిరుడెనియా, హిరుడో మెడిసినలస్ జాతి జలగలను వైద్యంలో ఉపయోగించారు. ముడతలతో, 2 నుంచి 3 అంగుళాల మేర ఇవి ఉంటాయి. వీటి పేర్లు మన ఆయుర్వేద సంస్కృత గ్రంథాలు ఇచ్చాయి. నిర్విష, సవిష అనే రెండు వర్గాలివి. కపిల జలౌక, పింగళ జలౌక, మూషిక జలౌక, పుండరీక ముఖి జలౌక, సవర్క జలౌక, కృష్ణ జలౌక- ఇవి నిర్విష వర్గం. కర్బుర జలౌక, అలగర్ద జలౌక, ఇంద్రాయుధ జలౌక, సముద్రక జలౌక, గోకండన జౌలక- ఇవి సవిష వర్గం.

– జాగృతి డెస్క్



నేటి ప్రపంచంలో ఆయుర్వేదం

పరిచయం:

భారతదేశం స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి తన ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో అద్భుతమైన విజయాన్ని సాధించింది. స్వాతంత్ర్యం వచ్చే సమయానికి కేవలం 33 సంవత్సరాలుగా ఉన్న మనిషి సగటు ఆయుర్దాయం 2023 నాటికి 72 సంవత్సరాలకు పెరిగింది. మాతాశిశు మరణాల రేటు గణనీయంగా తగ్గింది. ప్రపంచ సగటుతో పోలిస్తే, భారతదేశం నేడు ఆరోగ్య ప్రమాణాలలో గణనీయంగా వెనుకబడి ఉండటం మాత్రం విచారకరం. దీర్ఘకాలిక వ్యాధులకు, మానవులకు ప్రాణాంతకమైన మధుమేహం, క్షయ, నాడీ సంబంధిత వ్యాధులకు, చివరకు క్యాన్సర్‌కు ప్రపంచ రాజధానిగా భారత్‌ను పరిగణిస్తున్నారు. అల్లోపతి అనేక అధునాతన సాంకేతిక పరిజ్ఞానాలతో వ్యాధుల నిర్ధారణలో గణనీయంగా ముందుకు సాగింది, కానీ దీర్ఘకాలిక వ్యాధులను అరికట్టడంలో విఫలమైంది. భారత్ తనదైన సమగ్ర ఆరోగ్య విధానం–ఆయుర్వేదాన్ని ఒక గొప్ప సంప్రదాయ సంపదగా కలిగి ఉంది. ఆయుర్వేదం నేడు దేశం ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలకు ఏవైనా పరిష్కారాలను అందిస్తుందా?

ముందుగా.. ఆయుర్వేదం, దాని పరిణామ క్రమం, ముఖ్య సిద్ధాంతాలను పరిశీలిద్దాం.

ఆయుర్వేదం ఒక పురాతన హిందూ వైద్య విధానం. క్రీస్తుపూర్వం 2వ సహస్రాబ్ది నాటి అథర్వ వేదం ప్రకారం ఇది బ్రహ్మ నుంచి ఉద్భవించింది. దక్షప్రజాపతి, ఇంద్రుడు, భరద్వాజుడు, ఆత్రేయుడు, అగ్నివేశుడు (రుషులు), చివరికి వైద్య దేవుడిగా పూజించే ధన్వంతరి వంటి వారి ద్వారా సంక్రమించింది. ధన్వంతరి శిల్పం 12వ శతాబ్దానికి చెందిన రామప్ప ఆలయంలో ఉందని తెలుసుకోవడం

డాII దేమె రాజారెడ్డి

ఆసక్తికరం. ఇటీవల యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తింపు పొందింది. ఆయుర్వేదం పేరు చెప్పగానే గుర్తుకు వచ్చే పేర్లు– చరక, సుశ్రుత, వాగ్భట్ట. 'సుశ్రుత సంహిత'ను క్రీ.శ. 8వ శతాబ్దంలో అరబిక్‌లోకి అనువదించుకున్నారు. తరువాత ఐరోపా దేశాలకు వెళ్లింది. సుశ్రుత సంహితలో 125 శస్త్ర చికిత్సా పరికరాల జాబితా ఉంది. వాటి తయారీ, సంరక్షణతో సహా వివరాలు ఉన్నాయి. తక్షశిల తవ్వకాల్లో బయటపడిన శస్త్రచికిత్సా పరికరాలను అక్కడి మ్యూజియంలో ప్రదర్శనకు ఉంచారు. బౌద్ధ సాహిత్యంలోని ఆయుర్వేద సమాచారం ప్రకారం జీవక ఖోమరబచ్చ తక్షశిలలో ఆయుర్వేదంలో శిక్షణ పొందాడు. ఆయన మగధ రాజు బింబిసారుడు, బుద్ధ భగవానుడికి సమకాలీనుడని పేర్కొన్నారు. ఆయన రోగుల తల, శరీరంలోని ఇతర భాగాలకూ శస్త్ర చికిత్సలు చేసినట్లు చెబుతారు. తలపై శస్త్ర చికిత్సకు ఆయన రెండు వేల పణాలను వసూలు చేశారు. ఆయుర్వేద వైద్యులు ముక్కుకు చేసిన మరో ముఖ్యమైన శస్త్రచికిత్సగా చరిత్రకెక్కింది. అక్రమ లైంగిక సంబంధం కలిగి ఉన్నారనే అనుమానంతో కత్తిరించిన ముక్కును సరి చేయడానికి శస్త్రచికిత్స చేశారు.

బ్రిటిష్ శస్త్ర వైద్యులు వీక్షించిన ఆయుర్వేద వైద్యుల ప్లాస్టిక్ సర్జరీ

1792లో బ్రిటిష్ సైన్యంలో వాహన చోదకుడు కోవాస్జీని, నలుగురు సిపాయిలను టిప్పు సుల్తాన్ సైన్యం అపహరించింది. వారి ముక్కులను కోసివేసింది.

1793లో, పూనా సమీపంలోని ఆయుర్వేద వైద్యులు ఈ ఐదుగురు వ్యక్తులకు రైనోప్లాస్టీ చేశారు. ఈ ప్రక్రియను బ్రిటిష్ వైద్యులు థామస్ క్రూసో, జేమ్స్ ఫైండ్లే స్వయంగా చూశారు. ఈ వార్త మద్రాస్ గెజిట్‌లో, అక్టోబర్ 1794 నాటి లండన్ నుంచి వెలువడిన 'జెంటిల్‌మన్' మ్యాగజైన్‌లో ప్రచురితమైంది. ఆ సమయంలో భారతదేశంలో ఈ శస్త్ర చికిత్సలకు పూనాతో పాటు కాంగ్రా ప్రసిద్ధి చెందాయి.

సిద్ధ నాగార్జునుని రచనలు:

ఆయుర్వేద వైద్యులు కొన్ని వ్యాధుల చికిత్సలో ఔషధాల వాడటం మరొక ముఖ్యమైన అంశంగా పరిగణించాలి. సిద్ధ నాగార్జునుడు ఔషధాలను ఉపయోగించడంలో ప్రసిద్ధి చెందినవాడు. రసేంద్ర మంగళం, రసరత్నాకర, కక్షపుట వంటి పుస్తకాలు రాశాడు. ఇంకా చాలా మంది రసవాదం, రసాయనిక ఔషధాలపై రాశారు. పురావస్తు శాస్త్రవేత్త కృష్ణశాస్త్రి 1960లలో యెల్లేశ్వరంలో తవ్వకాలు చేపట్టారు.

సిద్ధ నాగార్జునుడికి చెందినదిగా భావించే రసాయనిక ప్రయోగశాలను కనుగొన్నారు. డెబ్భై సంవత్సరాల క్రితం నా వైద్య శిక్షణ సమయంలో, రక్తపోటుకు మొదటి ఔషధం సెర్పాసిల్. అదే సెర్పాగంధి అనే ఆయుర్వేద ఔషధం. పార్కిన్సన్స్ వ్యాధికి 1970 నుంచి ఉపయోగిస్తున్న మరొక ప్రామాణిక ఔషధం L-DOPA. ఈ వ్యాధి వణుకును పుట్టిస్తుంది. జడత్వాన్ని కలిగిస్తుంది. ముంబైలోని నాడీ వైద్యులు పూనా సమీపంలోని ఆయుర్వేద వైద్యులు వణుకు చికిత్స కోసం తరతరాలుగా ఒక ఔషధాన్ని ఉపయోగిస్తున్నారని, అది L-DOPA ముడి రూపం తప్ప మరొకటి కాదని కనుగొన్నారు.

గతంలో ఆయుర్వేద అంశాలను వెల్లడించే ఎంపిక చేసిన శాసనాల గురించి క్లుప్తంగా–

పురాతన వైద్య పద్ధతులను వెల్లడిస్తున్న అశోకుడి శిలా శాసనాలు, శాసనాలు:

1. అశోకుడి రెండవ శిలాశాసనం: ఇది ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాలోని జొన్నగిరిలో ఉంది. దీనిని మొదటిసారిగా 1928లో ఎ. ఘోష్ కనుగొన్నారు. హెచ్. హార్గ్రీవ్స్ జూన్ 11, 1929న పత్రికలలో ప్రకటించారు. ఈ శిలాశాసనం గురించి మల్లంపల్లి సోమశేఖర శర్మ, వెంకటరమణయ్య సెప్టెంబర్, 1929 భారతి సంచికలో వివరించారు. బి.ఎం. బారువా అశోకుడి శాసనాలపై రాసిన పుస్తకంలో దీనిని వివరించారు. డి.సి. సిర్కార్ ఎపిగ్రాఫియా ఇండికా 1957–58 సంచికలో దీని గురించి వివరణాత్మక కథనాన్ని ప్రచురించారు.

ఆర్.సుబ్రహ్మణ్యం 1975లో తెలుగులో 'అశోకుని యెర్రగుడి శిలాశాసనములు' అనే పుస్తకాన్ని రాశారు. ఈ శాసనం క్రీ.పూ. 244–245లో వేసినది. రాజు ఔషధాలను సమకూర్చాడని, అవసరమైన చోట ఔషధ మొక్కలను పెంచాడని శాసనం పేర్కొంది.

2. తుమ్మలగూడెం రాగి ఫలక రాజశాసనం: విష్ణుకుండినుల రాజు గోవిందవర్మన్ సంస్కృతంలో రాజ శాసనాన్ని జారీ చేశాడు. ఇది క్రీ.శ. 5వ శతాబ్దానికి చెందినది. రాజు ఇంద్రపురలో తన రాణి ఏర్పాటు చేసిన విహారంలోని భిక్షులు, తదితరులకు వైద్య సంరక్షణ కోసం ఏర్పాట్లు చేశాడు.

3. సైదాపురం శాసనం: పశ్చిమ చాళుక్య రాజు జయసింహ II (క్రీ.శ. 1042) కాలం నాటి సంస్కృతంలో ఉన్న ఒక శిలాశాసనం, జైన పండితుడు కూడా అయిన అగ్గలయ్య అనే శస్త్రవైద్యుడి గురించి ప్రస్తావిస్తుంది. అతడికి అతను 'శస్త్ర శాస్త్ర కుశల', 'వైద్యరత్నాకర' అనే బిరుదులు ఉన్నాయి. అగ్గలయ్య ఇతరులు నయం చేయలేని వ్యాధులను నయం చేశాడని చెబుతారు. అతడు కొన్ని వ్యాధులను నయం

కొండవీడు శాసనం

చేయడంలో శస్త్రచికిత్సను, ఔషధాన్ని రెండింటినీ మేళవించాడు. మంచి ఫలితాలను రాబట్టాడు. చికిత్సలో ఔషధం, శస్త్రచికిత్స రెండింటినీ మిళితం చేయాలనే భావన అద్భుతమైనది. నా వృత్తి జీవితంలో నేను అదే పద్ధతిని అనుసరించాను.

4. తిరుమక్కుడల్ శాసనం: చోళరాజు వీర రాజేంద్ర I (క్రీ.శ. 1154–1167) జారీ చేశాడు. ఈ శాసనం సంస్కృతంలో ఉంది. రాజు ఒక వైద్యుడు, ఒక శస్త్రవైద్యుడితో 15 పడకల ఆసుపత్రి–ఆరోగ్యశాలను స్థాపించినట్లు ఇది తెలిపింది. కొన్ని పడకలు పిల్లల సంరక్షణ కోసం కేటాయించారని పేర్కొంది.

5. మల్కాపురం శాసనం: కాకతీయరాజు గణపతిదేవుడు క్రీ.శ.1261 జారీ చేసాడు. ఇదీ సంస్కృతంలోనే ఉంది. రాజ గురువు పశుపత సాధువు విశ్వేశ్వర శివాచార్యుడు అవసరమైన సిబ్బందితో ఆసుపత్రి, ప్రసూతి గృహం –ప్రసూతి ఆరోగ్యశాలను నెలకొల్పాడని పేర్కొంది.

6. కొండవీడు శాసనం: రాజు సదాశివరాయ, హరిహరుడు I ఆయుర్వేద వైద్యులైన బ్రాహ్మణులకు గ్రామాలను దానం చేసినట్లు ఈ శాసనంలో ఉంది.

7. అనితల్లి శాసనం: రాజమహేంద్రవరానికి చెందిన కాటయ వేమారెడ్డి కుమార్తె. ఆమె క్రీ.శ.1423లో పరహితాచార్య అనే వైద్యుడికి కలువచేరు అనే గ్రామాన్ని దానమిచ్చింది. పరహితాచార్య పూర్వికులు ప్రఖ్యాత వైద్యులు, వేద పండితులుగా పేరొందారు.

ఇలాంటి అనేక ఇతర శాసనాలు పరహితులని పేర్కొనిన ఆయుర్వేద వైద్యుల గురించి ప్రస్తావిస్తాయి. చాలా శాసనాలు దేవాలయాలు, ప్రజలకు వైద్య సేవలు అందించిన ప్రదేశాలకు చేసిన విరాళాలను సూచిస్తున్నాయి.

మన దేశం ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలు:

1. గ్రామీణ ప్రాంతాల్లో పోషకాహార లోపం, పట్టణ ప్రాంతాల్లో ఊబకాయం.
2. క్షయ = అనేక ఔషధాలను ఈ వ్యాధి తట్టుకోవడం, మొదలైనవి.
3. మధుమేహ మహమ్మారి.
4. హెచ్ఐవీ/ఎయిడ్స్
5. రోడ్డు ప్రమాదాల్లో మరణాలు.
6. నిర్దేశిత ప్రాంతాలలో ఫ్లోరోసిన్, మూత్రపిండాల వ్యాధులు.

క్షయవ్యాధి తాకిడి:

భారత్ ప్రపంచానికి క్షయవ్యాధి రాజధానిగా నిలిచింది.

ప్రతి సంవత్సరం కొత్తగా 19 లక్షల కేసులు బయటపడుతున్నాయి.

దేశాల వారీగా, ప్రపంచంలో అత్యధిక కేసులు భారతదేశంలోనే ఉన్నాయి.

(202 దేశాల డేటా ఆధారంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ–డబ్ల్యూహెచ్‌వో నివేదిక).

భారతదేశంలో ఏ సమయంలోనైనా సుమారు 38 లక్షల మంది వ్యాధిగ్రస్తులు ఉన్నారు.

ప్రతి సంవత్సరం 3,25,000 మంది భారతీయులు ఈ వ్యాధి కారణంగా మరణిస్తున్నారు. ప్రపంచంలో క్షయ వ్యాధితో మరణిస్తున్న ప్రతి ఐదవ వ్యక్తి భారతీయుడే.

క్షయ వ్యాధి అనేక ఔషధాలకు లొంగకపోవడం దేశంలో తీవ్రమైన సమస్యగా మారింది.

మధుమేహం వ్యాప్తి:

భారత్ ప్రపంచంలోనే అత్యధికంగా మధుమేహ వ్యాధిగ్రస్తులు ఉన్న దేశాల్లో ఒకటగా నిలిచింది.

హైదరాబాద్ నగరవాసుల్లో 18% మందికి మధుమేహం ఉంది.

2025 నాటికి, 5.72 కోట్ల భారతీయులు ఈ వ్యాధి బారిన పడతారని అంచనా. దేశం ప్రపంచంలోనే అతిపెద్ద మహమ్మారిని ఎదుర్కొంటోంది. అయితే దానిని ఎదుర్కోవడానికి సన్నద్ధంగా లేదు.

ఆరోగ్యశ్రీ పథకంలో పేదలకు మధుమేహం

వ్యాసకర్త: ప్రఖ్యాత న్యూరో సర్జన్, ఫ్లోరోసిస్ నిపుణులు, హైదరాబాద్

చికిత్స కోసం ఎటువంటి సదుపాయాలు లేవు.

హెచ్ఐవీ/ఎయిడ్స్:

50 లక్షలకు పైగా భారతీయులు హెచ్ఐవీతో బాధపడుతున్నారు. ఇది ఆరు రాష్ట్రాల్లో కేంద్రీకృతమై ఉంది, వాటిలో ఆంధ్రప్రదేశ్ కూడా ఉంది. ఇక్కడ ఇది ఇతర రాష్ట్రాల కంటే 4-5 రెట్లు ఎక్కువగా ఉంది.ఆంధ్రప్రదేశ్ దేశంలో అధిక ప్రాబల్యం రేటు ఉన్న రాష్ట్రాలలో ఒకటిగా ఉంది. 2006లో రాష్ట్రంలోహెచ్ ఐవీ ప్రాబల్యం 1.26%గా ఉంది. ఇది ఇతర రాష్ట్రాల కంటే ఎక్కువ.

కేన్సర్:

మొత్తం కేసుల్లో 80% చివరి దశలో ఆసుపత్రులకు వస్తాయి. అప్పుడు వ్యాధి నుంచి ఉపశమనం(పాలియేటివ్ కేర్) కలిగించడం మాత్రమే సాధ్యమవుతుంది. దీనికి వ్యాధిని ముందుగా గుర్తించడం ఒక్కటే పరిష్కారం. ఇది ప్రాథమిక సంరక్షణ వైద్యుల సేవల్లో నాణ్యతపై ఆధారపడి ఉంటుంది. పాలియేటివ్ కేర్ కోసం భారీ మొత్తంలో ఖర్చు చేయడం మంచిది కాదు.

ప్రపంచవ్యాప్తంగా నాడీ సంబంధిత వ్యాధులతో మరణాలు:

నాడీ సంబంధిత వ్యాధుల కారణంగా ప్రపంచ వ్యాప్తంగా 1.67 కోట్ల మంది మరణించారు (2002).

ఈ వ్యాధులు భారతీయులలో అమెరికన్ల కంటే 3-4 రెట్లు ఎక్కువగా, చైనీయుల కంటే 6 రెట్లు, జపనీయుల కంటే 20 రెట్లు ఎక్కువగా కనిపిస్తాయి.

ఎక్కువగా భారతీయ యువత 12-13% మంది ఈ వ్యాధులతో బాధపడుతున్నారు. పాశ్చాత్య దేశాలలో ఇది 5%గా ఉంది. భారతదేశ రోగుల్లో 40% మంది 45 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్నవారు.

చివరిమాట:

అల్లోపతి వ్యాధి నిర్ధారణ పద్ధతుల్లో గణనీయంగా ముందుకు సాగింది, నేడు అనేక రకాల రోగనిర్ధారణ సాధనాలు అందుబాటులో ఉన్నాయి. అందువల్ల, పురాతన రోగ నిర్ధారణ విధానాలకు కాలం చెల్లింది. పురాతన వ్యవస్థలు సమగ్రమైనవి, వ్యాధి నివారణకు గణనీయమైన ప్రాధాన్యతనిస్తాయి. ఇప్పుడు మానవులకు ప్రాణాంతకమైనవిగా హృద్రోగాలు, ప్రధాన నాడీ సంబంధిత వ్యాధులు ఉన్నాయి. వీటి వెనుక మధుమేహం, పోషకాహారలోటు ముఖ్యమైన పాత్రను పోషిస్తాయి. ఆయుర్వేదం ఆరోగ్యకరమైన జీవన సూత్రాలను, వ్యాధులను నివారించే మార్గాలను నొక్కి చెబుతుంది. దీనికి రోజువారీ ప్రవర్తనా నియమావళిని అనుసరించాలి. అవి పరిశుభ్రత, శారీరక వ్యాయామం ఆవశ్యకతను ప్రస్తావిస్తాయి. దీర్ఘకాలిక జీవితాన్ని ప్రోత్సహిస్తాయి. ఇందుకు నిషేధిత కార్యకలాపాల జాబితాను వివరిస్తాయి. సంగం యుగం అనంతర ఆయుర్వేద పండితుడు తిరువల్లువర్ మెరుగైన జీవితాన్ని ప్రోత్సహించడానికి తిరుక్కురల్‌ను ప్రపంచానికి అందించారు. ఆయన ఎప్పుడు తినాలి? ఎలా తినాలి? ఏమి తినాలి? అనే దానిపై దృష్టి పెట్టారు. అందువల్ల, మన పురాతన వైద్య వ్యవస్థల అధ్యయనం మానవ ప్రాణాలకు ముప్పు కలిగించే ముఖ్యమైన దీర్ఘకాలిక వ్యాధులను అరికట్టడంలో ప్రధాన పాత్ర పోషిస్తుంది. మన పురాతన వైద్య శాస్త్రాలను మరింత శాస్త్రీయంగా అధ్యయనం చేయవలసిన అవసరం ఉంది.

తిరువల్లువర్ తిరుకురల్ ద్వారా ఎప్పుడు తినాలి? ఎలా తినాలి? ఏమి తినాలి? అనే విషయాలను చాలా కాలం క్రితమే చెప్పారు. ★

ఖోజాగిరి- ఆయుర్వేదం

శరద్ పూర్ణిమ లేదా ఖోజాగిరి వ్రతం ఆధ్యాత్మికంగా, శాస్త్రీయంగా ముఖ్యమైన రోజు. అది లక్ష్మీదేవి పుట్టినరోజు కూడా. ఆ ప్రాముఖ్యం ఇంకొకటి- చంద్రుడు తన 64 కళలతో భూమికి దగ్గరగా ఉంటాడు. భూమిపై అమృతాన్ని కురిపిస్తాడు. అన్ని మూలికలకు శక్తిని ఇస్తాడు. వాటిని శక్తిమంతం చేస్తాడు. ఎందుకంటే చంద్రుడిని ఓషధి రాజు లేదా మూలికలరాజు అని అంటారు. పంట ఇంటికి వచ్చేది కూడా ఆరోజే కనుక, పంటకోత పండుగను కూడా సూచిస్తుంది.

ఈ రోజు కొత్త బియ్యం. పాలతో చేసిన పాయసం తయారు చేసి, వీలైతే చంద్రోదయ సమయంలో వెండిపాత్రలో ఉంచి అర్ధరాత్రి సమయంలో తింటారు. పాయసాన్ని వెన్నెట్లో ఉంచినప్పుడు చంద్రుని శక్తిని సంగ్రహిస్తుంది. గుండెకు బలాన్ని ఇస్తుంది. రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. తరచుగా ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్ల నుంచి, అన్ని అలెర్జీ రుగ్మతల నుండి రక్షిస్తుంది.

ఆయుర్వేద వైద్యుల సలహా ప్రకారం, అర్జున /మద్ది మొక్క బెరడు చూర్ణం పాయసం తయారుచేసేటప్పుడు కలుపుతారు. అర్జున చెట్టు కార్డియాక్ టానిక్‌గా పని చేస్తుందని అందరికీ తెలుసు. కాల్షియం సమృద్ధిగా ఉండటం వలన గుండె, ఊపిరితిత్తుల పనితీరుని మెరుగుపరుస్తుంది.

మన పెద్దలు 'జీవేమ శరదశ్శతం' అని ఆశీర్వదిస్తారు. అంటే 100 శరద్ పూర్ణిమలు లేదా 100 సంవత్సరాలు ఆరోగ్యంతో జీవించండి అని అర్థం. ఈ శరద్ పూర్ణిమ సంవత్సరాలను లెక్కించడానికి ఒక త్రాసు లాంటిది.

ఆ రోజు బృందావనంలోని గోవర్ధన గిరి పరిక్రమ కూడా చేస్తారు.

నవరాత్రి 9 రోజుల ఉపవాసం తర్వాత శరీరం బలాన్ని తిరిగి పొందడానికి శరద్ పూర్ణిమ అమృతంతో కూడిన ఖీర్‌ను ఆరగిస్తారు.

శరద్ పూర్ణిమ శరద్ రుతువు ప్రారంభం, వర్ష రుతువు ముగింపు కూడా సూచిస్తుంది.

వర్ష రుతువు పిత్తం కోపాన్ని కలిగిస్తుంది కాబట్టి ఈ కలుషితమైన పిత్తాన్ని శరీరంలో వేడి కలగకుండా చల్లబరుస్తుంది. రుతు సంధి కాల వ్యాధుల నుండి రక్షణ కోసం రోగనిరోధక శక్తిని సృష్టించడానికి ఈ అమృతంతో కూడిన శరద్ పూర్ణిమ సహాయపడుతుంది.

డా॥ సురేశ్ జకోటియా, ఎం.డీ,
Rtd Chief Superintendent Govt.Indian medicine Pharmacy, (Dept of AYUSH). KODAD.Telangana.

డా॥ నిరంజనీ జకోటియా, ఎం.డీ
CMO, Govt Ayurveda Hospital. Erragadda. Hyderabad, 91 94407 08757:

ఆయుర్వేద వైద్యశాస్త్రం అధర్వణ వేదానికి ఉపాంగం. మహర్షులు దానిని ఎనిమిది విధములగు చికిత్సలుగా విభజించారు. వాటిలో శస్త్ర చికిత్స ప్రధానాంగంగా పరిగణించారు. దేవాసుర యుద్ధంలో అభిఘాత (అవతలివారు కొట్టడం వల్ల తగిలిన దెబ్బలు) వ్రణాలకు చికిత్స చేయడంలో శస్త్ర చికిత్స మొదటి స్థానంలో ఉండేదని భగవత్స్వరూపులైన దివోదాస ధన్వంతరులు చెప్పారు. ఆనాటికి జ్వరం వంటి రోగాలు ఉత్పన్నమయ్యేవి కావు కాబట్టి శస్త్ర చికిత్సను ఆశ్రయించారు. క్రమేణా యుద్ధాలు పెచ్చరిల్లాయి. దీనితో ఆయుర్వేదంలోని శస్త్ర చికిత్స ముఖ్యమైనదిగా పరిగణించడం మొదలయింది. శస్త్ర చికిత్సా విధానం గురించి వేదాలలో చిత్రమైన గాథలు ఉన్నాయి. ఇవన్నీ అధర్వణ వేదానికి అధిపతులైన అశ్వనీ దేవతలు చేసిన శస్త్ర వైద్యం ఆధారంగా ఉన్న గాథలే.

ప్రాచీన శస్త్ర

దధీచుడు మధు విద్యా రహస్యం తెలిసిన వాడు. కానీ దానిని అశ్వనీదేవతలకు చెప్పకుండా గుప్తంగా ఉంచాడు. దీనితో అశ్వనీదేవతలు దధీచుడి శిరస్సు ఖండించి, భద్రపరిచి తాము తెచ్చిన గుర్రం తలను అతికించారు. అప్పుడు దధీచుడు మధు విద్యను అశ్వనీ దేవతలకు బోధించాడు. దీనితో దధీచుడి తల అతడికి, గుర్రం తల గుర్రానికి తిరిగి అతికించారని అధర్వవేదంలోని కథ. రుగ్వేదం ప్రకారం యజ్ఞపురుషుని తెగిన శిరస్సును అశ్వనీ దేవతలు తిరిగి అతికించారు. ఖేలరాజు భార్యాసమేతుడై యుద్ధానికి వెళ్లాడు. విస్ఫల కాలి పిక్కను శత్రువులు ఛేదించారు. అయినా ఆమె కుంటిది కాకుండా అశ్వనీదేవతలు ఇనుప కాలు అమర్చారు. కాబట్టి వైదిక యుగంలో శస్త్ర చికిత్స చాలా ప్రాముఖ్యంలో ఉందని అర్థమవుతుంది.

భోజరాజుకు తీవ్రమైన శిరోభారం వచ్చింది. ఏ వైద్యుడూ నయం చేయలేకపోయాడు. దీనితో వైద్యులనూ, వైద్యశాస్త్రాన్ని కూడా ఆయన దేశం నుంచి బహిష్కరించాడు. ఇది తెలిసి, అశ్వనీదేవతలు వచ్చారు. భోజరాజు పుర్రెను విడదీసి అందులో ఉన్న రెండు చేపలను తీసి, మళ్లీ అతికించారని గాథ. సర్వ విద్యలకు కేంద్రం కాశీ పట్టణం. అక్కడ ప్రఖ్యాత శస్త్ర చికిత్సకుడు ధన్వంతరి. ఆయన కాశీ రాజు కుమారుడే. పేరుకు తగ్గట్టే అపర ధన్వంతరి. తన ప్రజలు రోగాలతో బాధపడడం చూసి ఇంద్రుని వద్దకు వెళ్లి శస్త్ర చికిత్స ప్రధానంగా ఆయుర్వేదం నేర్చుకుని వచ్చాడట. మరొక ఆయుర్వేద వైద్య బ్రహ్మ దివోదాసు సుశ్రుతునికి శస్త్ర చికిత్సను బోధించాడు. దివోదాసుని శస్త్ర చికిత్స గురించి కూడా కొన్ని గాథలు ఉన్నాయి. దివోదాసుడు కాశీలోనే ఆయుర్వేద విశ్వవిద్యాలయం స్థాపించాడని చెబుతారు. శల్యతంత్ర ప్రవర్తకునిగా ప్రఖ్యాతి గాంచి, దివోదాసుడు స్థాపించిన విశ్వవిద్యాలయం శస్త్ర చికిత్సా విభాగంలో పనిచేసిన సుశ్రుతాచార్యుడు రామాయణ కాలంనాటి వాడు. విశ్వామిత్రుని కొడుకు. ఆయన రాసిన 'సుశ్రుత సంహిత' మహా భారత రచనా కాలానికంటే పూర్వానిదే. సుశ్రుతుడు ఆగంతక, మానస, శారీరక వ్యాధుల నివారణా నైపుణ్యంతో పాటు, శస్త్ర చికిత్సలోను ప్రావీణ్యం గడించాడు. ఇది తన 'శృంగార నైషధం'లో శ్రీహర్షుడు చెప్పాడు.

సుశ్రుతాచార్యులవారిని ఒక కవి ఇలా కీర్తించాడు:

కమల గర్భుని సత్యసంకల్ప వశత
బ్రాణికోటుల దేహనిర్మాణమగును
అతడె ఎరుగడు దాని రహస్య వృద్ధి
చోద్యమెట్లు గ్రహించెనో సుశ్రుతుండు



మనజ వైద్యుల కా మహామహుడె మొదలు
భిక్ష పెట్టిన గురుడు, తద్విద్య నేడు
వివిధ ఖండాంతరమ్ముల వెలుగుచుండె
చండభానుని కర సహస్రమ్ము బోలె

సుశ్రుతాచార్యుని శస్త్ర చికిత్సా నైపుణ్యం, విశేషాలు విస్మయం కలిగించే విధంగా ఉంటాయి. ఒక రోగి పొట్ట చీల్చి చిన్న ప్రేవులలోని రాళ్లు తొలగించాడు. ఒక గర్భిణి కడుపు కోసి బిడ్డను తీశాడు. పుర్రెకు రంధ్రం చేసి మెదడులోని శల్యాన్ని తీసివేశాడు. పొట్టను చీల్చి చేసే శస్త్ర చికిత్స నిమిషాలలో పూర్తి చేసేవాడట. అందం కోసం నాసికకు శస్త్ర చికిత్స, మూఢ గర్భ చికిత్స, ఉదర పాటనాది శస్త్ర చికిత్సలు ఆయన చేశాడని చారిత్రక ఆధారాలే చెబుతున్నాయి.

సుశ్రుతుని సృష్టి

శస్త్ర చికిత్స కోసం సుశ్రుతుడు 101 యంత్రాలు, 20 శస్త్రాలు సృష్టించాడు. శస్త్రాలు వాడి కలిగినవి. యంత్రాలు వాడి లేనివి. సాధారణంగా అవన్నీ ఇనుముతో చేయించినవి. జంతువుల ముఖాలు, పక్షుల ముక్కుల వలె వీటిని నిర్మించేవారు. పటకార్లు పెద్దపులి, సింహం ముఖాల వలె రూపొందించారు.

చికిత్స

సుశ్రుతుడు కనుగొన్న సింహ ముఖ యంత్రం ఈనాటి పాశ్చాత్య శస్త్ర చికిత్సలో లైయన్స్ ఫోర్సెప్స్ పేరుతో ఉపయోగంలో ఉంది. సుశ్రుతుని యంత్ర శస్త్రాలకు, ఈనాటి శస్త్ర యంత్రాలకు పోలిక ఒక్కటే. యోని, గుదమార్గాలు శోధించే యోని ప్రణేక్షణ యంత్రాన్ని నేటి పాశ్చాత్య శస్త్ర చికిత్సకులు అలింగ్ హ్యాండ్స్ స్పోనియం అని పిలుస్తున్నారు. శస్త్ర చికిత్సను బట్టి, అందులోని భేదాలను బట్టి కొత్త కొత్త శాస్త్రాలను కనిపెట్టినట్టు 'స్వబుద్ధ్యా బాచాపి విభజేత్' అనే ప్రమాణ వ్యాక్యాన్ని బట్టి తెలుస్తున్నది.

శస్త్రవైద్యుల లక్షణాలు

వీరికి ఉండవలసిన ప్రధాన లక్షణం హస్త లాఘవమేనంటాడు సుశ్రుతుడు. శస్త్ర చికిత్స చేయించుకున్న రోగుల దగ్గర ఉపచారాలు చేయడానికి ఆయన స్త్రీలను నిషేధించాడు. మగ నర్సులే ఉండాలని ఆదేశించాడు. శస్త్ర చికిత్సకు పూర్వం బాధ తెలియకుండా ఉండేందుకు ఆహారం ఇచ్చి, మత్తు పదార్థాలు తాగించే విధానం ఆచరించారు. 1872లో డాక్టర్ సర్ జేమ్స్ క్లోరోఫారమ్ కనిపెట్ట డానికి పూర్వం అలోపతీ వైద్యులు కూడా ఈ విధానాన్నే అవలంభించారు. శస్త్ర చికిత్సాంగంలో సుశ్రుతుడు మరొక ప్రయోగాన్ని పేర్కొన్నాడు. 'అపచి' అనే రోగం ఉంది. కంఠం, ఉర:ప్రదేశాల మధ్య కురుపులు లేచి చీమూ, రక్తమూ కారుతూ ఉంటుంది. దానికి కాలి పిక్క వెనుక భాగం చీల్చి అక్కడ ఉన్న మేదో గ్రంధిని తీసివేసి కుట్టాలి.

పిల్లలకు వచ్చే కురంటము అనే వరిబీజంలో చెవి కుట్టాలని, కొన్ని కంటి జబ్బులకు బొటనవేలి కింద చురక వేయాలని ఆయన చెప్పాడు. దూరత మములైన అవయవాలకు కల నాడీ బంధాన్ని గుర్తించి చికిత్స చేసే విధానమిది. కీలెరిగి వాత పెట్టడం అనే సామెత దీని నుంచే వచ్చింది. శరీర నిర్మాణంలో అతి సున్నితాలైన మర్మ స్థానాల గురించి చెబుతూ సుశ్రుతుడు ప్రాణాపాయం కలిగించే 107 మర్మ సంధులు ఉన్నాయని విపులీకరించడు. శీలమండ, కణతలు, నొసలు మొదలైన వాటినే మర్మసంధు లంటారు. ఈ మర్మస్థానాల మర్మం తెలుసుకుని ఆయుధ ప్రయోగం చేయడం ప్రాచీనుల యుద్ధ కౌశలంలో ఒక ముఖ్య విశేషంగా పరిగణించేవారు.

రామరావణ యుద్ధంలో లక్ష్మణుని విశల్యఘ్ను మర్మస్థానం– అంటే నొసటి భాగంలో బాణం వేసి కొట్టాడు ఇంద్రజిత్తు. లక్ష్మణుడు మూర్ఛపోయాడు. ఆ బాణం తొలగిస్తే లక్ష్మణుడు మరణించడం తథ్యం. ఆ సంగతి రాములవారికి తెలుసు. అందుకే సంజీవకరణి తెప్పించి పుండు మాన్పుతూ, బాణం తీసివేశాడని రామాయణం చెబుతోంది.

కోత భాగాన్ని మూసే సవర్ణీకరణ

సుశ్రుతుని శస్త్రవైద్యంలో సవర్ణీకరణం మరొక మహత్తర అంశం. శస్త్ర చికిత్స చేసిన చోట అతుకు స్పష్టంగానే కనిపిస్తూ ఉంటుంది. అక్కడ వెంట్రుకలు కూడా మొలవవు. కానీ సవర్ణీకరణం వల్ల ఆ కోత చర్మంలో కలసిపోవడం, అక్కడ వెంట్రుకలు రావడం రెండూ జరుగుతాయి. శస్త్ర చికిత్స చేయించుకున్న వారికి క్రిమిదోషం రాకుండా సుశ్రుతుడు కొన్ని విధానాలు చెప్పాడు. నేటి శస్త్ర చికిత్సకులు బాహ్య క్రిమిదోష విషయంలో శ్రద్ధ వహిస్తున్నారు గాని, అంతర్గతమైన క్రిమి దోషానికి కారణాలను పరిగణన లోనికి తీసుకోవడం లేదు. శస్త్ర చికిత్సకు ముందే రోగిని పంచకర్మల ద్వారా దోషాలను శాంత పరచి శస్త్ర చికిత్స చేస్తే క్రిమి మిళితమైన చీము మొదలైనవి బయలుదేరవు. బాహ్య క్రిమి దోష నివారణకు కొన్ని ధూపాలను వివరించారు. గుగ్గిలం, వస, ఆవాలు, సైంధవ లవణం, నేతిలో ముంచిన వేపాకులు కలిపి చూర్ణించి శస్త్ర చికిత్స పొందిన రోగి గదిలో పొగ వేస్తే క్రిమికీటకాలు దరిచేరవు.

సుశ్రుతుని తరువాత...

సుశ్రుతాచార్యులని తరువాత ఆయనతో సమాన కీర్తి కలిగినవాడు వాగ్భటాచార్యుడు. అష్టాంగ హృదయాన్ని ఒక మహా కావ్యంగా రచించాడు. ఆయన శస్త్ర చికిత్సకుడు. రసవాది. బౌద్ధ ధర్మావలంబీకుడు. సుశ్రుతుని కాలం కంటే ఈయన కాలంలోనే, క్రమంగా వచ్చిన అనుభవం, జ్ఞానాల కారణంగా శస్త్ర చికిత్స మరింత ప్రచారంలోకి వచ్చింది. తరువాత పేర్కొనదగినవాడు జీవకుడు. ఈయన ప్రతిభ గురించి బౌద్ధ వాఙ్మయంలో చాలా గాథలు ఉన్నాయి. బింబిసారుని ఆస్థాన వైద్యుడైన జీవకుడు పిల్లల వైద్యం, శస్త్ర చికిత్సలలో ఖ్యాతిగాంచాడు. మగధ సామ్రాజ్యంలో అపర ధన్వంతరిగా పేరు తెచ్చుకున్నాడు. బింబిసారునికి వచ్చిన భగంధర వ్యాధిని శస్త్ర చికిత్సతో నయం చేశాడు. కాశీ పట్టణంలో ఒక వర్తక ప్రముఖుని కొడుకునకు వ్యాయామం చేస్తుండగా పేగు మెలిక పడింది. రక్తహీనుడై చావు బతుకుల మధ్య ఉండగా జీవకుని ఖ్యాతి విని రాజగృహ నుంచి ఆయనను కాశీ తీసుకు వెళ్లారు. జీవకుడు పొట్ట చీల్చి మెలిక పడిన పేగును సరిచేసి, కుట్లు వేశాడు. ఆ బాలుడు మళ్లీ ఆరోగ్యవంతుడయ్యాడు. ఇది బాగా ప్రసిద్ధి

గూడూరి నమశ్శివాయ

చెందిన గాథ.

బుద్ధునికి జీవకుని వైద్యం

ప్రద్యోతుడనే రాజు తనకు వచ్చిన శిరోభారాన్ని జీవకుని శస్త్ర చికిత్స ద్వారా నయం చేయించు కున్నాడు. అందుకు ఎంతో విలువైన బహుమానాలు ఇచ్చాడు. అందులో నేటి బెలూచిస్తాన్‌లో తయారైన రెండు శాలువలు కూడా ఉన్నాయి. వాటిని దైవాంశ సంభూతులే ధరించేవారు. అందుకే వాటిని తీసుకు వెళ్లి బుద్ధుడికి ఇచ్చాడు జీవకుడు. దీనితో జీవకుడిని బౌద్ధ ధర్మావలంబీకు నిగా చేశాడు బుద్ధుడు. బుద్ధుడి జీవిత చరమాంకంలో మేహ వ్రణం వచ్చింది. దానిని జీవకుడే శస్త్ర చికిత్స చేసి మాన్పించాడు. పైగా బుద్ధుడు భగవానుడు కాబట్టి మందు లోపలికి వంపి అపవిత్రం చేయరాదన్న భావనతో, తామరపువ్వులో మందు పెట్టి వాసన చూడమన్నా డట. ఆ వాసనతోనే బుద్ధుడు తిరిగి ఆరోగ్యవంతు డయ్యాడని బౌద్ధ గ్రంథాలు చెబుతున్నాయి.

జీవకుడి దగ్గర మూడు విశేష ఔషధాలు ఉండేవని కూడా చెబుతారు. అవే రాజౌషధి, సమ్మోహిని, సంజీవకరణి. రాజౌషధి తల మీద పెడితే మొత్తం శరీర తత్వం బోధపడేదట. శస్త్ర చికిత్స పొందిన వారికి కోత మచ్చ కనిపించకుండా సంజీవకరణి ఉపయోగపడేది. సమ్మోహిని అంటే శస్త్ర చికిత్స వేళ బాధ తెలియకుండా మత్తు కలిగిం చేది. జీవకుని కాలం ఆయుర్వేదానికి, అందులోని శస్త్ర చికిత్సకు స్వర్ణయుగమని చరిత్రకారులు చెబుతారు.

నిషేధించిన అశోకుడు

కానీ అశోకుడు వచ్చిన తరువాత పరిస్థితి మారింది. శస్త్ర వైద్యాన్ని కూడా హింసాత్మక చర్యగా భావించాడు. అందుకే నిషేధించాడు. మనుషులకు,

అశ్వినీ దేవతలు
(జాగృతి 30.12.1955 నుంచి)

జంతువులకు కూడా శస్త్ర చికిత్స నిషిద్ధమే. దీనితో భారతీయ శస్త్ర చికిత్స, దాని విజయాలు పుస్తకాలకే పరిమితమయ్యాయని అంటారు. మనిషి శరీరాంత ర్భాగం గురించి చెప్పడానికి శవాలు దొరకకుండా అయిపోయింది. శవస్పర్శ దోషభూయిష్టమైంది. శస్త్రవైద్యుడు పంక్తిబాహ్యుడయ్యాడు. అప్పుడే అగ్ని, క్షార, జలూక చికిత్సలు అమలులోకి వచ్చాయి. ఆపై హూణులు, సిథియన్లు, గజనీ దండయాత్రలు భారతీయ వాఙ్మయాన్ని కాలగర్భంలో కలిపాయి.

శాసనాలు చెబుతున్న వాస్తవాలు

మనదైన వైద్యశాస్త్రానికి సంబంధించిన కొన్ని శాసనాలు దొరికాయి. వాటిని ప్రస్తావించుకోవడం అవసరం. అవి మన పూర్వ వైద్యశాస్త్ర ఘనతను చెబుతాయి. వీటిలో ఒకటి 1326 ప్రాంతంలో కొండవీటి రెడ్డి ప్రభువు పెద కోమటి వేమారెడ్డికి సంబంధించినది. పరవేత వంశీకులు భట్ట భాస్కరునికి పౌత్రునికి పొన్నపల్లి గ్రామం దానమిస్తూ వేయించిన శిలాశాసనమది. అందులో ఆయుర్వేదా నికి సంబంధించిన కొంత సమాచారం ఉంది. అందులోని ఒక గాథ ఇది. భూలోక ధన్వంతరిగా ఖ్యాతి గాంచిన వారు పరహితాచార్యుడు. ఆయన ఒకనాడు నడుస్తున్న బాటలో కప్ప ఎముక దవడలో గుచ్చుకుని బాధపడుతూ గిలగిల తన్నుకుంటున్న తాచుపామును చూశాడు. దయతో ఆ పామును పట్టుకుని దవడలో గుచ్చుకున్న ఎముకను లాగి, గాయం మాన్ని వదిలిపెట్టాడు. ఈ సేవ వల్లనే ఆ వంశానికి పరహిత వంశమన్న పేరు వచ్చిందని ఆ శాసనం వెల్లడించింది. శ్రీనాథ వైద్య పండితుడు శస్త్ర చికిత్స ప్రధానాంశంగా 'పరహిత సంహిత' పేరుతో ఒక వైద్య గ్రంథం రాశాడు. అదే నేటికీ మనకు సాక్షీభూతంగా మిగిలింది.

పాశ్చాత్యుల మాట

బెర్లిన్‌కు చెందిన డాక్టర్ హెూరిస్‌బర్గ్ సుశ్రు తుడి గురించి ఇలా చెప్పారు. సుశ్రుతుడు చెప్పిన సింహముఖ యంత్రం మనం ఉపయోగించే లయన్స్ ఫోర్సెప్స్ వలె ఉన్నది. వెల్‌కం చారిత్రక మ్యూజి యంలో పూర్వపు హిందూ వైద్యులు ఉపయోగించిన శస్త్ర యంత్రాలను చూడవచ్చు. వాటిని చూస్తుంటే నేటి నవీన శాస్త్రజ్ఞులు ఈ పరికరాలను ప్రదర్శన నిమిత్తం ఇక్కడ ఉంచారా అనిపిస్తుంది. పాంపే నగర ధ్వంసంలో చాలా శస్త్రయంత్రాలు అగ్ని భస్మంలో పూడిపోయాయి. అనేక శతాబ్దాల తరువాత తవ్వగా దొరికినవే నేటి నేపుల్స్ మ్యూజియంలో భద్రపరిచారు. ప్రాచీన హిందూ శస్త్ర వైద్యులు కృత్రిమ దంతాలు కట్టడంలో నిపుణులు. నవీన శస్త్ర వైద్యానికి తండ్రి వంటిది గ్రీస్ దేశమని అంటారు. అది సరికాదు. పోషకురాలో, దాదీయో అని చెప్పవచ్చు. అది పుట్టి పెరిగినది హిందూ దేశంలోనే. హిందూ శస్త్ర వైద్యులు ఉపయోగించిన ఉపకరణాలు తలవెంట్రుకలను చీల్చ గలిగినంత వాడి గలిగినవి. భారతదేశంలో పెట్టుడు ముక్కు అతికించే పద్ధతిని గత శతాబ్దిలో గ్రహించి ఐరోపా వైద్యులు ఆ ప్రక్రియను తమ శస్త్ర చికిత్సలో చేర్చుకున్నారు' అన్నారాయన. ★

సుశ్రుతుని శస్త్ర చికిత్స పరికరాలు

వ్యాసకర్త: 1955 దశకంలో జాగృతి కాలమిస్ట్, ఈ వ్యాసం 30.12.1955 ఆయుర్వేద ప్రత్యేక సంచిక కోసం అందించారు

త్రిదోష సిద్ధాంతమే ఆధారం

ఆయుర్వేదం ఆధ్యాత్మిక జ్ఞానాన్ని ఉపదేశించే సర్వ శాస్త్రాల సారం. కానీ ప్రజలు ఆయుర్వేదం అంటే కొన్ని ఆరోగ్య విధులను బోధించే శాస్త్రమని అనుకుంటారు. ఇది కొంతవరకు నిజమే కాని, ఆయుర్వేదం దృష్టి ఇంతటితో ఆగదు. అది చాలా విశాలమైనది.ఆధునిక శాస్త్రజ్ఞులు ఆయుర్వేదాన్ని సరిగా అర్థం చేసుకోవడం లేదంటే, వారు కేవలం పంచేంద్రియ జ్ఞానం మీదనే ఆధారపడి ఉన్నారు.

గడచిన రెండు మూడు శతాబ్దాలుగా వైజ్ఞానికులు మానవ శరీరాన్ని ఒక యంత్రంగా భావిస్తు వస్తున్నారు. వ్యాధి అనేది ఈ యంత్రంలో ఆయా భాగాలు చెడిపోవడం లేదా పని చేయక పోవడం వలన వస్తున్నదని నమ్ముతున్నారు. అలా చెడిపోయిన భాగం మాత్రం బాగుచేయడం వలన గాని, దానిని తీసివేసి మరొక భాగం చేర్చడం వల్ల గాని మానవ యంత్రం బాగుపడి యథాప్రకారం పని చేస్తుందని భావిస్తూ వచ్చారు. ఆయుర్వేదం ఇలా మానవుని వివిధ అవయవాలకు అంతగా ప్రాధాన్యం ఇవ్వడం లేదు. మానవుడు అంటే భౌతిక శరీరమే కాదు. ఇంద్రియాలు, మనసు, ఆత్మ– వీటి సముదాయం అని ఆయుర్వేదం నిర్వచిస్తున్నది. మానవ యంత్రంలో తనకు తానే మరమ్మతు చేసుకోగల శక్తి ఉంది. ఈ శక్తి ఆత్మ అనే నియామకుని (డైరెక్టర్) వలన కలుగుతుంది. ఆయువు అంటే శరీరేంద్రియ స్వత్వాత్మ సంయోగం. వానిలో ఆత్మకు నశించదు. మిగిలినవి పుడుతూ, వృద్ధి చెందుతూ, నశిస్తూ అనేక మార్పులకు లోనవుతూ ఉంటాయి.

మహా విశ్వంలో ఎలాగో, మానవ శరీరంలో కూడా అసంఖ్యాకంగా అణు మాత్రమైన కణాలు ఉన్నాయని, అవన్నీ ఆత్మ అనే చేతనా ధాతువు కూర్చినవని ఆయుర్వేద సిద్ధాంతం (చరక సంహిత శారీర 2,3). 'అపరి సంఖ్యేయా లోక పురుషావయవ విశేషార్థ:'. విశ్వంలోను తనలోను ఉన్న ఈ సామ్యం గురించి తెలుసుకొనగలిగిన వాడు తన విధులను ఏ ఫలితమును ఆశించక నిష్కాముడై చేస్తాడు.

ఈ శరీరం తన కోసం కాకుండా పరోపకారార్థం ఏర్పడిందన్న జ్ఞానం ఆయుర్వేదాభ్యాసంతో కలుగుతుంది. ఆయుర్వేదం విశిష్టత త్రిగుణ సిద్ధాంతం, త్రిదోష సిద్ధాంతం. ఆయుర్వేదం వీటి మీదే ఆధారపడి ఉంది. మానవుడు అంటే స్థూల శరీరము, మనసు, జీవాత్మ సంయోగమైన ఉన్నదని చెప్పుకున్నాం. మనసునకు సత్వము రజస్సు, తమము అనే మూడు గుణాలు ఉన్నాయి. వీనిలో సత్వము ప్రకాశింప చేసేది. రజో గుణం ఉద్రేకమును, తమస్సు మూఢత్వమును కలిగిస్తాయి. రజస్తమోగుణాలు వృద్ధి చెంది మనసును చెరిపినపుడు మానసిక వ్యాధులు కలుగుతాయి. మానవునికి స్వాభావికంగా ఉండే ప్రకృతి ఈ త్రిగుణాల ప్రభావం చేతనే కలుగుతుందని ఆయుర్వేద సిద్ధాంతం. మనసులో సామ్యతను శాంతిని ఇచ్చే ప్రవృత్తి సత్వగుణాధిక్యతచే కలుగుతుంది. ఈ త్రిగుణాలను అతిక్రమించిన యోగీశ్వరుడు అంటే మనసులో శాంతి ఉన్నవాడు సుఖ దుఃఖాలకు వశుడు కాకుండా ఉంటాడు. ఇతడే స్వస్థుడని ఆయుర్వేదం చెబుతుంది. ఇతడే ఆరోగ్యవంతుడు. **'స్వస్మిన్ తిష్ఠతే ఇతి స్వస్థ:'**

త్రిదోషాల సామరస్యమే ఆరోగ్యం.వాటి వైషమ్యమే వ్యాధి. వ్యాధి అంటే ఆయా ధాతువుల త్రిదోషాల చేత దూషణకు గురి కావడమే. వాత పిత్త కఫములు అనే పోషక ద్రవ్యాలు సామ్యస్థితిలో ఆహార ద్రవ్యాలుగాను, వైషమ్య స్థితిలో వ్యాధి కారకాలుగాను ఉంటాయి. వాతంలో రజోగుణం, పిత్తంలో సత్వగుణం, కఫంలో తమోగుణం హెచ్చుగా చేరి వాటి ప్రభావం చూపుతాయి.

చికిత్స అనేది అభ్యాసంతో నేర్చుకోదగిన గొప్ప కళ. నేర్పరి అయిన వైద్యుడు సరైన నియానమును తెలునుకొని ఏ మందులునైన ఈయవచ్చు. ఆయుర్వేదానుసారంగా చికిత్స చేయడానికి రోగనిదానం ప్రధానం.

జ్ఞానదీప ప్రదీపేన
యో నా విశతి తత్వవిద్
ఆతురస్య అంతరాత్మానం
ననరోగాఃచికిత్సతి (చరక సంహిత)

(ఏ వైద్యుడు తన జ్ఞానం అనే దీపపు వెలుగుతో రోగి అంతరాత్మలో ప్రవేశింపలేడో ఆ వైద్యుడు ఆ రోగి రోగాలకు సరిగ్గా చికిత్స చేయలేడు). ఈ సూత్రాలలోనే ఆయుర్వేద శ్రేష్ఠత అంతా నిండి ఉంది. ఇందులో ఆధ్యాత్మిక భౌతిక జ్ఞానాలు రెండూ ఇమిడి ఉన్నాయి.

– ఆచంట లక్ష్మీపతి
(జాగృతి, 30.12.1955)



జాతీయ విధానం

త్రిదోష సిద్ధాంతం మీద ఆధారవడ్డ ఆయుర్వేదం చేతనే శాస్త్రీయమైన వ్యాధి నిదాన నిర్ణయాలు జరుగుతాయి. ఈనాటి అధునాతన పరికరాలతో కూడా అల్లోపతి వైద్యులు రోగ నిర్ణయం సరిగా చేయలేకపోతున్నారు. ఆయుర్వేదమే ప్రభుత్వ పరిగణనకు సహాయానికి పాత్రురాలు –అల్లోపతి వైద్యులు కూడా ఆయుర్వేదము నేర్చుకొనేటట్లు ఏర్పాట్లు చేయవచ్చును. భారతీయ వాతావరణానికి సరిపోయే మంచినంతను పాశ్చాత్య వైద్య విధానం నుంచి ఆయుర్వేదం జీర్ణించుకోగలదు.

– దీనదయాళ్ ఉపాధ్యాయ
(జాగృతి, 30.12.1955)



ఆయుర్వేదంపై ప్రత్యేక సంచిక

1955, డిసెంబర్ 29,30,31వ తేదీలలో కర్నూలులో 41వ అఖిల భారత ఆయుర్వేద మహాసభలు నిర్వహించారు. ఆ సందర్భంగా జాగృతి వెలువరించిన ప్రత్యేక సంచిక (30.12.1955)లోని వ్యాసాలు ఇవి. ఈ సంచికకు నాటి భారత ఉపరాష్ట్రపతి ఆచార్య సర్వేపల్లి రాధాకృష్ణన్, అఖిల భారత ఆయుర్వేద కాంగ్రెస్ అధ్యక్షుడు వై. పార్థనారాయణ పండిత్, దీనదయాళ్ ఉపాధ్యాయ, రాష్ట్ర మంత్రి కళా వెంకటరావు, లోక్‌సభ స్పీకర్ జి. మవలంకర్, నాటి మధ్యప్రదేశ్ గవర్నర్ డా. భోగరాజు పట్టాభిసీతారామయ్య, ఏపీ గవర్నర్ సీఎం త్రివేది శుభాకాంక్షలు తెలియచేశారు.

అజరామరం.. అ

ముందుగా, రాష్ట్రీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు. ఆయుర్వేద అధిష్టాన అధిపతి శ్రీ ధన్వంతరి భగవానుని ఆశీర్వచనాలు. ఆయుర్వేద ప్రయోజనాలన్ని అందరికి అందుబాటులోకి వచ్చి, ప్రపంచమంతా శీఘ్రంగా ఆరోగ్యభాగ్యంతో పరిఢవిల్లుగాక.

ఆయుర్వేదం మానవాళికి లభించిన అద్భుత మైన, ఏ కాలానికైనా అత్యాధునికమని అనిపించే, అనన్య సామాన్యమైన గొప్ప శాస్త్రం. ఆయువు అంటే ఇక్కడ జీవితమని అర్థం. అంతేకానీ జీవితకాలం (span of life) అని కాదు. 'ఆయుర్వేదయతి విందయతి ఇతి ఆయుర్వేదః' అంటే జీవితం గురించి తెలియచెప్పేదీ, జీవితాన్ని ఇచ్చేదీ ఆయుర్వేదమని అర్థం.

ఇంతకీ జీవితమంటే ఏమిటి? శరీరం, మనసు, ఇంద్రియాలు, ఆత్మ వీటి కలయికనే జీవితం అంటారు. అంటే వీటిల్లో ఏ ఒకటి లేకపోయినా అది జీవితం అనిపించుకోదు. ఇలాంటి ఈ జీవితాలతో కూడిన మానవులు ఈ ప్రపంచంలో ప్రధానంగా నాలుగు రకాలని, ఆ నాలుగు రకాల జీవితాలను వివరించేది, వాటి ఉద్ధరణకు తెలుసుకొనవలసిన విషయాల్ని తెలిపేది ఆయుర్వేదం. అంటే మంచి చెడు, తరతమ భేదాలు లేకుండా అన్ని రకాల ప్రాణుల మేలు కోసం ఉద్దేశించిన జ్ఞానం ఆయుర్వేదం.

కానీ, దురదృష్టం ఏమిటంటే– ఈరోజు సమాజంలో ఆయుర్వేదం అంటే విపరీత ధోరణులు కనపడుతున్నాయి, వినపడుతున్నాయి. ఆయుర్వేదమనగానే ప్రపంచ దేశాల వారికే కాకుండా, భారతదేశ వాసులకు సహితం మనసులో స్ఫురించేది– చెట్లతో తయారు చేసిన మందులు, కషాయాలు, చూర్ణాలు తైలాలు, నూనెతో మర్దనలు, పంచకర్మలు చేయటం, పథ్యాలు, నెమ్మదిగా ఫలితమిచ్చే సహజ (natural) సాంప్రదాయక (Traditional) చికిత్సా పద్ధతి అని. ఇంకా– నానమ్మలు, అమ్మమ్మలు చేసే చిట్కా వైద్యం; ఎవరైనా చేసుకోగలిగే వంటింటి వైద్యం అని కూడా. సభ ఏదైనసరే వేదిక ఎక్కి ఎవరంటే వారు ఇవన్నీ నొక్కి చెప్పే చనువు ఇచ్చిన చారిత్రాత్మక చికిత్సా పద్ధతి. ఇంకొద్దిగా ముందుకు వెళితే, గత 20 – 30 సంవత్సరాలుగా చదువుకున్న వారి మనసులో స్ఫురించేదేమిటంటే: ఇదొక భారతీయుల పురాతన చికిత్స పద్ధతి. శాస్త్రీయమైనది (scientific) కాకపోయినా సైడ్ ఎఫెక్ట్స్ లేని, అన్ని వ్యాధులకు కాకపోయినా కొన్ని వ్యాధులకు మంచి మందులున్నటు వంటి, ఏమర్జెన్సీ ట్రీట్మెంట్ లేనటువంటి, ఒక సహజ చికిత్స పద్ధతి అని. ఆధునికుల మరీ లేటెస్ట్ భావన చెప్పాలంటే "ఇది ప్రధానమైన (important & primary) వైద్యశాస్త్రం కాదు; ప్రపంచం లోని వివిధ దేశాలలో ప్రచలితమై ఉన్న ఆయా దేశ చికిత్స పద్ధతుల వలె ఆయుర్వేదం భారతదేశంలో ప్రచలితమై ఉన్న ఒక ప్రత్యామ్నాయ (alternative) చికిత్స పద్ధతి మాత్రమే. ఇందులో రోగిని రోగాన్ని పరీక్ష చేసే సైంటిఫిక్ పరీక్ష పద్ధతులు కానీ, బ్లడ్ టెస్ట్, ఎక్స్ రేలు మొదలగునవి కానీ ఏమీ ఉండవు. ఇందులోని వైద్యులు రోగి నాడి చూసి, వ్యాధిని ఊహించి, ఔషధాలు ఇచ్చి, ట్రీట్మెంట్ చేస్తూ ఉంటారు. ఆయుర్వేద మందుల్లో మెటల్స్ (బంగారము మొదలగు ధాతువులు) వాడుతుంటారు. ఇవి కిడ్నీలను, లివర్‌ని పాడు చేస్తుంటాయి కాబట్టి, మరో మార్గములేనప్పుడు, చివరి ప్రయత్నంగా ఆశ్రయించ దగిన చికిత్స పద్ధతి ఇది అని.

నిజమేమిటంటే, ఆయుర్వేదం చెప్పిన విషయానికి, వీరి భావనలకీ నక్కకి నాకలోకానికి ఉన్నంత వ్యత్యాసమున్నది. **ఆయుర్వేద జ్ఞాన సంపదతో పోలిస్తే నేటి అత్యాధునిక వైద్య శాస్త్రాలన్నీ కూడా సముద్రం ముందు నీటి బిందువు లాంటివి మాత్రమే.** వచ్చిన చిక్కల్లా ఏమిటంటే ఆయుర్వేదం తను చెప్పదలుచు కున్న విషయాన్ని విచక్షణ, విజ్ఞత, విశ్లేషణాత్మకమైన విశేష ప్రౌఢ బుద్ధి కలవారికి మాత్రమే అర్థమయ్యే విధంగా సంక్షిప్తంగా, సూక్ష్మంగా, సూత్రప్రాయంగా మాత్రమే వివరించి చెప్పడం. ఇది నేటి శాస్త్రాల వలె చదవడం వచ్చిన సగటు మనిషికి అర్థమయ్యేట్టు అనేక పెద్ద పెద్ద గ్రంథాల రూపంలో విషయాన్ని వివరించి చెప్పలేదు. అలాంటి గ్రంథాలను ఆయుర్వేదం అనార్య (unauthentic) గ్రంథాలుగా పేర్కొంది. ఎందుకంటే విషయ వివరణ అనేది ఆయా కాలాన్ని సందర్భాన్ని చదివే వ్యక్తిని బట్టి మారిపోతూ ఉంటుంది. శాస్త్ర గ్రంథాలు ఎప్పుడు అలా ఉండకూడదు. అవి చెప్పే విషయాలు అనంతకాలం వరకు ఉపయోగపడేవిగా ఉండాలి. విజ్ఞులు వాటిని సందర్భానుసారంగా విశ్లేషించుకుని ఉపయోగించు కోవాలి అనేది ఆయుర్వేదం ఉద్దేశం. శాస్త్రం, శాస్త్రీయమైన విషయాలు ఎన్నటికీ మారవు, వాటి విశ్లేషణలు మాత్రమే మారుతుంటాయి (విస్తారయతి లేశోక్తం సంక్షిప్తతివిస్తరం, సంస్కర్తా కురుతే తంత్రం పురాణం చ పునర్నవం). అందుకే ఆయుర్వేదం అనాది, అనంతం, పుణ్యతమం అని పేర్కొంచింది. ఆయుర్వేద శాస్త్రం నేటి అలోపతి వైద్యశాస్త్రం వలె నేటి మానవుల మేధస్సు, విశేషణలకు తగినట్టిగా రాసిన, ఎల్లప్పుడు మారిపోతు ఉండే శాస్త్రం (Evolving science) కాదు. ఆయుర్వేదం ఒక సహజ సిద్ధమైన శాస్త్రం (Emerged science). మహా ధీమంతులు, విజ్ఞులు, విశ్లేషణ సమర్థతా సంపన్నులు,

ప్రొఫెసర్ డాక్టర్ నార్లకంటి శ్రీధర్

యుర్వేదం

తపస్సంపన్నులు, త్రికాలజ్ఞులు, సహజ సత్పురుషులు, సర్వ శ్రేయోభిలాషులు, సర్వ ప్రాణులకు ఆప్తులు అయినటువంటి మహా రుషులు ప్రయత్న పూర్వకంగా విషయాన్ని సంపూర్ణంగా తెలుసుకొని ఒకేసారి, ఒకేచోట తెలియచెప్పే ప్రయత్నం చేసినటువంటి, సంస్కృత భాషలో, వ్యాకరణ బద్ధమైన శైలిలో గ్రంథస్థం చేసిన శాస్త్రం. అందుకే ఇది ఎటర్నల్ సైన్స్. అందుకనే సంస్కృత వ్యాకరణంపై పెద్దగా అవగాహన లేని ఈనాటి తరం వారికి ఆయుర్వేద గ్రంథాలు కొరుకుడు పడని కొయ్యగా మిగిలిపోయాయి. సంస్కృత భాషను నేర్చుకొని చదివే ప్రయత్నం చేసినా కూడా విషయం సంక్లిష్టగా (complex) వ్యక్త పరచడం వల్ల శాస్త్రం సులువుగా అర్థం కాదు. ఆయుర్వేద గ్రంథాల్లో సుమారు 5% శాస్త్రం మాత్రమే నేడు వినియోగంలో కనపడుతున్నది. అది కూడా కేవలం వ్యాధుల చికిత్స రూపంలో కనపడుతోంది. శాస్త్రం ఔన్నత్యాన్ని తెలిపే విషయాలు ఏవి నేటి సమాజంలోని వారికి తెలియనే తెలియవు. అందుకే నేటి సమాజానికి ఆయుర్వేదం పట్ల పూర్తి విరుద్ధమైన అవగాహన మాత్రమే ఉన్నది. మరి ఆయుర్వేదం నిజస్వరూపం ఏమిటో సంక్షిప్తంగా చెప్పే ప్రయత్నం చేస్తాను.

ఆయుర్వేదం వైద్యశాస్త్రం కాదు. వైద్యశాస్త్రం ఆయుర్వేదంలో ఒక చిన్న విభాగం మాత్రమే. జీవము జీవ సముదాయము వాటి జనన జీవన మరణాలు; ఈ సందర్భాలలో వాటికి ఉపయోగపడే వివిధ వస్తు సముదాయాలు, వాటి జననం గుణగణాలు లక్షణాలు, ప్రభావాలు, పరిణామాలు, వీటికి, ప్రాణులకు మధ్య ఉన్న సంబంధాలు, వాటి మంచి చెడు ప్రభావాలు, నేల, నీరు, నిప్పు, గాలి ఆకాశాల (పంచ మహాభూతాల) ఉత్పత్తి, వాటి గుణగణాలు, వీటి వల్ల వాతావరణం, రుతువులు ఏర్పడే పద్ధతి, వీటికి, జీవ నిర్జీవ వస్తు సముదాయాలకు మధ్యగల సంబంధం, వీటిపై వాటి ప్రభావం, నేల నీరు నిప్పు గాలి లోగల ప్రధానమైన రకాలు వాటి గుణదోషాలు, జీవరాశుల మొక్కలలోని ప్రధానమైన జాతులు, వాటి శరీర భాగాలు, వాటి గుణగణాలు, ఉపయోగాలు, మనిషి పుట్టే విధానం, శరీర నిర్మాణ పద్ధతి, దానిలోని వివిధ అంశాలు, శరీర ప్రధాన అంగాలు ఉపాంగాలు అవయవాలు వాటి ఉత్పత్తి, గుణగణాలు, కార్యాలు, వాటి కార్యాలను నడిపిస్తూ వాటి మధ్య సమన్వయాన్ని కుదిరించి ప్రాణి ప్రాణాన్ని కాపాడే అంశాలు, వాటి విశిష్టత, శరీరం వివిధ దశలు, లింగ వివేచన, వాటి విశిష్టతలు, వ్యక్తి వ్యక్తిత్వ నిర్మాణం విశిష్టత మొదలగునవన్నీ కూడా వివరించి చెబుతుంది.

ఆయుర్వేదం చెప్పిన ఒక విశిష్టమైన విషయమేమిటంటే సజీవ నిర్జీవ సముదాయాల మధ్య ఉన్న ఒక విశేషమైన అనుబంధం. వాటి మధ్య గల సమన్వయ పద్ధతి. అంటే మన చుట్టూ ఉన్న నిర్జీవ పదార్థాలు స్పందన రహితంగా తటస్థంగా ఉన్నట్లు అనిపిస్తున్న ప్పటికీ అవి మన కార్యకలాపాలకు అనుగుణంగా స్పందిస్తూ ఉంటాయి. తదనుగుణంగా వాటి గుణగణాల్లో మార్పులు చేర్పులు కలుగుతుంటాయి. అందుకే మానవులు ధర్మపరులై సత్ప్రవర్తనతో తమ చుట్టూ ఉన్న సజీవ నిర్జీవ సముదాయముతో పద్ధతిగా వ్యవహరించాలని ఆయుర్వేదం సూచిస్తోంది. అంటే ఆయుర్వేదం మానవులకే కాదు సమస్త భూమండలానికి హితము చేసేటువంటి మహత్తర శాస్త్రం. **అంటే ఇది నా జీవితం నా ఇష్టం వచ్చినట్లు బ్రతుకుతాను. మీరెవరు అనేందుకు అనేటువంటి ధోరణి సరియైనది కాదని, అలాంటి అసభ్యకర జీవన విధానం వల్ల చుట్టూ ఉన్న వస్తు సమూహాలు తమ సుగుణాలను కోల్పోతాయని ఆయుర్వేదం హెచ్చరిస్తోంది.**

నేటి వరకు ఏ ఇతర జీవశాస్త్రాలకు, శాస్త్రజ్ఞులకు తెలియని, ప్రాణిలో ఉండే శరీరం, శరీర యంత్రాంగం, శరీర తంత్రం అనే మూడు ప్రధాన అంశాలు, వాటిలోని వివిధ భాగాలు, ఈ మూడింటి స్థూల, సూక్ష్మ నిర్మాణం, వాటి వివిధ అంశాలు. పనితీరు, వాటి మధ్య సంబంధాలు, ఈ మూడింటికి హితమైన, అహితమైన విషయాలు. ఈ మూడింటికి గల ముప్పులు, వాటిని తొలగించుకొని వాటిని సంరక్షించుకొనవలసిన పద్ధతులు ఆయుర్వేదం వివరించి చెప్పింది. ఆరోగ్యం అంటే ఏమిటి? ఆరోగ్య సంరక్షణ, అభివృద్ధి, క్షయములలో ఈ మూడింటి పాత్ర కోసం చాలా వివరించి చెప్పింది ఆయుర్వేదం. అదేవిధంగా ఆహారమంటే ఏమిటి, ఆహారా పదార్థాలలో ప్రధానమైన రకాలు, వాటి సేకరణ సమయం, ఆహారం వండ వలసిన పద్ధతి, ఆహారం పై వివిధ పాత్రల, సమయం ప్రభావం, భోజనం చేయవలసిన విధానం, ఆహార ప్రమాణం, తమకు సరిపడని పదార్థాలను తిరిగి సరిపడేలా చేసుకొనే పద్ధతి, తమకు హితవు కాని పదార్థాలు అలవాటైపోతే వాటిని విడిపించుకొనే పద్ధతులు, శరీర కార్యాలు వ్యాధులు వాటి చికిత్సలపై ఆహారం ప్రభావం మొదలైన అనేకమైన విషయాలను తెలిపింది. శరీరం, శరీర యంత్రాంగం పనితీరు, వ్యాధుల రకాలు, వ్యాధులు ఉత్పత్తి చెందే పద్ధతి, రోగిని రోగాన్ని పరీక్ష చేసి రోగాలను నిర్ధారించే అనేకానేక పద్ధతులు, వివిధ రకాల వ్యాధులు వాటి సాధ్యాసాధ్యతా లక్షణాలు, వాటి అనేక చికిత్స పద్ధతులు, చికిత్స చేయకుంటే సంభవించే విపరిణామాలు, ప్రాణాలను కాపాడే ఉత్తమ వైద్యుని, ఔషధం, పరిచారకుల, రోగి లక్షణాలు మొదలగు ఎన్నెన్నో విషయాలను చాలా చక్కని రీతిలో వివరించి చెప్పింది.

అంతేకాదు, శాస్త్ర విషయం విస్తృత తత్వాన్ని గమనించి వైద్యశాస్త్ర అంశాలను అలనాడే ఎనిమిది విభాగాలుగా (Specialization) విభజించి వివరించింది. సుమారు ఆరు వేల సంవత్సరాల పూర్వమే అక్షరబద్ధమై, నేటికీ లభిస్తున్న ఆయుర్వేద గ్రంథాలు సృష్టికి, జీవితానికి సంబంధించిన ఎన్నో అద్భుతమైన విషయాలను ఇంత తార్కికంగా, క్రమపద్ధతిలో వివరించి చెప్పడం అనేది ఒక అద్భుతమైన, అనితర సాధ్యమైన విషయంగా కనిపిస్తుంది. ఆధునిక శాస్త్రీయ దృక్పథం గల నేటి మానవులకు ఊహకందని ఎన్నో విషయాలు శాస్త్రోక్తంగా విశ్లేషణాత్మకంగా ఆనాడే వివరించి చెప్పింది ఆయుర్వేదం. ఇక్కడ చెప్పిన విషయాలు చాలా కొద్దిగా ఉదాహరణార్థం మాత్రమే చెప్పినవి. నిజానికి శాస్త్రంలో ఉన్న విషయాలు అనే కానేకం అనంతంగా ఉన్నాయి. **కాబట్టి మన ఆయుర్వేద శాస్త్రం అనేది అనన్యమైన, అజరామరమైన అత్యాధునిక శాస్త్రమని చెప్పడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు.** నేటితరం తెలుసుకొనవలసిన ఇంతటి గొప్ప శాస్త్రాన్ని అలా అధ్యయనం చేయకుండా వదిలి వేయటం మన దౌర్భాగ్యం. కాబట్టి ఇంతటి గొప్ప ఆయుర్వేద శాస్త్రాన్ని అధ్యాయనం చేసి శాస్త్ర విషయాలు ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు తమవంతుగా నేటి యువత ముఖ్యంగా శ్రద్ధ, బుద్ధి కుశలత గలిగి వైద్యులుగా తయారు కావాలనుకున్నవారు ముందుకు రావాలి.

సర్వేజనాః సుఖినోభవంతు. ★

వ్యాసకర్త: డాక్టర్ బి.ఆర్.కె.ఆర్ ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల ఆచార్యులు

గణపతిదేవుడు

4

గుర్రాలపై నుండి తల త్రిప్పడం లేదు. ముఖంలో అదే చిరాకు.

అప్పుడు యువకులను తప్పుకుని ముందుకొచ్చాడో బలిష్టుడు. నడుముకు పంచె కాసే బిగించి గోచి పెట్టి ఉన్నాడు. వంగీ వంగకుండా వంగాడా బలిష్టుడు. బండీ ముందు వంగడం.. అదీ తమ యువరాజుల సమక్షంలో వంగాలో వద్దో తెలియని మీమాంసతో కాస్త వంగాడు.

అతనిని అశ్వశిక్షకుడుగా గుర్తించాడు గణపతి దేవుడు.

"ఎవడ్రా.. ఇలాంటి నాసిరకం గుర్రాలను భావి యువరాజుల శిక్షణకు ఉపయోగిస్తున్నది? ఎవరు చెప్పారు నీకు వీటిపై శిక్షణ ఇవ్వవలసిదని.. ఇవి గాడిదల కంటే హీనం. సాధారణ సైనికులకే వీటిని ఉపయోగించకూడదు.

అలాంటిది భావి రారాజులయిన యువరాజుల శిక్షణకు వాడతావా.. మా రాజ్యంలోనయితే నీకు కొరత వేయించేవారు మా పెదనాన్నగారు."

గణపతి మాటలతో అతని కంటే యువరాజులే క్రోధంతో రెచ్చిపోయారు. అతన్ని చంపేస్తామన్నట్లు చూశారు.

వాడు భయంతో వణకుతూ, "క్షమించాలి యువరాజా.. గుర్రాల ఎంపిక నాది కాదు. ఇక్కడకు తోడ్కొని వచ్చిన గుర్రాలతో శిక్షణ గరపడమే నా పని."

"సరే. నీ పని నువ్వు నిర్వహిస్తున్నావు. కానీ ఇవి నాసిరకం గుర్రాలని నీకు తెలుసా! తెలిస్తే పెద్దలకు తెలియ జేశావా? కనీసం యువరాజులకు అయినా చెప్పావా? అది కూడా నీ బాధ్యత కాదా?!!"

గణపతి ప్రశ్నలకు సదరు శిక్షకుడు వణికి పోతుంటే యువరాజులకు గణపతి మీద గౌరవం పెరుగుతున్నది.

అనంతరం అశ్వాల గుణగణాలు లక్షణాలు వాళ్లకు వివరించాడు గణపతిదేవుడు. గుర్రాలలో కూడా బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర రకాలుంటాయని.. గుర్రానికి జాతి చాలాముఖ్యమని.. వాటి రంగు, వన్నె పరిశీలించాలని, అలాగే ఒంటిపై ఉండే చుక్కలు, సుడులతో పాటు గుర్రం స్వరం కూడా పరిశీలించాలని.. చర్మం దళసరిగా ఉంటే పై నున్న వెంట్రుకలు మృదువుగా ఉండాలని.. కాలి గిట్టలు.. నడకలో కాళ్లు విసిరే పద్ధతి.. పరుగులో వేగం.. ఆగడం.. చెప్పింది విని ఎటు తిరగమంటే అటు తిరగడం.. ఇవన్నీ ఉన్న గుర్రాన్నే యుద్ధానికి ఎంచుకోవాలి. అలా ఎంపిక చేసిన గుర్రాల పైనే యువరాజులకు శిక్షణ ఇవ్వాలి. అప్పుడే యువరాజు అంతరంగానికి తగినట్లు ఎలా మసలుకోవాలో ఆ గుర్రం ఆనతికాలంలోనే గుర్తిస్తుంది. అప్పుడే ఆ యువరాజు తనకు కావాల్సిన విధంగా దానిని మలచుకుని విజయమే లక్ష్యంగా యుద్ధం చేయగలుగు తాడు. అల్లాటప్పా గుర్రలపై నేర్చుకుంటే ఏమౌతుందో ఆలోచించండి.."

అంతా నిశ్శబ్దం.. రెప్పవేయకుండా గణపతిదేవుడినే చూస్తుండిపోయారు.

"ఎవరు మీ రాజ్యానికి అశ్వాలను అందించే విదేశీ వర్తకుడు? పిలిపించండి. ఏ దేశాలనుండి గుర్రాలను దిగుమతి చేసుకుంటున్నారు? సైన్యంలో కూడా ఇలాంటివే ఉన్నాయా? ఉంటే ఇప్పటికి అన్యాయంగా ఎంతో మంది సైనికులు దారుణంగా చనిపోయి ఉంటారు. రేపటికి అత్యుత్తమ జాతి గుర్రాలు.. ఓ వంద గుర్రాలు ఈ అశ్వశాలలో ఉండాలని ఆజ్ఞ ఇవ్వండి యువరాజా.." అన్నాడు అందరివంక చూస్తూ.

అతని చూపులో అందరిలో ఆజ్ఞ ఇవ్వగల అధికులెవ్వరో.. అన్న జిజ్ఞాస ఉంది.

అప్పుడొక యువరాజు ముందుకొచ్చాడు. "తప్పక ఆజ్ఞ ఇస్తాను గణపతిదేవా." అన్నాడు.

ఈసారి గణపతి ఆశ్చర్యపోయాడు. ఎందుకంటే ఇప్పటివరకూ ఈ యువకులెవ్వరూ అతని పేరు ఉచ్చరించలేదు. అతని వంక గౌరవంగా ప్రశ్నార్థకంగా చూశాడు. మరో యువరాజు ముందుకొచ్చి చెప్పాడు.

"యువరాజు సింఘణ భూపాలుడు.. జైత్రపాల మహారాజుగారి వారసుడు.."

అనగా సదరు వారసుడు హుందాగా నవ్వి మీసం తిప్పాడు. గణపతిదేవుడు అతనిని ఆత్మీయంగా చూస్తూ అభివాదం చేశాడు.

'వీడేనన్నమాట నా భవిష్యత్ శత్రువు.' అనుకున్నాడు కూడా.

అశ్వజాతిపై గణపతిదేవునికున్న సాధికారత అందరిని మంత్రముగ్ధులను చేసింది. మొత్తం యువ బృందమంతా అతని పాదాక్రాంతమయ్యారు. గణపతి వెనుదిరిగితే అంతా అతని వెనకే కదిలారు.

వీరందరికి ఆవలగా ఓ గుర్రంపై కూర్చున్న యువతి అతన్నే తీక్షణంగా చూస్తోందని గణపతి ఇతర యువరాజ బృందం గమనించలేదు.

* * *

మరునాడు అక్కడ వందగుర్రాలు వరుస కట్టి ఉన్నాయి.

చూడగానే గణపతి కళ్లు మెరిశాయి. "చూశారా.. చూశారా.. యువరాజులారా.. దూరానికే అవి అద్భుతంగా గోచరించడం లేదూ..?" అంటూ వాటి దగ్గరగా వెళ్లి ఓ గుర్రాన్ని చూసి ఆనందంగా పిచ్చికేక పెట్టాడు. 'ఇది.. ఇది.. నాకు కావాల్సిన గుర్రం.. ఇది రోహితం.. అంటే దేవతల అశ్వం. వీటి కోసమే అప్పట్లో యజ్ఞాలు చేసి రోహితాలను తేవలసినదిగా అగ్నిదేవుడ్ని ప్రార్థించేవారట. మా పెదనాన్నగారు చెప్పారు. మరీ గుర్రాల కోసం యజ్ఞాలు చేస్తారా బడాయి కాకపోతే.. అనకండి. యుద్ధంలో గుర్రం సహకారం ఎంతో ఉంటుంది. కావాలంటే ఋగ్వేదం పఠించండి.."

అంటూ హుషారుగా ఆ గుర్రాన్ని ఆప్యా యంగా చూసి సాటి వీరుడిని గౌరవించినట్లు వినయంగా వందనం చేశాడు. దాని నఖశిఖ పర్యంతం చూస్తూ అక్కడక్కడా చరుస్తూ మెల్లగా నిమురుతూ.. చర్మాన్ని రెండు వేళ్ల మధ్య పట్టి మెలి తిప్పుతూ దాని చుట్టూ తిరిగాడు. కాలిగిట్టల వరకూ పరిశీలించాడు. మధ్య మధ్య ఉత్సాహంతో ఈల వేశాడు. పొంగిపోయాడు. ఎగిరి దూకాడు.

హటాత్తుగా "జై కాకతమ్మ తల్లి" అంటూ ఓ

మత్తి భానుమూర్తి

'జాగృతి' నిర్వహించిన స్వర్గీయ కొండపాక కిషన్‌రావు స్మారక నవలల పోటీలో ప్రథమ బహుమతి పొందిన రచన

అరుపు అరిచి రెప్పపాటు కాలంలో ఇనుప తీగేలా ఝుమ్మని ఎగిరి దానిపై అధిరోహించి కళ్లాన్ని వడిసి పట్టి చల్ అంటూ రెండుకాళ్లతో దాని నడుము వద్ద సున్నితంగా తన్నాడు.

ఇదంతా లిప్తకాలంలో చేశాడు.

ఒక్క ఉదుటన ఆ అశ్వం ముందు కాళ్లపై ఆకాశమంత ఎగిరి అద్భుతంగా సకిలించి పరుగు లంఘించుకుంది.

దాని హోయలు చూస్తున్న దేవగిరి యువరాజులు కళ్లముందు మహాద్భుతం జరుగుతున్నట్లు రెప్ప వెయ్యక నిలబడి చూస్తున్నారు. ఆ అశ్వంపై గణపతి చేస్తున్న విన్యాసాలు గగుర్పాటుకు గురిచేస్తున్నాయి. ఒక్కక్షణం అశ్వం మాయమైపోతోంది. మరుక్షణం ఆకాశం నుండి ఊడి పడినట్టు ప్రత్యక్షమవుతుంది. ఒక్కోసారి నిలబడి చూస్తున్నవారి తలలను తాకుతూ ఎగిరి పోతోంది. మళ్లీ తిరిగి దూకుతోంది. అప్పుడప్పుడూ ఒక లయతో సకిలిస్తోంది. దానితో పాటే గణపతి కూడా అరుస్తున్నాడు ఉద్వేగంగా. మళ్లీ అప్పుడే పగలబడి నవ్వుతున్నాడు హాయిగా. అశ్వం కూడా తల తిప్పుతోంది అభినందనగా.

అప్పుడు జరిగింది ఇది.

గుర్రం హటాత్తుగా క్రింద పడిపోయింది. లాఘవంగా ప్రక్కకు దూకాడు గణపతి. గుర్రం అటూ ఇటూ దొర్లింది.

మళ్లీ చటుక్కున లేచింది. రెప్పపాటుకాలంలో గణపతి దానిపైకి ఎగిరి కూర్చున్నాడు. చూస్తున్న వారికి పిచ్చెక్కిపోయింది. గుర్రం పడటం.. గణపతి ఒడుపుగా ముందే దూకడం.. తిరిగి లేవగానే గణపతి దాని మీదకు లంఘించడం.. మళ్లీ ఎప్పటి లాగే స్వారీ కొనసాగించడం..

కలా నిజమా..

ఆ అశ్వంతో గణపతి చేసిన విన్యాసాలు ఆ యువరాజులను నిశ్చేష్టులను చేశాయి.

గణపతి దిగగానే అశ్వం కూడా ఏ మాత్రం అలసట లేకుండా మామూలుగా నిలబడి ఉంది. దానిని అభినందనగా.. గౌరవంగా మెడపై చరచి యువరాజులను చూసి నవ్వాడు గణపతి.

ఆ రోజునుండి దేవగిరి రాజ్య యువ నాయకులంతా దాదాపు పాతికమంది.. పూర్తిగా గణపతి వెనకే తిరుగుతున్నారు. ఈ యువరాజుల అనుయాయులు, పరిచారికలు కూడా ఈ బృందం వెనుకే వస్తున్నారు. గణపతి ఆదేశంపై యువరాజులు అనుజ్ఞ ఇచ్చినవి చకచకా సిద్ధం చేస్తున్నారు.

ఇప్పుడు గణపతి చెరసాల గది వద్ద దినమూ పెద్ద కోలాహలం.

అక్కడికి కొన్ని పల్యంకాలు, గణపతికో ప్రత్యేక పల్యంకం తెప్పించారు. వారంతా కూడా పల్యంకాల మీద, చాపల పైనా కూర్చుంటూ.. నిలబడుతూ.. ఎగిరి గంతులువేస్తూ గణపతితో కబుర్లు.. ముచ్చటే ముచ్చట్లు.

కాని యువ గణపతి రుద్రదేవుని నిర్మాణం. ఎక్కడా తన స్థానం మర్చిపోలేదు. అతనికి ఆమడ దూరంలో కనుచూపుమేరలో ఎప్పుడూ నాగతిస్య. ఇద్దరి చూపులు కలుస్తూ విడిపోతూ ఉంటాయి. భగవంతుడికి కూడా అనుమానం రాదు!!

"గణపతిదేవా.. ఆ గుర్రం క్రింద పడినప్పుడు.. అంటే అది పడబోతున్నట్లు నువ్వు ఎలా గుర్తించావూ? ఎలా లిప్తకాలంలో ముందే ఎలా దూకేశావూ?" ఇలాంటివి ఒక్కొక్కడూ వంద ప్రశ్నలు!!

"అది నా గొప్పదనం కాదు. ఆ అశ్వపు లక్షణం. అది ఎట్టి వరిస్థితుల్లోనూ

క్రిందపడి ఉండిపోదు. తప్పకుండా లేచి తీరుతుంది. మీరు శిక్షణ పొందు తున్న అశ్వాలు పడిపోతే లేవవు. మిమ్మల్ని శత్రువు కత్తికి దగ్గరగా అందిస్తాయి.. అర్థమైందా!"

నిబిడాశ్చర్యంతో అందరిలో మౌనం!

వాళ్ల ఆశ్చర్య సంభ్రమాలు చూస్తుంటే గణపతి దేవునికి నవ్వొస్తున్నది. ఇవన్నీ రుద్రదేవ మహారాజులు తనకు చెప్పిన.. నేర్పిన.. నేర్పించిన చిన్నచిన్నపాఠాలని వాళ్లకు తెలియదు. ఇలాంటివి చూస్తేనే దిగ్భ్రమతో నోరు వెళ్లబెడుతున్నారీ యువరాజులు. ఇక్కడ ఎంత అధమస్థాయి యుద్ధ శిక్షణ గరపుతున్నారు?!

'ఇలాంటి నాసిరకం వీరులపైనా కాకతీయులు ఓడిపోయింది!? అంతేకాదు తన తండ్రి మహాదేవ నాన్నగారిని పొట్టను పెట్టుకున్నారీ పిరికియోధులు..'

తండ్రి మరణం గుర్తురాగానే గణపతిదేవుని మనసంతా విషాదం నిండుకుంది.

దేవగిరి యువరాజులు కూడా యువగణపతి అసమాన ప్రతిభ, విషయ పరిజ్ఞానం చూసి యువరాజే ఇలా ఉంటే ఇక మండలేశ్వరులు, యువవీరులు, సేనానులు, దళపతులు, సేనాధిపతులు, మహా సైన్యాధ్యక్షులు వీర యోధులకు కొదవలేదని చెప్పే కాకతీయసైన్యం తమ సైన్యానికి ఎలా తలవంచింది అని వాళ్ళు కూడా ఆశ్చర్యపోతున్నారు..

ప్రతి రాజ్యంలో ఇలాంటి యువరాజులు ఉండటం సాధారణం. ఇలాంటి యువ బృందాలు కాకతీయ రాజనగరిలో కూడా ఉన్నాయి. కాకతీయ యువరాజు బృందం కూడా చలాకీగా ఉత్సాహంగా ఉండే ప్రతిభావంతుల బృందం.

రుద్రదేవుల వారు అందరిని పేరుపేరునా గుర్తిస్తూ వారి వారి ఎదుగుదలను పరీక్షిస్తూ ఉండేవారు.

అందరిలోకి అగ్రతాంబూలం గణపతిదే. కాకతీయ యువరాజ బృందం కూడా మనసా వాచా కర్మణా గణపతిని తమ నాయకునిగా, తిరుగులేని యోధునిగా గుర్తించి గౌరవిస్తుంది. గణపతి కూడా అందరితో కలివిడిగా ఆప్యా యంగా ఉంటాడు.

దేవగిరి రాజనగరిలో వీళ్లను చూస్తుంటే అనుమకొండలోని తన తమ్ములు చెల్లెళ్లు గుర్తొచ్చారు అతనికి. తనే కాదు, వాళ్లు కూడా తన ఎడబాటును తలపోస్తూ ఉంటారు అనుకున్నాడు గణపతి.

ఇప్పుడు గణపతి పేరుకే ఓ బందీ. అతని నివాసం మాత్రం అదే గది. కాని దానికి బంధనాలు,

తాళాలు లేవు.

అయితే ఆయన ఇచ్చారీతిగా తిరగడం లేదు. అతనిని అక్కడి నుండి మరో చోటుకు మార్చే ప్రయత్నం కూడా ఎవ్వరూ చెయ్యలేదు. మిత్రులైన యువకులు ఎలా ముచ్చట్లు చెప్పుకుంటారో అదే అనుబంధం వారి మధ్య ఏర్పడింది.

కాని వ్యాయామశాలలో యుద్ధ శిక్షణలో గణపతి దేవుని జ్ఞానం ఎక్కువ.

సహజంగా అతను తన ప్రవర్తనతో వారి తప్పులను సున్నితంగా ఎత్తి చూపుతూ గురువులు చెప్పిన వాటి కన్నా వారికి ఎన్నో యుద్ధ వ్యూహాల కిటుకులు చెప్తున్నాడు. ముచ్చట్లతో నవ్విస్తున్నాడు. అభిమానం వేలార్చుతున్నాడు. వాళ్లంతా అతని మాటలకూ, చెప్పే విశేషాలకూ.. ముగ్ధులైపోతున్నారు.

ఆ సమయంలోనే ఓ ముచ్చట జరిగింది.

"నువ్వు యువరాణులను పట్టించుకోవా?"

నాలుగైదు రోజుల తర్వాత ఓ కరకు కోకిల కంఠం యువకుల వెనగ్గా వినపడింది. సాధారణంగా యువకులంతా ఉదయం దాదాపు అందరూ అటూ ఇటూగా ఒకే సమయానికి వ్యాయామశాలకు వస్తారు. అప్పటికే వ్యాయామం చేస్తూ ఉంటాడు గణపతి.

ఇక మొదలవుతాయి వ్యాయామ విన్యాసాలు.. కబుర్లు.. ఇక ఇకలు పకపకలు..

సాధారణంగా వ్యాయామశాలలో యువతులకు ఓ ప్రత్యేక ఆవరణ ఉంది. అక్కడ వాళ్లు వ్యాయామం చేసిన తర్వాత యుద్ధ విద్యల శిక్షణకు బయటకు వస్తారు. మొదటినుండి గణపతిదేవుడు యువతులకు కాస్త దూరంగానే ఉన్నాడు. వాళ్లూ గణపతికి కాస్త ఆవలగా మసలుతున్నారు. కాని ఓ చూపు ఇటు వేసి చూస్తున్నట్లు వారికీ వీరికీ తెలుసు. ఇప్పుడు ఇలా ఒకరు అడిగేసరికి గణపతిదేవుడే కాదు యువరాజులంతా గిరుక్కున తలతిప్పి చూశారు.

గుర్రాలపై పది పదిహేనుమంది యువతులు.. నాయకురాండ్రలా. అందరికి కాస్త ముందున్న యువతి చూపులకే ప్రత్యేకంగా ఉంది. రెప్పపాటులో గ్రహించాడు గణపతి. అశ్వంపై కూర్చున్నామె పట్టపు యువరాణి. బహుశా మహారాజు జైత్రపాలకుని కుమార్తె. ఆమె సౌందర్యవతి. మగరాయు డిలా దర్పంగా ఉంది. ఆమె చూపుల్లో కదలికల్లో అహంతో కూడిన హుందాతనం. ఆమె అందంగా, ఎక్కువ అందంగా ఉంది. స్నిగ్ధ గంభీరం కంటే ఉధృత గంభీరం.

దగ్గరగానున్న ఐదుగురు యువతులు సాధారణ అందగత్తెలయితే అశ్వం పైనున్న ఆమె ఎక్కువ అందగత్తె.

మిగిలినవారు కూడా మంచి అందగత్తెలే. కానీ ఆమెకు దగ్గరగా ఉన్నవారు మాత్రం అందగత్తెలుగా చెప్పడానికి తగరు. అంటే ఆమె అందగత్తెలను తనకు కాస్త దూరంగా ఉంచుతోందన్నమాట.

అందరూ కవ్విస్తున్నట్లు గోలగోలగా అరుస్తూ ఆ అమ్మాయిల చుట్టూ తిరుగుతూ వాళ్లను గణపతి వివరంగా చూడకుండా చప్పట్లు కొడుతూ ఉత్సాహంగా గంతులేస్తున్నారు. నిజంగానే గణపతి కొంచం అమోమయంలో పడిపోయాడు. మొదటిసారి యాదవ యువ రాజ బృందం అతనిపై పైచేయి సాధించింది. అందరూ ఉత్సాహంగా గంతులు వేస్తున్నారు. అందరి మధ్య ఆ నూనె వాడు వచ్చి మెల్లగా అన్నాడు. "క్షమించాలి యువరాజా. కారాగారాధికారి వేంచేయుచున్నారు. బందీ ఇంత సేపు బయట ఉండటం తెలిస్తే వారు ఆగ్రహిస్తారు."

అలా భావించాడు గణపతి. ఆమె అలా భావిస్తోందని అతను అలా అనుకున్నాడు.

ఆమె అతన్ని నఖశిఖ పర్యంతం చూస్తోంది. తనొక బందీనని వాళ్లంతా రాచ కుటుంబీకులని గణపతి ఎప్పుడూ మర్చిపోలేదు. ఇప్పుడు యువతులు ముందుకొచ్చి పలకరించినా అతను కొంచం గంభీరంగానే స్పందిం చదలచుకున్నాడు.

"చెప్పండి యువరాణి.. తమరికి నేనేమి చెప్పగలను?!!"

ఆ యువతుల ముఖాలలో అహం చల్లారిన భావన. ఆమె దగ్గరగా ఉన్నవారే కాదు కాస్త దూరంగా మసలుతున్న వారు కూడా తల తిప్పి అశ్వంపైనున్న యువతిని చూశారు.

ఆమె అశ్వం దిగి దగ్గరగా వచ్చింది. గణపతి భావరహితంగా కనురెప్పలు కదిపాడు. తమకంటే అధికుడు తమ ముందు వినయంగా ఒదిగి ఉండటం ఆ యువతి బృందాన్నంతా పరవశుల్ని చేస్తోంది. అది ఆ బృందపు హావభావాలను శరీర కదలికల ద్వారా వ్యక్తీకరిస్తోంది.

ఆమె ఇప్పుడు అందరిని.. యువరాజులను కూడా వెనక్కునెట్టి మొత్తం బృందపు నాయకురాలిగా గోచరిస్తోంది.

"మేమంతా ఒకే బృందం. నువ్వొచ్చి మమల్ని విడదీశావు.." అన్నదామె గుర్రపు కళ్లెం విలాసంగా ఊపుతో.

"నేనేమి కావాలని చెయ్యలేదు యువరాణీ!"

మరేదో చెప్పబోతుండగా యువకులలో ఒకరు, "ఈ అడిగేదేదో వారం క్రిందటే అడగొచ్చుకదా సోమూ. మేమూ నేర్చుకుంటాం అంటే గణపతి నేర్పన్నాడా?!" అన్నాడు.

ఇద్దరూ మాటా మాటా అనుకుంటున్నారు. ఇతరులు వినోదంలా చూస్తున్నారు. వాళ్ల మధ్య చిన్నగొడవ కూడా గణపతికి ఇష్టంలేదు. అంతిమంగా అది తనకు చెడే చేస్తుందని అతని భావన. వెంటనే మాట మార్చాడు. ఆమెతో అన్నాడు.

"అశ్వపు కళ్లెం అలా తిప్పకూడదు. అశ్వం దిగాక కళ్లెం అలా వదిలేయకూడదు. ఇదిగో అక్కడ ఉంచాలి. లేకపోతే అది సాగిపోతుంది. మీ సూచనలు అశ్వం గ్రహించేది దీని వల్లనే కదా! మీ యుద్ధతంత్రాలు అర్థం కావాలంటే ఈ తోలు కళ్లెం బిగుతుగా ఉండాలి.." వినయంగా వివరంగా చెప్పాడు.

సదరు యువతి ముఖం కందగడ్డ కాగా మిగిలిన యువతీయువకులు అందరూ ఘొల్లున నవ్వారు. ఏమాత్రం వినయం తగ్గలేదు ముఖంలో. కాస్త ఆలస్యంగానైనా ఆమె కూడా అందరితో గళం కలిపింది.

ఇప్పుడు యువతులు, యువకులు ఏకమై పోయారు. అందరూ గణపతి శిష్యులై పోయారు. యువతులు కూడా భక్తిగా అతను చెప్పేవి తుచ తప్పకుండా ఆచరిస్తున్నారు. అమ్మాయిలు కూడా బృందంలో కలసిపోవడంతో సరదాలు, అల్లరులు మరింత శోభాయమానంగా మారుతున్నాయి. యువతులు చెరసాల వరకు రావడం లేదు కాని అవతల ఇవతల యువకులతో కలసి తిరుగాడుతున్నారు.

ఓ ఇద్దరు యువతులను పరీక్షగా చూసి గణపతి అన్నాడోరోజు.

"ఆగండాగండి. మీరిద్దరూ అక్కాచెల్లెల్లా?!"

అందరూ పగలబడి నవ్వారు ఆ ఇద్దరితో సహా. అందులో ఒకరు చెప్పబోతుండగా యువరాణి అన్నది, "అవును అక్కా చెల్లెళ్లే.. వారిలో అక్క ఎవరో.. చెల్లెలు ఎవరో చెప్పుకోవాలి?!!"

అందరూ నవ్వుతూ "ఆ.. గణపతీ ఇప్పుడు చూపించు నీ తెలివి. ఎవరు అక్కో ఎవరో చెల్లెలో చెప్పాలి."

అందరూ కవ్విస్తున్నట్లు గోలగోలగా అరుస్తూ ఆ అమ్మాయిల చుట్టూ తిరుగుతూ వాళ్లను గణపతి వివరంగా చూడకుండా చప్పట్లు కొడుతూ ఉత్సాహంగా గంతులేస్తున్నారు. నిజంగానే గణపతి కొంచం అమోమయంలో పడిపోయాడు. మొదటిసారి యాదవ యువరాజ బృందం అతనిపై పైచేయి సాధించింది. అందరూ ఉత్సాహంగా గంతులు వేస్తున్నారు. అందరి మధ్య ఆ నూనె వాడు వచ్చి మెల్లగా అన్నాడు.

"క్షమించాలి యువరాజా. కారాగారాధికారి వేంచేయుచున్నారు. బందీ ఇంత సేపు బయట ఉండటం తెలిస్తే వారు ఆగ్రహిస్తారు."

అందరిని వదలి వడివడిగా లోపలికి కదిలాడు. ప్రక్కనే వస్తూ, "నా పేరు నాగతిస్య" అన్నాడు.

"చెప్పావ్ గా.. గూఢచారిని అన్నావు కదా!"

అన్నాడు గణపతి.

"ఎవరి గూఢచారినో చెప్పలేదు.. మీరు అడగలేదు."

చటుక్కున ఆగి పోయాడు. "అవునవును.. అడగ లేదు అడగలేదు.."

"నేను కాకతీయ గూఢచారిని యువరాజా! మిమ్మల్ని కంటికి రెప్పలా కాపాడటమే నా ఉద్యోగం."

"చాలా సంతోషమోయ్"

"నేను నాలుగేళ్లుగా ఈ దేవగిరిలోనే ఉన్నాను. ఇటీవలే నన్ను నమ్మి రాజప్రాసాదంలో ఉద్యోగం ఇచ్చారు. రాత్రివేళ ఈ అంతర్వులో దీపాలకు చమురు పోయడం నా పని. రాత్రంతా మేలుకుని దీపాల వెంట తిరుగుతూనే ఉంటాను. పనిలో పనిగా ఎవరెవరు ఎక్కడున్నారూ.. ఎవరెవరు రాత్రి వేళ రహస్యంగా కలుసుకుంటున్నారు అనేవి నా దృష్టి దాటి పోవు యువరాజా! మీరు వెళ్లి విశ్రాంతి తీసుకోండి. మిమ్మల్ని ఎవ్వడూ ఏమీ చేయలేరు."

"సంతోషం నాగతిస్యా. అక్కడ మన అనుమ కొండలోగాని.. మన స్కంధావారంలో గాని ఏమి జరుగుతుందో నాకేమీ తెలియడం లేదు. కాస్త నువ్వయినా నాకు చెప్పవా?!"

దీనంగా చిన్నపిల్లాడిలా అడిగాడు గణపతి. నాగతిస్య కాస్త చలించాడు కానీ జాలిగా ముఖం పెట్టాడు.

"ష్.. నాకూ ఏమీ తెలియదు యువరాజా! నాలుగేళ్లుగా ఇక్కడే ఉన్నాను కాబట్టి విషయాలు నా వరకు వచ్చే అవకాశాలు తక్కువ. ఇక్కడి విషయాలు అక్కడికి చేరవేయడమే నాకు తెలిసిన విద్య. అక్కడివి నాకేమీ తెలియదు."

అతడి గొంతులో ధ్వనించిన నిజాయితీ గణపతిని తాకింది. 'పాపం.. అమాయకుడు..' అన్నట్లు సానుభూతితో చూశాడు.

మౌనంగా నిష్క్రమించాడు నాగతిస్య.

కానీ నాగతిస్య అమాయకుడు కాదని.. అమాయకంగా జీవించే అరివీర భయంకర కాకతీయ యోధుడని గణపతికి దగ్గరలోనే అనుభవమయింది.

మరునాడు నాగతిస్య గణపతి కారాగారానికి కాస్త ఈవలగా అక్కడక్కడే తచ్చాడుతున్నాడు. అప్పటికి ఇంకా తెలవారలేదు. ప్రత్యూషం తెలుస్తున్నా ఆ రాజప్రాసాదంలోని కారాగారం వరకు ప్రవేశించ లేదు. బాగా తెల్లవారితే నూనె పోసే పని విర మించాల్సి ఉంటుంది. అప్పుడు ఆ కారాగారం వద్దకు కాపలా భటులు వచ్చేస్తారు. నాగతిస్య వెళ్లిపోవాలి. అందుకనే గణపతికి ఏదో చెప్పడానికి పెనుగులాడు తున్నట్లు.. ఏదో విచికిత్సలో ఉన్నట్లు తెలుస్తోంది. అతని కదలికలు ఒకడుగు ముందుకు రెండడుగులు వెనక్కు పడుతున్నాయి.

కాగడాలలోకి నూనె తిత్తిని వంపుతూ తల తప్పి కారాగారం వంక చూస్తున్నాడు. ఇక ఆలస్యం చేయకూడదనుకున్నాడేమో చెంగున ఉడుతలా దూకి కారాగారం గుమ్మం తట్టి, "యువరాజా.." అన్నాడు గుసగుసగా.

ఆశ్చర్యంగా గణపతి జవాబుగా మూలిగాడు నిద్రలో ఉన్నట్లు. వెంటనే నాగతిస్య చటుక్కున కాస్త ఈవలికి వచ్చేశాడు.

గణపతి మెల్లగా శబ్దం రాకుండా ఓరగా తలుపు తీసి చూసి నాగతిస్యను గుర్తించాడు. నిద్రమత్తు వదలిపోయినట్లు చూసి అడుగులో అడుగు వేసుకుంటూ నాగతిస్య వైపుగా వచ్చాడు. ఆ వసారాలో గణపతి నడుస్తుండగా కాస్త వెనగ్గా నాగతిస్య అనుసరిస్తూ చెబుతున్నాడు.

"మీరు.. తమరు కాస్త నియంత్రణలో ఉండాలి. మన స్కంధావారం అక్కడ ఉన్నంతకాలం మీకు ఏ హానీ జరగదు. కాని మన జాగ్రత్తలో మనం ఉండాలి యువరాజా.."

చెళ్లున చరచినట్లయ్యింది. నిజమే కదా..

"నాకు ఒక్క ముచ్చట అర్థం కావడంలేదు. వీళ్లు మీకు ఇవ్వవలసినదాని కంటే ఎక్కువ స్వేచ్ఛ ఇస్తున్నారని నా అనుమానం. అది.. అది.. ఎందుకో నేను గుర్తించలేక పోతున్నా. వాళ్లు ఆ కుర్రాళ్లు.. చురుకు రక్తం. మీపై ఎంత మోజు చూపిస్తున్నారో.. కాలం వికటిస్తే రేపు అంత శత్రుత్వం చూపుతారు."

మరి వెనుకనుండి మాటలేదు. తలవంచుకుని వింటూ ముందుకుపోతున్న గణపతి ఓ క్షణం ఆగి వెనక్కు చూశాడు. ఎవ్వరూ లేరు. అడుగుల సవ్వడి కూడా వినరానంత చురుగ్గా మాయమౌతాడు నాగతిస్య.

నాగతిస్య చెప్పినవన్ని గణపతికి తెలిసినవే అయినా తెలియనిది ఒక్కటే..

ఎందుకు ఎక్కువ స్వేచ్ఛనిస్తున్నారు??

(సశేషం)

జాగృతి యాప్ వినియోగంపై విన్నపం

ఏడున్నర దశాబ్దాలకు పైబడిన సుదీర్ఘ ప్రస్థానంలో సాంస్కృతిక ఔన్నత్యం, రాజకీయాలు, సామాజిక అంశాలు, వర్తమాన సమస్యలు, కళలు, సాహిత్యం, విజ్ఞానశాస్త్రం, పర్యావరణం వంటి పలు అంశాలను చర్చించే విలువైన ఎన్నో వ్యాసాలను జాగృతి అందిస్తూ వస్తోంది. ఈ సంవత్సరం సంఘ శతాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్నాము.

ఈ సందర్భంగా పాఠకులకు మరింత చేరువయ్యేందుకు జాగృతి యాప్‌ని సిద్ధం చేశాం.

యాప్‌ని ఇన్‌స్టాల్ చేసుకోవడానికి పక్కనున్న QR Code స్కాన్ చేయగలరు.

APP Login -ఎడమవైపు Menu మీద క్లిక్ చేసి, Login ఎంపికపై క్లిక్‌చేస్తే Login Screen కనిపిస్తుంది.

1. తెరపై కనిపించే యూజర్ నెమ్, పాస్ వర్డ్‌తో లాగిన్ కావచ్చు.
2. Login Screen కింద **Click here to** login with Phone Number పైన క్లిక్ చేసి ఫోన్ నెం. నమోదు చేస్తే, మీ మొబైల్‌కి OTP వస్తుంది. OTPతో లాగిన్ అవ్వండి.
3. మొదటిసారి Login కాగానే, Password మార్పు చేసుకోమని సందేశంతో Screen వస్తుంది. మార్చుకొని, మరలా Login అవ్వాలి.
4. Dashboard: Profile information – User Id, Name, Profile status, Start, End Date, and Receipt Amount వివరాలు కనిపిస్తాయి.
5. Profile Management : View Profile–మీ వ్యక్తిగత చిరునామా, అమౌంట్ వివరాలు చెక్ చేసుకోండి. చిరునామా మార్పు కోసం పైన ఉన్న **JAGRITI** లోగోకి పక్కనే ఉన్న Edit Profileని క్లిక్ చేయండి. పోస్టల్ అడ్రసు ఇచ్చి, పిన్‌కోడ్ టైప్ చేస్తే రాష్ట్రం, జిల్లా వివరాలు వాటంతట అవే వస్తాయి. మండలం, సబ్ పోస్ట్ ఆఫీసు, సంఘ విభాగ్, జిల్లా, ఖండ/నగరాలను మీరు ఎంపిక చేస్తే సరిపోతుంది.
6. Support ticket: మీకు ఏదైనా సమస్య ఉంటే ఇందులో నమోదు చేయండి. 24 గంటలలో మీకు కాల్ చేస్తాము.
7. మిగితా వివరాలు Subscriber Login Videoలో చూడండి.

– మేనేజర్

ఆటుపోట్ల ఆయుర్వేదం

ఆయుర్వేదమంటే ఆనందభైరవి, శితాంకు రసం, చ్యవనప్రాశ, మకరధ్వజం మొదలయిన ఔషధాలూ, కొన్ని వ్యాధుల పేర్లూ; ఆవ, బచ్చలి, గుమ్మడి, వంటివాటిని తినరాదని చెప్పే పథ్యాలు– ఇంత మాత్రమేనన్న స్థూల స్వరూపజ్ఞానం (Superficial view) జన సామాన్యంలో ఉంది. ఇది సముద్రంలో కలిసే ఉప్పుటేరు స్వరూపాన్ని బట్టి అదే సముద్రమనుకొన్నట్లు ఆయుర్వేదం ప్రాదేశిక స్థూల స్వరూపం మాత్రమే. ఆయుర్వేదమంటే మానవుడికి సుఖాన్ని ఇచ్చే ఉపాయాలు, సాధనాలు చెప్పే శాస్త్ర విశేషం. ప్రతి మనిషి సుఖమే కోరతాడు. సుఖం కోసమే మానవులందరి తాపత్రయం. ఆధునిక శాస్త్రాలు (Modern Science) కూడా మానవుడి సుఖం కోసమే కృషి చేస్తున్నట్టు చెబుతాయి. కానీ అవి మానవుని సమగ్ర స్వరూపాన్ని (Man as a whole) తెలుసుకొన లేక, పాక్షికం (Partial) గానే తెలుసుకొంటున్నాయి.

మానవుడంటే చర్మం, రక్తమాంసాలు, ఎముకలు మొదలయినవి కూడిన శరీరం. ఇది యంత్రం వంటిది. ఈ యంత్రంలో ఆహారమనే బొగ్గు (లేక పెట్రోలు) నింపితే పని చేస్తుంది. ఈ యంత్ర భాగాలు ఆయా ధాతువుల (Tissues) చేత నిర్మితమైనవి. ఈ ధాతువులు చిన్న చిన్న కణముల (Cells) సముదాయాలు. ఈ కణాలు ఉదజని (Hydrogen) నత్రజని (Nitrogen) మొదలయిన మూల తత్వములతో నిర్మితమైనవి– ఇదీ అల్లోపతి అనే ఆధునిక వైద్యశాస్త్రం చేసే ప్రచారం. ఇంకా ఆయా సూక్ష్మజీవుల సంపర్కం వంటి కారణాలతో ఆయా వ్యాధులు వస్తున్నాయి. ఈ కారణాలను బట్టి తక్కిన ఔషధాలను, నివారణో పాయాలను కనిపెట్టడమే పనిగా సాగుతున్న ఆ ఆధునిక వైద్యశాస్త్రమే (Modern Medicine) మానవకోటికి సుఖానికి ఎప్పటికైనా దారి చూపు తుందని కూడా అల్లోపతి విశ్వసిస్తున్నది.

కానీ ఆధునిక వైద్యశాస్త్రానికి ఉన్న పునాదులలో కొన్ని పరిమితులు (Limitations) ఉన్నాయనీ, వాటిని ఆధారం చేసికొని ఇతర యంత్రాల (Machinery) లోతుపాతులు తెలుసుకొన్నట్టు మానవుడిని (Man) తెలుసుకోవడం అసాధ్యమని వైద్యశాస్త్రంలో 'నోబెల్' బహుమతి పొందిన ఎలెక్సిస్ కారెన్ (ఫ్రెంచి శాస్త్రజ్ఞుడు) తన గ్రంథంలో (Man the unkown) అంగీకరించాడు.

మానవుడిని సంపూర్ణంగా తెలుసుకోవడానికి మన పూర్వులు కూడా ఇబ్బంది పడ్డారు. అయితే వారిలో కొద్దిమంది భగవద్గీత, ఉపనిషత్తులు మొదలయిన వాటిలో చెప్పిన యోగసాధనను అనుష్ఠించి, ముందుగా తమ మనసులను స్వాధీనం చేసికొని (ఇదే యోగసిద్ధి) ఆ దృష్టితో మానవుల దుఃఖం, వారి వ్యాధులు, ఔషధాలు మొదలయిన నివారణోపాయాలు వంటి వాటిని తెలుసుకొని వ్యాఖ్యానించారు. ఆ తరువాత కాలంవారు కూడా ఆ సిద్ధాంతాలను విమర్శించి తిరిగి అనుష్ఠించి, ఆ మార్గాలను స్థిరపరిచి నూతనౌషధాలను జత చేస్తూ వచ్చారు. ఈ గ్రంథ సముదాయమే ఆయుర్వేదం. అయితే ఈ మార్గాలను, సత్యాలను చెప్పే పారిభాషిక

పదాలు (Terminology) ఆధునిక వైద్యశాస్త్రం ఉపయోగించిన పదాల కంటె భిన్నంగా ఉన్నాయి. ఆయుర్వేదంలోని పారిభాషిక పదాలు భగవద్గీత, ఉపనిషత్తులు, వాటి భాష్యాలు వంటి భారతీయ దర్శనాలు (Pholosophies)లోని పారిభాషిక పదాలు. అందుకే ఆ పదాలు కేవలం ఆధునిక శాస్త్రాలను (Modern Medicine) మాత్రం చదివినవారికి చప్పున అర్థం కావు.

మానవుడంటే సుఖదుఃఖాలను అనుభవించే జీవాత్మ. పంచ మహా భూతాలనే అత్యంత సూక్ష్ముములైన పరమాణువులతో నిర్మితమైన ధాతువుల (రక్తము మాంసము మొదలయినవి) కూడిక అయిన శరీరంతో ఉన్నాడు. వ్యాధి ఒక విధమైన దుఃఖం:. ఆయుర్వేదంలో చెప్పిన సాధనాలను విశ్వాసంతో ఆచరించి, వాటిని సరిగా అర్థం చేసుకుంటే ఆ తరువాత సుఖాన్వేషణకు ప్రయత్నించినపుడు సుఖమేకాని దుఃఖం రాదన్నదే ఆయుర్వేద తత్వం.

అందుకే భగవద్గీత చెప్పిన మూలసూత్రాలే ఆయుర్వేద మూలసూత్రాలై నాయి. భగవద్గీతలో క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగమనే పదమూడవ అధ్యాయం చూడండి! వ్యాధి వచ్చిన తరువాత నయం చేసుకునే కంటే వ్యాధి రాకుండా చూసుకోవడం మంచిది కాదా? అందు కోసం మానవుడు తన శరీరమనే యంత్రాన్ని (భూమిని) ధర్మమనే (Duties) సాధనాలతో సుఖం కోసం ఫలవంతంగా చేసుకోవాలి. ఇందుకోసమే మానవుడు ఆహార, విహారాలలో (Food and Other Habits) సరియైన పద్ధతులను అవలంబించాలి. వ్యాధి వచ్చిన తరువాత దానిని పోగొట్టుకోవడానికి కూడా ఇవే సాధనాలు. అయితే వ్యాధి వచ్చినపుడు ఔషధాలను అదనంగా వాడవలసివస్తుంది. ఈ విధంగా ఆయుర్వేదంలోని వాస్తవికతను వైద్యులేగాక సమస్త జనులు తెలుసుకోవాలి.

కాలం గడిచిఏ కొద్దీ వ్యాధుల (Dieseases) లక్షణాలు మారతాయి. వ్యాధి అంటే శరీరంలో కలిగే కార్య విశేష (Effect) రూపమైన ఒక మార్పు. ఈ కార్య విశేషం (Effect), కారణాలు (Causes) లేకుండా పుట్టదు. ఒకచోట మొక్క మొలచిందంటే, అక్కడ ఆ మొక్కకు సంబంధించిన గింజను ఎవరో (లేక పక్షులు లేక గాలి) పడేశారనే కదా! ఆ గింజ అక్కడి భూసారం, నీటి చెమ్మ మొదలయిన కారణా లన్నిటితో మొక్క అనే కార్యాన్ని ఉత్పత్తి చేసిందని

అర్థం చేసుకుంటాం. అదే విధంగా ఒకనికి వ్యాధి వచ్చిందంటే అతడు చేసిన ఆహార విహారాలలోని తప్పులు, లోటుపాట్లు కారణాలవుతాయి. ఈ లోట్ల చేతనే శరీరమనే యంత్రం (పొలం) పాడైన తరువాత సూక్ష్మజీవులు ((Bacteria) ఆ శరీరాన్ని ఎదిరించి వ్యాధిని కలుగ చేస్తున్నాయి. ఇక్కడ ఈ మానవుని వ్యాధికి అతడు చేసిన తప్పులు, లోట్లు, సూక్ష్మజీవులు కూడా కారణాలవుతున్నాయి. ఈ సూక్ష్మజీవులను నశింపజేసే ప్రయత్నాల కంటే శరీరమనే క్షేత్రాన్ని సరి చేసుకొనే ఉపాయాలే ఆయుర్వేదం ప్రధానంగా బోధిస్తుంది. శరీరమనే క్షేత్రం చక్కగా ఉన్నప్పుడు ఏ సూక్ష్మజీవీ ఏవీ చేయజాలదు. ఏ వ్యాధీ రాదు. ఈ వ్యాధులను శరీర పరిస్థితిని తెలిసికొనే విజ్ఞానమంతా ఆయుర్వేదంలో త్రిదోష విజ్ఞానం మీద ఆధారపడి ఉంది. సరియైన ఆయుర్వేదశాస్త్ర వృద్ధికి, అది ఇచ్చే మానవ సుఖానికి మార్గం, సూక్ష్మబుద్ధులైన వారు ఆయుర్వేద విజ్ఞానాన్ని సరిగా బోధపరుచుకొనడమే. కాని కేవలం ఆధునికశాస్త్రాలు పఠించిన జాతికి ఈ శాస్త్రంలోని పారిభాషిక పదాలలో గూఢమై ఉండే సత్యం తెలియచెప్పేందుకు జాగ్రత్తగా వివరించే నూతన గ్రంథాలు రాయవలసి ఉంటుంది. ఇందుకు విద్వాంసులు కృషి చేయాలి.

పైన పేర్కొన్నట్టు కాలం గడిచే కొద్దీ వ్యాధుల స్వరూపాలు మారుతుంటాయి. వాటికి తగిన నూతన ఔషధాలను, వ్యాధి విజ్ఞాన పద్ధతులను, నివారణోపాయాలను చేర్చుకోవడం అవసరం. అయితే ఈ పద్ధతులు ఆయుర్వేద మూలసూత్రాలకు భిన్నంగా కాకుండా అనుగుణంగా ఉండేటట్లు చేర్చాలి. ఈ పని చేసేందుకు ఆయుర్వేదం క్షుణ్ణంగా తెలిసినవారికే గాని ఇతరులకు అధికారంలేదు. ఆయుర్వేదంలో పరిశోధన (Research) కూడా ఈ మార్గాల మీదనే జరగాలి. పరిశోధకులు (Research Workers) ముందుగా ఆయుర్వేదం చదివి బాగా అవగాహన చేసికొని ఆ తరువాత ఆ పునాదుల మీద పాశ్చాత్య వైద్య విజ్ఞానంలోని ఉపయుక్తాంశా లను ప్రతిష్ఠించుకోవాలి. ఇది మిక్కిలి సూక్ష్మబుద్ధులైన వారు ఓపికతో కొనసాగించవలసిన కృషి.

ఇటు జనసామాన్యానికి కావలసిన సులభ చికిత్సలు, ఔషధాలు, వ్యాధుల విజ్ఞానం, నివారణోపాయాలు, ఔషధ తయారీ కోసం సరియైన మూలికలు మొదలయిన వానిని అందించే సంస్థలను నెలకొల్పవలసి ఉంది. ఇందులో స్వార్థరహితులు, సత్యాన్వేషణపరులు అయిన పరిశోధకులు పనిచేయవలసి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి దానిని ప్రోత్సహించి, ఒక ఉత్తమ పరిశోధన సంస్థను వెంటనే స్థాపించాలి.

– ఆయుర్వేదాచార్య
తేజోమూర్తుల గురునాథం
– జాగృతి, 30.12.1955



చరకుడుని వైద్యశాస్త్ర పితగా చెప్పుకుంటాం. క్రీస్తుపూర్వం 1 లేదా 2వ శతాబ్దానికి చెందినవారని చరిత్రకారులు చెబుతారు. ఆయన రాసినదే 'చరక సంహిత'. మనదేశానికి మరో ఎనిమిదేళ్లలో స్వరాజ్యం సిద్ధిస్తుందనగా1939లో ఈ మహా సంస్కృత గ్రంథాన్ని నుదురుపాటి విశ్వనాథశాస్త్రి 'చరక సంహిత-చికిత్సాస్థానము' పేరుతో తెలుగులోకి అనువదించారు. వావిళ్ల వారు ప్రచురించారు. 1480కి పైగా పేజీల ఈ పుస్తకంలో రచయిత ఉపోద్ఘాతంలో చరాచరాత్మక మైన సకలప్రపంచమునకు సృష్టికర్త, ఆది దేవుడు బ్రహ్మలో లీనమైన ఉన్న ఆయుర్వేదం చరకుడి వరకు చేరిన వైనాన్ని శ్లోకాలతో, శ్లోకాలకు చక్కని వ్యాఖ్యానంతో వివరించాడు. ఇందులో మొదటి అధ్యాయం అభయామలకీముతో ఆరంభమైతే యోనివ్యాపచ్ఛికి త్రితమైన 30వ అధ్యాయంతో ఈ గ్రంథం సంపూర్ణమవుతుంది. పుస్తకంలో మొదటి 13 అధ్యాయాలను చరకుడు రాసినవి. మిగిలిన 17 అధ్యాయాలు దృఢబలుడు రచించినవి. చరక సంహిత పురాతన భారతీయ వైద్య విధానం ఆయుర్వేదానికి పునాది అయిన గ్రంథాలలో ఒకటి. చరక మహర్షి చరక సంహిత రాశారు. ఈ గ్రంథం 120 అధ్యాయాలతో ఎనిమిది విభాగాలుగా విభజించారు. ఇది సమగ్ర ఆరోగ్యం, నివారణ సంరక్షణ, మూడు దోషాలైన వాత, పిత్త, కఫ సమతుల్యతను నొక్కి చెబుతుంది.సాక్షాత్తూ ఆదిశేషుడే చరకుడిగా అవతరించాడు. ఆత్రేయ ముని శిష్యుడు రచించిన తంత్రమును సంస్కరించాడు. చరక సంహితను రచించాడు.

ఆయుర్వేద సర్వస్వం

పంచనదపుర వాస్తవ్యుడు కపిలబలుడి కుమారుడు దృఢబలుడు ఆయుర్వేద విద్యాకోవిదుడు.

"చికిత్సావహ్ని వేశస్య సుస్థాతురహితం ప్రతి,
యదిహాస్తి తదన్యత్ర యన్నే హాస్తి న తత్ క్వచిత్."

ఈ చరకతంత్రము తక్కిన ఆయుర్వేద తంత్రముల కన్నింటికీ ఆదర్శమైనదని, ఆయుర్వేదానికి సంబంధించిన విషయాలన్నీ దీనిలోనే ఇమిడి ఉన్నాయని, పైన పేర్కొన్న శ్లోక రూపంలో దృఢబలుడు కొనియాడాడు అని రచయిత ఉటంకించాడు.

వీరిద్దరూ సంస్కృతంలో రాసిన దానికి తాను వ్యాఖ్యానం మాత్రమే చేశానని పుస్తకం ఉపోద్ఘాతంలో రచయిత వినమ్రంగా చెప్పుకోవడం ఆయుర్వేదం పట్ల, రచించిన మహర్షుల పట్ల వారికి ఉన్న భక్తి,ప్రపత్తులకు నిదర్శనం. రచయిత వాజీకరణ ఔషధం గురించి వ్యాఖ్యానించాడు. దశాబ్దాల క్రితమే సంతానం ప్రాముఖ్యతను వివరించాడు. ఆయుర్వేద వైద్యుడు రోగులనందరినీ సమదృష్టితో, తన బిడ్డల్లాగా చూసుకోవాలని, వారికి సంభవించిన బాధల నుంచి కాపాడాలని సూచించాడు. సంస్కృతంలో, శ్లోకరూపంలో ఉన్న ఔషధాలు, రసాయనాల తయారీలో వినియోగించాల్సిన పదార్థాలు, మూలికలను, తయారీ పద్ధతులను వ్యాఖ్యానరూపంలో అందించాడు. ఒకానొక సందర్భంలో స్వచ్ఛమైన, దోషరహితమైన పెరుగుపైన ఉండే మీగడను శరత్కాల చంద్రుడితో పోల్చాడు. విశిష్టమైన ఆవు పాల సేవనంలో మూడు యోగాలను విడమరిచి చెప్పాడు.అందులో మొదటిది పచ్చి పాలను ఉపయోగించడం, రెండవది ఆ పాలనే కాచి ఉపయోగించడం, మూడవది పాలలో తేనెను, నేతిని కలిపి ఉపయోగించడం. వీటిని క్షీరయోగములు అని సూత్రీకరించాడు. జ్వరం వచ్చినప్పుడు లంకణం చేస్తే మంచిది అని చెబుతాడు. దానివల్ల జఠరాగ్ని రగులుకుంటుంది. జ్వరము తగ్గుతుంది. ఆకలి పుడుతుంది అని సూచిస్తాడు. ఔషధాలు, రసాయనాల తయారీలో వైడూర్యపు మణి, మంచి ముత్యాలు, నల్లని ఇసుక, బంగారం వినియోగాన్ని ప్రస్తావిస్తాడు. ఆఖరిదైన 30వ అధ్యాయం చివర్లో కన్నులు లేని చిత్రకారుడు చిత్రపటమును ఎలాగైతే రచించలేడో అదే తీరుగా ఈ శాస్త్రమును, దీనిలోని వాస్తవిక అర్థాన్ని చక్కగా అవగతం చేసుకోలేని వైద్యుడు చికిత్స చేయడానికి అర్హుడు కాడు అని స్పష్టం చేశాడు. ★

ఆయుర్వేద

ఆయుర్వేదమే తాను, తానే ఆయుర్వేదంగా మొక్కవోని దీక్షతో కృషి చేసి యావద్భారతంలో ఆయుర్వేద వ్యాప్తికి, దీప్తికి పాటుబడి, ఆయుర్వేద ప్రశస్తిని పాశ్చాత్యుల చేత కూడా ప్రస్తుతింపజేసిన మహోన్నతుడు డాక్టర్ దివి గోపాలాచార్యులు. స్వయంకృషితో సర్వతోముఖ ప్రతిభనార్జించిన మనీషి. ఆయుర్వేద వైద్యాన్ని అపహాస్యం జేసి అలక్ష్యంతో చూసే పర పాలకుల మౌఢ్యాన్ని తన ఉపన్యాసాల ద్వారా, గ్రంథ రచనతో, తన చికిత్సా కౌశలంతో నేలరాసి, ఆయుర్వేదం సర్వ వైద్య విధానాల మాతృక అని నిరూపించారు. 1913లో బ్రిటిష్ ప్రభుత్వం వీరికి 'వైద్యరత్న' బిరుదును గవర్నరు జనరల్ ద్వారా ఇచ్చింది. బ్రిటిష్ ప్రభుత్వం నుంచి 'వైద్యరత్న' బిరుదు పొందిన తొలి భారతీయ వైద్యుడు గోపాలాచార్యులు. ఆచార్యుల వారి 'ప్లేగు' వ్యాధి చికిత్సా నైపుణ్యాన్ని ప్రశంసించి గద్వాల మహారాణి బంగారు పతకం బహూకరించారు.

20దరులో విఖ్యాత వైద్య కుటుంబంలో గోపాలాచార్యులు 22.10.1872న జన్మించారు. మూడు శతాబ్దాల నుండి వారిది ఆయుర్వేద వైద్య కుటుంబమే. తండ్రి రామకృష్ణమాచార్యులు విఖ్యాత వైద్యులు. వైఖానస పండితుడు. తల్లి రాజ్యలక్ష్మి సదాచార సంపన్న. పదమూడేండ్ల వరకు ఆచార్యులు తండ్రి చెంతనే ఆంధ్ర గీర్వాణ భాషలలో పాండిత్యాన్ని, ఆయుర్వేదంలో ప్రజ్ఞను ఆర్జించారు. తాత్త్వికుల నుండి ఆగమశాస్త్రం అభ్యసించారు. ఆయుర్వేద విజ్ఞానాన్ని కరతలామలకం చేయదలచి, ఒకరోజున ఎవరికీ చెప్పకుండానే ఇల్లు వీడి బయలు దేరారు. ఏడుకొండలవాడి సాన్నిధ్యాన్ని చేరుకుని, మహంతు పాఠశాలలో శాస్త్రాధ్యయనం చేసి పాండిత్యం గడించారు. తండ్రి రామకృష్ణమాచార్యులు తిరిగి కుమారుడిని బందరు తీసుకువచ్చారు. కానీ వారి దృష్టి మరింతగా ఆయుర్వేదంలో ప్రావీణ్యత వైపు మళ్లింది. అందుకే మరోసారి ఇల్లు విడిచి కాలినడకనే హైద్రాబాదు చేరారు. తండ్రి మరోసారి గోపాలాచార్యుని బందరు తీసుకువచ్చి, ఎంతగానో హితోపదేశం చేశారు.

కానీ గోపాలాచార్యుని ధ్యేయం యావద్భారతంలోని వివిధ రీతుల విజ్ఞానం సముపార్జించి ఆయుర్వేద ప్రాశస్త్యాన్ని బహుముఖంగా ప్రస్ఫుటం చేయాలనే. మరోసారి గృహాన్ని వీడినారు. బొంబాయి, పూనే, అహమ్మదాబాద్, నాగపూర్, మున్నగు చోట్లను దర్శించారు. కడకు మైసూరు చేరి మహారాజా ఆయుర్వేద పాఠశాలలో చేరారు. ఆ పాఠశాల ప్రధానాచార్యులు అగరం పుట్టస్వామి అభిమానాన్ని చూరగొన్నారు. ఆయుర్వేద శాస్త్ర రహస్యములన్నింటిని అవగతం చేసుకొని, చికిత్సా కౌశలం సముపార్జించి బందరు తిరిగి చేరారు. వివాహం చేసుకొన్నారు. భార్య రమణమ్మ. ఇరువురూ అన్యోన్యంగా కొంతకాలం గడిపినారు. గోపాలాచార్యులు గారికి ఒక కుమార్తె, కుమారుడు. కానీ ఆచార్యుల గృహజీవితం సాఫీగా సాగలేదు. మొదటిసారి భార్య నిండు చూలాలుగా ఉన్నపుడు ఆచార్యులుగారికి ఒక కుదురుయేర్పడినది. చివరికి నా అన్నవారు ఎవరూ మిగలలేదు.

ఆచార్యులు మరోసారి మైసూరు చేరారు. తన 21వ యేట ఆయుర్వేదాధ్యయనం పూర్తి చేసుకొని పట్టభద్రులైనారు. దేశంలోని వివిధ ప్రాంతాలలోని విభిన్న చికిత్సా ప్రక్రియలను, సంప్రదాయాలను అవగాహన చేసుకొన్నప్పటికి తృప్తి కలిగినట్లు లేదు. విశాల భారత పర్యటనకు పూనుకొనినారు. కలకత్తా, కాశీ, బొంబాయి, కాశ్మీరు, హరిద్వారం, లాహోరు, నాసిక్‌లు దర్శించారు.

23వ ఏట ఆచార్యులు బెంగుళూరులో దివ్యజ్ఞాన సమాజ ఆధ్వర్యంలోని వైద్యశాల వైద్యులుగా చేరడం వల్ల వారి దేశ సంచారం జరిగింది. వారి చికిత్సా నైపుణ్యం, ఇతరుల పట్ల చూపే అనురక్తి, సౌమ్యత, కొద్దికాలంలోనే ఖ్యాతిని తెచ్చాయి. ఎందోరో ఆయన సలహాలకై వేచి ఉండెడివారు.

ఇంతలో మహామ్మారిలా బెంగుళూరులో ప్లేగు వ్యాధి పెచ్చరిల్లింది. వేలాది జనం మృత్యువాత పడినారు. ఏ చికిత్స వ్యాధిని నివారించలేదు. ఈ దుస్థితి గోపాలాచార్యుల హృదయాన్ని కలచివేసింది. శాస్త్రాన్ని అధ్యయనం చేయించింది. చరక, సుశ్రుత, వాగ్భటాలను తరచినారు. 'నిసర్పి' వ్యాధే 'ప్లేగు' వ్యాధిగా ఆచార్యులు గుర్తించారు.'హోమాది పానకం' 'శతధౌత ఘృతం' ఈ రెండు ఔషధల్ని చరకము ననుసరించి తయారుచేసి రోగులకు వాడినారు. మహమ్మారి చికిత్సా నైపుణికి మైసూరు రాజ్యం నివాళులెత్తింది. భారతవర్షమే విస్తుపోయింది. బొంబాయి రాష్ట్రంలో ప్లేగువ్యాధి ప్రబలినపుడు కూడా ఆచార్యులుగారి ఔషధాలే శరణ్యమైనాయి.వీరి కీర్తి ప్రతిష్ఠలు మద్రాసు పెద్దలకు తెలిశాయి. ఎన్. సుబ్రహ్మణ్య అయ్యర్, వి.కృష్ణస్వామి అయ్యర్, పి.వి.కృష్ణస్వామి చెట్టి గోపాచార్యుని చెన్నపురికి ఆహ్వానించారు. గోపాలాచార్యులు కన్యకాపరమేశ్వరీ దేవస్థానం ఉచిత ఆయుర్వేద చికిత్సశాల ప్రధాన చికిత్సకులుగా నియమితులైనారు. అప్పటికి ఆచార్యులుగారి వయసు 24 సంవత్సరాలు.

వారికంతటితో తనివి తీరలేదు. చౌకధరలకు ఆయుర్వేదౌషములను తయారుచేయదలచినారు. 1898న ఆయుర్వేదాశ్రమం నెలకొల్పారు. ఆయుర్వేదౌషధాల ప్రామాణికత, నిర్మాణ పద్ధతుల నిర్ధారణ చేసే మద్రాసు ఆయుర్వేద లేబరేటరీని నెలకొల్పి అనేకమంది వైద్య విద్వాంసులను పరిశోధనల కోసం నియమించారు.

ఆయుర్వేదంతో సుశిక్షితులైన వైద్యులను తయారు చేయడానికి మద్రాసు కళాశాలను కన్యకాపరమేశ్వరి దేవస్థానం వారు స్థాపించారు. ఇందులో సంస్కృతంలో 'ఆయుర్వేద భూషణ' శాఖ; 'భిషగ్వర' అను తెలుగు శాఖ ఏర్పాటు చేశారు. గోపాలాచార్యులు ప్రధానాచార్యుడు. బొంబాయి, గుజరాత్, యు.పి., పంజాబ్ సింహళం, ఆంధ్ర, తమిళ, కన్నడ, మళయాళ ప్రాంతాలవారు ఈ కళాశాలలో విరివిగా చేరారు. ఆనాడు గోపాలాచార్యుల దగ్గర అధ్యయనం చేసినవారే అఖిల భారతంలో విద్వద్వైద్యులుగా ప్రఖ్యాతిగాంచారు.

తీరా నాలుగేళ్లకే ఈ కళాశాల నిర్వహణను కన్యకాపరమేశ్వరీ దేవస్థానం విడనాడదలించింది. దీనితో ఆచార్యులే ఆ కళాశాల నిర్వహణ బాధ్యత స్వీకరించారు. అందుకు 'చెన్నపురి ఆయుర్వేద

పునరుజ్జీవనదాత

డాక్టర్ దివి గోపాలాచార్యులు

ప్రచారిణి సభ'ను పెద్దల సహకారంతో స్థాపించారు. ఈ కళాశాలను జీవించి ఉన్నంతవరకు నడిపారు. ఈ కళాశాలలో మొదట సంస్కృతంలో తదుపరి తెలుగు, తమిళాలలో విద్యాబోధన జరిగింది. ఈ కళాశాలకు అను బంధంగా ఉచిత వైద్యశాలను స్థాపించారు. రోజూ మూడు నుండి నాలుగువందల వరకు రోగులు వచ్చేవారు. ఒక ఆయుర్వేదౌషధాలయం (Ayurvedic Hospital) ఈ కళాశాలకు అనుబంధంగా నిర్వహించాలన్న తలంపు కలిగినది. పెద్ద ఆయుర్వేద ఆసుపత్రిని వార్డులతో ఏర్పాటు చేశారు. ఈ కళాశాలకు అనుబంధంగా పుస్తక భాండాగారాన్ని నెలకొల్పారు. ముద్రితా ముద్రిత గ్రంథాలనెన్నిటినో సేకరించారు. అనేక తాళపత్ర గ్రంథాల్ని సమకూర్చి నారు. ఆయుర్వేదాశ్రమ గ్రంథమాల అనే సంస్థను స్థాపించి అనేక గ్రంథాలు ముద్రించారు. వాటి ముద్రణకు ఆయుర్వేద ముద్రాక్షరకాలను స్థాపించారు. గోపాలాచార్యులుకు 1907లో నాసిక్‌లో శ్రీ నయాజీ ఆయుర్వేద విద్యాపీఠం 'ఆయుర్వేద మార్తాండ'అన్న బిరుదును, కలకత్తా ఆయుర్వేద సమ్మేళనంలో 'భిషఙ్మణి' బిరుదు ప్రదానం చేశారు. ఆచార్యులుగారు 11.7.1919న 'శ్రీ ధన్వంతరి' పేరుతో ఒక మాసపత్రికను స్థాపించి వారున్నంత వరకు క్రమం తప్పకుండా వెలువరించినారు.

సామాజిక మద్దతు లేకుంటే ఏ పనీ సాధించ లేమని తొలిగా ఆలోచించిన మనీషి ఆచార్యులు. యావదాంధ్రాయుర్వేద వైద్యులను ఒక త్రాటిపై సంఘటితవర్చిన ఘనత కూడా ఆచార్యులుదే. 1917 నవంబరులో బెజవాడలో వారు స్థాపించిన ఆయుర్వేద మహామండలి తరువాత ఆంధ్రప్రదేశ్ ఆయుర్వేద మహామండలిగా రూపొందింది.

అఖిల భారత ఆయుర్వేద మహామండలికి అధ్యక్షులుగా ఎన్నికైన తొలి ఆంధ్రుడు ఆచార్యులు గారే. 1913 ఏప్రిల్‌లో బొంబాయిలో జరిగిన సభకు వారధ్యక్షత వహించారు. నిఖిల భారతాయుర్వేద మహామండలి అనుబంధ సంస్థ నిఖిల భారతా యుర్వేద విద్యాపీఠం (పరీక్షా నిర్వహణ విభాగానికి ఎన్నో ఏళ్లు అధ్యక్షులుగా ఉండి ఆయుర్వేదాచార్య, ఆయుర్వేద విశారద, భిషక్, పరీక్షలను పటిష్టంగా నడిపారు. ఆ పరీక్షలకు కావలసిన పాఠ్య ప్రణాళికను రచించారు. మైసూరు ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల పరీక్షల పరీక్షాధికారిగాను ఢిల్లీ ఆయుర్వేద, యునానీ, తిరుచ్చి కాలేజీ పరీక్షాధికారి గాను, పరీక్షోప సంఘ సభ్యునిగాను, అలహాబాదులోని అఖిల భారత ఆయుర్వేద బోర్డు అధ్యక్షులుగానూ, లాహోరు డి.వి.ఏ. కాలేజీ పరీక్షాధి కారిగానూ ఆచార్యులుగారు ఎన్నిక య్యారు. అనేక సంవత్సరాలు ఆ పదవులలో ఉన్నారు. మలబార్‌లో జరిగిన ఆయుర్వేద కాంగ్రెస్ అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. పూనాలో జరిగిన (25.2.1917) అఖిల భారత ఆయుర్వేద అష్టమ మహా సమ్మేళనానికి అనుబంధంగా ఏర్పా టయిన ఆయుర్వేద మహావస్తు ప్రదర్శనకు అధ్యక్షులుగాను పని చేశారు. 1904లో కొల్లంగోడులో జరిగిన ఆయుర్వేద మహామండలికి ఆయనే అధ్యక్షులు. 1918 లాహోరులో జరిగిన 9వ మహాసభకు వారినే ఆహ్వానించారు. శ్రీ గోపాలా చార్యులుగారు వెలువరించిన గ్రంథాలు 22. వానిలో కొన్ని: మాధవ నిదానము, ఆర్కకాశము, రసప్రదీపక, పథ్యాపథ్యము, ఆయుర్వేద పరిభాష, భేషజకల్పము, దక్షిణభారతము, ఆయుర్వేద ప్రచారము, అధ్యక్ష అభిభాషణములు, హిందూ విశ్వవిద్యాలయము, వైద్యాభివృద్ధి, ఆయుర్వేద ప్రశస్తి (ఆంగ్లము), ఆంధ్రదేశము-వైద్య సహాయము, ఆయుర్వేద చరిత్రము, వస్తికర్మము, అగస్త్యవైద్యము, ఆయుర్వేదాంగ శల్య తంత్రము, ప్రదర్శకాభిభాషణము, విషూచి, ఋషికుల బ్రహ్మచర్యాశ్రమము, చలిజ్వరము, మదుమేహము, రాజయక్ష్మ. వారి అముద్రితాలు మరో 18 ఉన్నాయి. మూడు నాల్గు మినహా అవి యింత వరకూ వెలుగు జూడలేదు. ఇవిగాక అగస్త్య సాంప్రదాయమునకు చెందిన నూట యాభై గ్రంథాలు వారు సేకరించారు. వాటి జాడ తెలియడం లేదు.

డా॥కింగ్, భారతదేశ వైద్యశాఖాధికారి సర్ పౌర్డే లూకిస్, ఫిలడెల్ఫియా వాస్తవ్యులు డా॥ జార్జి క్లార్కు, కల్నల్ కెఆర్. కీర్తికర్, మున్నగు వైద్య ప్రముఖులు, వైస్‌రాయ్ లార్డు హార్డింజ్, మద్రాసు గవర్నరు లార్డు పెట్లండు లాంటి పాశ్చాత్య పాలకులు ఎంతగానో శ్లాఘించినారు.

గోపాలాచార్యులు ఆయుర్వేద వైద్యోద్యోమంలో తలమునకలుగా ఉన్నా తక్కిన రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక విషయాల పట్ల కూడా శ్రద్ధ కలిగి ఉండేవారు. బాలగంగాధర తిలక్‌తో ఆత్మీయత ఉండేది. కాంగ్రెస్ అధ్యక్షులు ఎన్. శ్రీనివాసయ్యంగార్, సర్ సి.పి. రామస్వామయ్యర్, కాశీనాథుని నాగేశ్వర రావు పంతులు, కొచ్చిన్ మహారాజా, తిరువాన్మూర్ మహారాజా, దర్భాంగా మహారాజా, సర్ పి.టి.త్యాగ రాజశెట్టి, రాజా నాయని వెంకటరంగా రావు డా॥ టి.యస్., యస్.రాజన్ వంటి ప్రముఖులెందరితో ఆచార్యులుగారు కలసిమెలసి పని చేసేవారు. మద్రాసు గోఖలే హాల్లో జరిగే సభలలో ఉపన్యసించేవారు. స్వదేశీ ఉద్యమాన్ని గాఢంగా బలపరుస్తూ దేశీయ మహాసభల్లో ప్రసంగించారు.

వారు ఆజానుబాహువు. నిండైన శరీరం. తెల్లని నామాల మధ్య ఎర్రని కుంకుమ నిలువు బొట్టు. తొమ్మిది మూళ్ల ధోవతి పంచకట్టు, నిలుపుకోటు, దాని నుండి వ్రేలాడే బంగారు పతకాలు, నిండైన తలపాగా, చిరునవ్వు తొణికిసలాడే గుండ్రని ముఖం. ఎంత దూరం నుండి చూచినా -వారే ఆచార్యులు గారని అంతా గుర్తించేవారు. చూడగానే ఒక పూజ్యభావం జనించేది.

అందరి గౌరవాన్ని, పూజ్యభావాన్ని చూరగొన్న ఆ రూపం-రౌద్రి సంవత్సర భాద్రపద బహుళ బుధవారం-(ది 29.9.1920) ఈ లోకం వీడింది. ఆయుర్వేద జగత్తుకు అశనిపాతం, భారతీయ సంస్కృతికి పెద్ద లోటు మిగిల్చింది.

– డాక్టర్ ప్రకాశచంద్ర శతపథి

(శతజయంతి సంస్మరణ/ జాగృతి, 2.6.1974, కొన్ని భాగాలు)



ఆయుర్వేదో ధనుర్వేదో గాంధర్వశ్చేతి త్రేతయుః/అర్ధశాస్త్రం చతుర్థంతు విద్యా వ్యాష్టాదశస్మృతాః

మన దేశంలో 1938లో స్మరణీయ సంఘటన జరిగింది. అది 'జాతీయ ఆరోగ్యయాత్ర'. 'గ్రామీణ అభ్యున్నతి' కోసం 100 మంది వైద్యులు కాలినడకన చేసిన అపురూప యాత్ర ఇది. గాంధీజీ ప్రేరణతో డాక్టర్ ఆచంట లక్ష్మీపతి తన 58వ ఏట ప్రారంభించిన యాత్ర. ఆరోగ్య పరిరక్షణ కోసం గ్రామాలలో సాధారణ సూత్రాలు బోధిస్తూ, ఆహారం, వ్యాయామం, మూలికా తోటల ప్రాముఖ్యత, యోగాసనాల ద్వారా వ్యాయామం, పంచకర్మల ద్వారా (నూనె మసాజ్) ఆరోగ్యాన్ని కాపాడుకోవడం, ఆరోగ్యకరమైన వంటకాలు, వినియోగంపై మార్గదర్శకాలను పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించడం ఆ యాత్ర ఉద్దేశం.

వైద్యులు స్వచ్ఛంద సేవకులకు ఆయా అంశాల మీద శిక్షణ ఇచ్చి ప్రజల్లోకి తీసుకువెళ్లేటట్టు చేశారు. పంచశుద్ధి ప్రణాళికను పాటించడం దేహ (శరీరం) ఆహార (ఆహారం) దేశ (పర్యావరణం) మనః (మనసు) ఆశుచి (అపరిశుభ్రత)లను జాగ్రత్తగా కాపాడుకోవడమే ఆ శిక్షణ. 1939లో గాంధీజీ ఆహ్వానంపై సేవాగ్రాంకు వెళ్లారు లక్ష్మీపతి. బొమ్మల ద్వారా ఆరోగ్య ప్రదర్శన, ఆరోగ్యం గురించి గేయాలు, కాపీ, టీలకు బదులు పాలు త్రాగటం వంటి వాటిని ప్రోత్సహించారు. వేర్లు, ఆకులు, దుంపలను మెడికల్ విద్యార్థులకు సిలబస్‌లో చేర్పించారు. లక్ష్మీపతి కన్యాకుమారి నుండి పెషావర్ వరకు అనేకసార్లు ఆరోగ్య యాత్రను నిర్వహించారు. నాటి భారత రాష్ట్రపతి బాబూరాజేంద్ర ప్రసాద్, ఉత్తరప్రదేశ్ గవర్నర్ వి.వి.గిరి, మద్దతు నిచ్చారు. 'శ్రీ లక్ష్మీపతి కృషి వలననే ఆయుర్వేద శాస్త్రమునకు ఇదివరకెన్నడూలేని ఔన్నత్యము కలిగి, ప్రజలకు నికరమైన ఆయుర్వేద ఔషధములు లభించే అవకాశము కలిగినది. జనులను ఎక్కువగా పీడించే రుగ్మతలకు అతిసులభమైన వైద్యమును శ్రీలక్ష్మీపతి చేసి చూపించగలిగినారు.' భిషగ్రత్న డాక్టర్ ఆచంట లక్ష్మీపతి స్వీయ చరిత్రకు (యాన్ ఆటోబయోగ్రఫీ) వీవీ గిరి రాసిన ముందుమాటలో ఈ వాక్యాలు కనిపిస్తాయి. నిజంగానే ఆయుర్వేద ప్రాచుర్యానికి డాక్టర్ లక్ష్మీపతి చేసిన సేవ చరిత్రాత్మకమైనది. వైద్యరంగంలో భారతీయ వారసత్వాన్ని నిలపడానికి జరిగిన కృషి అది.

ఆయుర్వేదం అష్టాదశ విద్యలలో ఒకటి. అతి ప్రాచీనమైనది. అశ్వనీ దేవతలు దేశ వైద్యులని, ఇంద్రాదులకు చికిత్సలు చేశారనీ పురాణాలు చెబుతున్నాయి. చంద్రుడికి ఓషధీశుడని పేరు. వెన్నెల చేత అనేకములైన ఓషధులు వికసించి ప్రజోపయోగ మవుతున్నాయి. సంజీవని అనే ఓషధిని తెచ్చి మూర్ఛితులైన వానరులకు హనుమ ప్రాణదానం చేశాడు. ఈనాడు కూడా ఆకు పసరుతో విరిగిన ఎముకలను సరిచేసి మహోపకారం చేయడం జగద్విదితమే. ఎందరో రససిద్ధులు ఈ శాస్త్రాభివృద్ధికి కృషి చేశారు. ఆదిముడు, చంద్రసేనుడు, లంకేస్తుడు, విశారదుడు, కపాలి, మత్తుడు మాండవ్యుడు, భాస్కరుడు, శూరసేనుడు, రత్న ఘోషుడు, శంభువు, సాత్వికుడు, నరవాహనుడు, ఇంద్రదుడు, గోముఖుడు, కలంబి, వ్యాడి, నాగార్జునుడు, సురానంద, నాగబోధి, యశోధనుడు, ఖండుడు, కాపాలికుడు, బ్రహ్మ, గోవిందుడు, లంపకుడు, హరి వంటివారు వారిలో ముఖ్యులు.

'యాన్ ఆటోబయోగ్రఫీ'కి వి.వి. గిరి రాసిన ప్రవేశికలో పైన చెప్పిన మాటలతో పాటు ఇంకా, 'మన దేశంలో వైద్య వృత్తిని అవలంబింప కోరేవారు దేశంలో వైద్యశాస్త్రం ఏ రీతిని ఉన్నత స్థితిలోనున్నది అనే విషయాన్ని, వైద్యశాస్త్ర చరిత్రను బాగుగా తెలిసికొనుట అత్యవసరము. కొందరు ఆధునిక వైద్యవేత్తల మనస్సులలో దేశీయవైద్య పద్ధతుల యెడలగల కొన్ని అపోహలు పోగొట్టుటకు మార్గము వారీ శాస్త్రమును గూర్చి మిక్కిలి శ్రద్ధతో తెలిసి కొనుటయే. మనదేశంలో లక్షలాది జనులకు తగిన వైద్య సౌకర్యము చేకూర్చుటకు వైద్యశాస్త్ర నిపుణులు పాశ్చాత్య వైద్య పద్ధతులను మన ప్రాచీన పద్ధతులనూ సమన్వయ పరిచి ప్రజలకు అనుకూల మైన విధానములను అమలు పరుచుట అత్యవసరము. ఇటువంటి సమన్వయము సిద్ధించుటకు శ్రీ ఆచంట లక్ష్మీపతి స్వీయచరిత్ర మిక్కిలి ఉపయోగపడగలదని నా విశ్వాసము' అన్నారు. లక్ష్మీపతి అనుభవాలు గొప్పవే. 3.3.1880 నుంచి దాదాపు 4.6.1960 వరకు నాటి పరిస్థితులు ఇందులో ఉన్నాయి.

1903-04 నాటికి ఎమ్.బి.బి.ఎస్.ను ఎల్.ఎమ్.డబ్ల్యు.యస్. (లైసెన్సియేట్ ఆఫ్ మెడిసిన్ అండ్ సర్జరీ, యమ్.బి. అండ్ సి.యమ్. అనగా బాచిలర్ ఆఫ్ మెడిసిన్, సి.యమ్. అనగా చిరూజియా మాజిష్టర్ (మాస్టర్ ఆఫ్ సర్జరీ) అని అర్థము) అనేవారు. అప్పుడు సర్జరీలో అంతకంటే పై చదువు

జాతీయ ఆ

లేదు. ఇప్పుడు యమ్.బి.బి.ఎస్., యమ్.ఎస్. అని విడదీశారు. యమ్.డి.అనగా డాక్టర్ ఆఫ్ మెడిసిన్. ఉమ్మడి మద్రాసు రాష్ట్ర రాజధానిలో తొమ్మిది లేక పదిమంది మాత్రమే యమ్.డి. పరీక్ష పాసైనవారు ఉండేవారు. పదిమంది వరకు యమ్.బి. అండ్ సి.యమ్‌లు ఉండేవారు. యమ్.బి.సి.యమ్. చదివిన మొదటి ఆంధ్రుడు డా॥ భోగరాజు పట్టాభి సీతా రామయ్య. ఆచంట లక్ష్మీపతి గారు యల్.ఎమ్.సి.యస్. పూర్తిచేసి దివి గోపాలచార్యులు దగ్గర ఆయుర్వేదం నేర్చుకున్నారు. కొడికడుతున్న ఒక మహోన్నత భారతీయ వైద్య శాస్త్రానికి తిరిగి జీవం పోశారు డా॥ లక్ష్మీపతి.

లక్ష్మీపతి మాధవరం, నిడదవోలు దరి, (ప॥గో॥ జిల్లా)లో మార్చి 3, 1880లో జన్మించారు. ఆయుర్వేదానికి చేసిన సేవలకు గుర్తుగా ఆచంట లక్ష్మీపతి యూనిట్ పర్ రీసెర్చ్ ఇన్ ఆయుర్వేదిక్ మెడిసన్, వాలంటరీ హెల్త్ సర్వీసెస్, చెన్నై. ఆచంట లక్ష్మీపతి న్యూరోసర్జికల్ సెంటర్, వి.హెచ్.ఎస్, చెన్నై వంటి సంస్థలకు వారి పేరు పెట్టారు. ఇంకొన్ని అనుభవాలు తప్పక పరిశీలించాలి.

లక్ష్మీపతి తిరువణ్ణామలై అనుభవం ఇది: రమణ మహర్షికి అనారోగ్యంగా ఉందని తెలిసి లక్ష్మీపతి

ఆచంట లక్ష్మీపతి

రోగ్యయాత్ర

వైద్యం చేయడానికి వెళ్లారు. అంత జ్వరంలోను గజేంద్ర మోక్షంలోని ***"కలడందురు దీనుల యెడ, కలడందురు పరమయోగి గణములపాలన్, కలడందురన్నిదిశలను"*** పద్యం వల్లిస్తున్నారు. 'ఎందుకయ్యా! అంత కష్టపడుతూ ఆ వచ్చిన పద్యమునే చదువుకుంటారు. మీకు శ్రమ అవుతూ ఉన్నది కొంచెము సేపు ఊరకే ఉండండి' అన్నాను. అనగానే వారు "పిల్లవాళ్లు, మీకు ఏమి తెలుసును? నేను ఎట్లాగూ బ్రతకను, అది నాకు బాగా తెలుసును. శ్రవణము, మననము, ధ్యానము అన్నారు. అందుకోసం భగవన్నామమును వినవలెను, విన్నది మననము చేయవలెను. మననము చేసిన దాని గూర్చి ధ్యానించవలెను అన్నారు. మరణ భయమనేది అటువంటి జ్ఞానవంతుల కుండదు. అప్పటికి స్వామి వారికి 85 సంవత్సరాలు దాటినవి.' ఆ అనుభవంలో ఇంకా ఈ ఘట్టం ఉంది. 'రమణ మహర్షికి అసాధ్యమగు వ్రణము ఎడమ చేతిపై పుట్టింది. నన్ను సలహా నిమిత్తము పిలిచినారు. శ్రీ మహర్షి గారిని పరీక్షించే సమయములో ఆయన నాతో ఈ క్రింది మాటలు చెప్పినారు. ఆయన ఎప్పుడు తన శరీరాన్ని వాడు-వీడు అని చెప్పుటయే. నా శరీరము అనడు. "వీడికింకా చికిత్స ఎందుకు? ఈ శరీరముతో కావలసిన పని అంతా అయిపోయినది. పాము కుబుసము విడిచినట్లు దీనితో పని తీరిపోగానే విడిచిపోవలసినదే గాని దానికంత ప్రయత్న మెందుకు?' అన్నారు. 'ఉన్నన్నాళ్లు బాధ పడాలి కదా?' అన్నాను. ఇతరుల తృప్తి కొరకు వైద్యం చేయించుకోవడమే గాని శ్రీ రమణ మహర్షి గారికి యే వైద్యమునందునా ఇష్టము లేదు" అని రాశారు లక్ష్మీపతి.

ఈ అనుభవం గమనించండి! 'చెన్నపట్నంలో చేతినిండా పనియుండి, ఆదాయము కూడా బాగానే వుండేది. చింతాద్రిపేటలో స్వామి నాయకవీధిలో 58వ నెంబర్ ఇంట్లో ఆపరేషన్ థియేటర్ తయారుచేసి రోజూ మూడు, నాలుగు ఆపరేషన్‌లు చేసేవారము. బోద కాళ్ళు, బుడ్డలు, కడుపు కోసే ఆంధ్రవృద్ధి వగైరా, క్యాన్సర్ ఆపరేషన్ కూడా ఇక్కడే చేసేవారు. ఒకరోజు అయ్యదేవర కాళేశ్వరరావు గారి మేనల్లుడు తొమ్మిది సంవత్సరాల పిల్లవాడు పేరు లక్ష్మణరావు, ఇతర పిల్లలు గూటీబిళ్ల ఆడుతూ వుంటే ఆ బిళ్ల వచ్చి కంటిలో గుచ్చుకొని కన్నుచితికి పోయింది. ఆ పిల్లవాణ్ణి తిన్నగా మా ఇంటికి తీసుకువచ్చారు. నాకు అదే మొదటి కంటి ఆపరేషన్. కన్ను ఆసుపత్రికి పంపితే కన్ను తీసేస్తారు. నేను వైద్యం చేసి క్లోరోపారమ్ ఇచ్చి కన్ను తీసివేయకుండా కన్ను శుభ్రం చేసి కడిగి దూదివేసి మూసి కట్టు వేశాను, నా అదృష్టం బాగున్నది. కట్టు విప్పి చూడగా కన్ను చక్కగా అతుక్కుని వున్నది. ఆ పిల్లవాని తల్లి సంతోషంతో "మీకు నేను ఏమీ ఇయ్యలేను. మా పిల్లవాడు పెద్దయి ఉద్యోగం చేసినప్పుడు మొదటి నెల జీతం నీకే ఇస్తానన్నది" ఆ పిల్లవాడే ఇప్పుడు డా॥కె.ఎల్. రావు. నేటి కేంద్ర ఇరిగేషన్ మంత్రి 'న వైద్య: ప్రభురాయుష:' వైద్యుడు రోగములు కుదుర్చుట రోగుల బాధలను తొలగించుటకే అధికారం కలదు కాని, ఆయుసుకు అధికారి కాదని స్పష్టము చేస్తున్నది.'

ఇదొక మంచి అనుభవం: డాక్టర్ లక్ష్మీపతి మద్రాసు వైద్య కళాశాలలో వుండగా డా॥ ఎల్లా ప్రగడ సుబ్బారావు అనారోగ్యానికి గురయ్యారు. ఆకలి లేదు, పేలవంగా జీర్ణ సామర్థ్యం, ఉదరంలో మంట, విరోచనాలు, డా॥గురుస్వామి మొదలియార్ పేరు మోసిన వైద్యుడు. ఆయన వైద్యం చేశారు. కానీ గుణం కనిపించలేదు. ఆపై లక్ష్మీపతి ఆయుర్వేద వైద్యం చేశారు. ముఖ్యంగా వెన్నతో పాలు, కొన్ని ఆయుర్వేద ఔషదములు ఉపయోగించారు. గుణం కన్పించింది. కామెర్లు తగ్గించడానికి వెన్నపాలు, మిరియాలు, కొన్ని ఆయుర్వేద మూలికలు వాడి తగ్గించగలిగారు. తరువాత సుబ్బారావు గారు యు.ఎస్.ఎ. వెళ్లి గొప్ప పరిశోధనా శాస్త్రవేత్త అయ్యారు.

లక్ష్మీవతి నాయకత్వ లక్షణాలు అనేక

విజయాలను తెచ్చిపెట్టాయి. ఆల్ ఇండియా ఆయుర్వేద వైద్య సంఘం అధ్యక్షులుగా రెండుసార్లు, ఆల్ ఇండియా ఆయుర్వేద మహా సమ్మేళన్‌కు రెండుసార్లు అధ్యక్షులుగా (బికనీర్ 1933, కాన్పూర్ 1947) వనిచేశారు. ఉస్మాన్ కమిటీ మెంబరుగా (1920-1924) ఉన్నారు. తన గురువు దివి గోపాలాచార్యులచే ప్రారంభించిన ధన్వంతరీ పత్రికకు సంపాదకులుగా గురువుగారి మరణానంతరం కొనసాగారు. ఆయుర్వేద కళాశాలకు ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు తీసుకున్నారు. సుమారు 64 పుస్తకాలు రాశారు. వీరి 'చలిజ్వరం' బాగా ప్రాచుర్యం పొందిన గ్రంథం. ప్రఖ్యాత వైద్యునిగానే గాక సంఘసేవకునిగా, జాతీయవాదిగా, సేవలందించిన డా॥ ఆచంట లక్ష్మీపతిగారు ఆగస్టు 6, 1962 న పరమపదించారు.

భారతదేశ మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి గారు ఆచంట లక్ష్మీవతిని ఆయుర్వేదానికి మారుపేరుగా "అల్లోపతి, హోమియోపతి, లక్ష్మీపతి" అని ప్రియంగా సంబోధించేవారు.

మూలం:

1. రసౌషధ విజ్ఞానము బై డా॥ ఆచంట లక్ష్మీపతి పేజీ-3,2 (ముందు మాట)

2. సంచిక (తెలుగు సాహిత్యవేదిక) ఉప్పు సత్యాగ్రహంలో అరెస్టయిన తొలి మహిళ శ్రీమతి తిరుమల రుక్మిణీలక్ష్మీపతి బై పుటి నాగలక్ష్మి తేది. 6. 12. 2020.

3. Journal of Ayurveda and intergrative Medicine Vol. 3 No. 3 July, 2012. Satya N. Dornala, Snehalatha. S.N. Dornala.

4. మిసిమి సెప్టెంబర్ 2013, ఆయుర్వేదం - ఆత్మకథ బై డా॥ ఆచంట లక్ష్మీపతి పేజీ. 31-39.

డా. కొశింశెట్టి సత్యనారాయణ

విశ్రాంత ఆచార్యుడు

మూడు రం

విద్య, వైద్యం, పరిశోధన, ఈ మూడు రంగాల్లో తనదైన శైలిని ప్రస్ఫుటం చేయడమే గిడుగు హిమశ్రీ ప్రత్యేకత.

మహారాష్ట్రలోని విశ్వవిద్యాలయ స్థాయి 'కృష్ణా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్'లో కీలకబాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కృష్ణా విశ్వవిద్యాపీఠ్‌గా పేరున్న ఆ వైద్య విద్యా సంస్థలో ఆమె ప్రొఫెసర్.

ప్రత్యేకించి శరీర ధర్మశాస్త్రం (ఫిజియాలజీ) పరిశోధన విభాగానికి డైరెక్టరుగా వ్యవహరిస్తున్న ఆ మహిళామణి ఘనత వైపే ఇప్పుడు అందరి చూపు! డియర్ బ్రిగేడియర్ అంటూ భారత సైనికదళం నుంచి అందిన విశిష్ట సత్కార పత్రమే మూలకారణం.

రమారమి నాలుగు దశాబ్దాలుగా ఆర్మీకి పలు విధాల సేవలందించారు హిమశ్రీ. వాటిని గుర్తుచేస్తూ పుణె-బెంగళూరు జాతీయ రహదారిలో ఉన్న మలక్‌పుర్ ప్రాంతంలోని విద్యాపీఠ బృందమంతా అభినందన సభ నిర్వహించి, జీవన సాఫల్య పురస్కారాన్ని అందించింది.

అందుకే దేశవ్యాప్తంగా దృష్టి ఆమె మీదనే కేంద్రీకృతమైంది.

ఆర్మీలో వైద్యసేవ అప్పుడు. యూనివర్సిటీలో విద్యాబోధన ఇప్పుడు! ఆ రెండింటికీ అనుసంధానమా అన్నట్లు వైద్య విద్యా సంబంధ పరిశోధన ఇప్పటికీ. వీటన్నింటితో హిమశ్రీ జీవితం ముడివడింది.

ఆమెది సాధారణ కుటుంబం. బాల్యం నుంచీ ఎంతో శ్రద్ధగా చదివేది. చదువు కోసం కాలినడకన వెళ్లిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. చదువే ధ్యేయంగా రాత్రింబవళ్లూ పరిశ్రమించిన అనుభవాలూ లెక్కలేనన్ని.

అంతర్లీనంగా సాహసప్రవృత్తి ఉండేది ఆమెలో. కుటుంబం కోసం, అంతకుమించి మాతృభూమికోసం ఎంతైనా చేయాలన్న తెగువ చాలా ఎక్కువ. ఆ తపన, ఉత్సాహమే సైన్యంలో చేరడానికి కారణమయ్యాయి.

పుణెలోని ఆర్మ్డ్ ఫోర్సెస్ మెడికల్ కాలేజీ (ఏఎఫ్ఎంసీ)లో చదివారు. అది వైద్య విద్య, పరిశోధన ప్రక్రియలకు అంకితమైన మహోన్నత సంస్థాగత వ్యవస్థ. చిరకాల చరిత్ర కలిగిన ప్రయోగ నిలయం.

రక్షణ దళాల్లో నర్సింగ్ సేవలకు శిక్షణనివ్వడం ఆ కళాశాల ప్రధాన లక్ష్యం. అండర్ గ్రాడ్యుయేట్ నుంచి పోస్ట్ గ్రాడ్యుయేట్ వరకు సంబంధిత కోర్సులు అనేకం ఉన్నాయి. వీటి నుంచే, ఏటా ఎంతోమంది ఉత్తీర్ణులై వృత్తి ఉద్యోగాల్లోకి ప్రవేశిస్తుంటారు. నిర్వహణ మొత్తం సైనికాధికారుల చేతుల్లో ఉంటుంది. ప్రమాణాల రీత్యా, ఆసియా ఖండంలో పేరెన్నికగన్న సంస్థ ఏఎఫ్ఎంసీ. అందులో మేటి శిక్షణ పొందారు హిమశ్రీ.

స్వాతంత్ర్య సాధన అనంతరం 1948లో స్థాపించారు ఆ వైద్య విద్యాలయాన్ని. వేలాది వైద్యులు, ఇతరసిబ్బంది అక్కడి నుంచే రూపుదిద్దుకున్నారు. నర్సింగ్‌లో అధునాతన విధానాలను ఉన్నతాధికారులు 1964 నుంచీ ప్రవేశపెట్టారు. మిలిటరీ నర్సింగ్ సర్వీసుల ద్వారా ఎంతోమంది నర్సింగ్ ఆఫీసర్లను తీర్చిదిద్దారు. దేశ విదేశాల్లో సైతం విస్తృత సేవలను అందించి అనంత ఖ్యాతిని సంపాదించగలిగారు.

అది 1988వ సంవత్సరం. అప్పుడు ఆర్మీలో చేరిన హిమశ్రీ సంపత్సరాల తరబడి వివిధ ర్యాంకుల్లో సేవలందించారు. మొత్తం మీద ఆమెది మిలిటరీ నర్సింగ్ సర్వీస్ (ఎంఎన్ఎస్). అదంతా ఇండియన్ మెడికల్ కార్ప్స్‌లో కీలకభాగం. ముఖ్యంగా మహిళా అభ్యర్థులనే ఆ సేవల్లోకి తీసుకుంటారు. సైనికుల ఆరోగ్య పరిరక్షణలో కీలకపాత్ర నిర్వర్తించేలా చేస్తారు. సైన్యంతోపాటు వారి కుటుంబాలకు సంబంధించి ప్రత్యేక శ్రద్ధ వహిస్తుంటారు. విభిన్న వైద్య విధానాల్లో, అత్యవసర వైద్య సేవల్లో నిపుణత సాధించిన ఆమెకు అరుణాచల్ అడవుల మొదలు సియాచిన్ మంచు శిఖరాలవరకు వాతావరణ స్థితిగతులన్నీ పరిపూర్ణంగా తెలుసు. ఆ నడుమ మెడికల్ యూనిట్లకు ఆమెదే నాయకత్వ బాధ్యత. విధి నిర్వహణలో ఎన్ని సవాళ్లను ఎదుర్కొన్నారో లెక్కే లేదు.

అరుణాచల్‌లో అత్యధిక భాగం హిమాలయ ప్రాంతాలే! వాతావరణమంతా పర్వతాల ఎత్తును అనుసరించి ఎప్పటికప్పుడు మారిపోతుంటుంది. కొన్నిచోట్ల అతిశీతల స్థితి అందరినీ గడగడలాడిస్తుంటుంది, గజగజ వణికిస్తుంటుంది. ఇక సియాచిన్ అనేది హిమాలయ ప్రాంతాలలోనే ఉన్న హిమానీనదంగా సుప్రసిద్ధం. భూమి నుంచి ఎంతెంతో ఎత్తు ప్రదేశం. మన దేశానికి రక్షణ రీత్యా అత్యంత వ్యూహాత్మకం అది. అటువంటి చోట్ల విధులు నిర్వర్తించటం అంటే కత్తిమీద సాము. అయినా ఆ వాతావరణ తీవ్రతలోనే సైనికులకు, కుటుంబాలకు నిరంతర వైద్య సేవలందించిన హిమశ్రీ ఏ స్థితిలోనూ వెనుకంజ వేయలేదు.

సైన్యానికి నర్సింగ్ సేవలు అందించడం అనుక్షణమూ విపరీత ఒత్తిడితో ఉంటుంది. గాయపడిన/ఉన్న పళంగా తీవ్ర అనారోగ్యానికి గురైన/ప్రాణాపాయ స్థితికి చేరిన వ్యక్తి రీతిని అప్పటికప్పుడు స్పష్టంగా అంచనా వేయగలగాలి. తక్షణ చర్యలను చేపట్టి ప్రాణాధార ఔషధాలను ఇవ్వాలి. పర్యవేక్షణను అనుసరించి, చికిత్స పద్ధతుల్లో ఎప్పటికప్పుడే మార్పుచేర్పులు

చేస్తుండాలి. ప్రాథమిక మొదలు శస్త్ర చికిత్సల దాకా ఎప్పుడు ఏం చేయాలో అది చేస్తే తప్ప ప్రాణం నిలబడదు. ఈ అంతటినీ పరిపూర్తిగా ఆకళింపు చేసుకున్న హిమశ్రీ ఎప్పుడు ఎన్ని సవాళ్లు ఎదురైనా అప్పుడు అక్కడ సత్వరం స్పందించి, ఉన్నతాధికార వర్గాలతో శభాష్ అనిపించుకున్నారు. ఒకసారి కాదు... ఎన్నో మార్లు!

బాధిత సైనికుల ఆత్మస్థైర్యం పెంచడానికీ ఆమె పరిశ్రమించారు. వారి ప్రశ్నలకు ఆశావహ జవాబులిచ్చి, అవగాహన మరింత కలిగించి, ఆయా సైనిక కుటుంబాలకీ దిటవునిచ్చారు. గాయాలు మానేవరకు, పూర్తి స్వస్థత కలిగేవరకు కంటి రెప్పలా కాపాడారు. ఏ సమయంలోనైనా విసుగూ విరామం లేకుండా సేవలందచేస్తూనే వచ్చారు.

సైనిక స్థావరాల్లో, క్రియాశీలంగా గల యుద్ధ ప్రాంతాల్లో అన్నీ తానై ఉండేవారామె. క్షేత్ర స్థాయి వైద్యశాలలు, క్లినిక్‌లు, ఇతరేతర ప్రదేశాలకూ రెక్క కట్టుకు వెళ్లేవారు. ఎక్కడ ఏ అవసరం వచ్చినా ముందు వరసన ఉంటూ ప్రాణజ్యోతులు వెలిగించిన వనితారత్నం.

అలా సేవచేయడం మామూలు విషయం కాదు. నెలల తరబడి ఇంటికీ, తన కుటుంబానికీ దూరంగా ఉండాల్సి వస్తుంది. వ్యక్తిగతంగా ఇబ్బందులనూ ఎదుర్కోవలసి ఉంటుంది. ఏది ఎలా ఉన్నా భారత సైనికుల

గాల్లో మేటి

ఆరోగ్య సంరక్షణే తక్షణ లక్ష్యంగా సమయాన్ని, శక్తిని కేటాయించారు ఆ ఆదర్శవనిత.

అదంతా దేశంలో. మరి విదేశాల్లో? అక్కడికీ హిమశ్రీ వెళ్లివచ్చారు. సోమాలియా వంటి ఘర్షణాత్మక ప్రాంతాలలోనూ బాధ్యతలు నిర్వహించారు. ఆఫ్రికా ప్రాంతం సోమాలియా. అంతర్యుద్ధాలు అక్కడ పరిపాటి! అదీ దీర్ఘకాలంగా! అధికారం కోసం పోరాటాలు సాగుతుంటాయి. వ్యూహప్రతి వ్యూహాలతో తరచూ ఆ ప్రాంతం అట్టుడుకుతుంటుంది. సైనిక ప్రభుత్వాలు, తిరుగుబాటు వర్గాలు మోహరిస్తుంటాయి, స్థిరమైన పాలన అనేది అంతగా కనిపించదు. శాంతి అన్నదే ఎక్కడా ఉండదు.

ఆ సోమాలియా దేశంలో శాంతిస్థాపనకు ఐక్యరాజ్యసమితి ఎంతో పాటుపడుతోంది. శాంతి పరిరక్షక దళాన్ని ఏర్పాటుచేసి, జాగ్రత్త చర్యలు తీసుకుంటోంది. అదంతా 1993 నుంచి వేగం పుంజుకుంది. తర్వాత రెండేళ్లకు మరికొన్ని పరిణామాలు చోటు చేసుకున్నాయి. శాంతిస్థాపన ప్రక్రియలో భాగంగా మన దేశం నుంచి వెళ్లిన బృందంలో ముఖ్యురాలు హిమశ్రీ!

అక్కడికి వెళ్లింది మొదలు రోజులో 24 గంటలూ తన విధులకే కేటాయించారు ఆమె. ఐరాస చేపట్టిన శాంతిపరిరక్షక ప్రయత్నంలో ఆ బృందం సంపూర్తి సహకారం అందించింది. అంతర్జాతీయంగా శాంతిభద్రతలను కాపాడేందుకు విదేశంలో ఉన్న దళాలకు జత కలిసింది భారత బృందం. వేలాది సభ్యులున్న ఆ యంత్రాంగమే సర్వసమర్థంగా వ్యవహరించింది. అందరిలోనూ హిమశ్రీ చూపిన చొరవ అనితర సాధ్యం.

మన భారతదేశం ఇప్పటికే అర్ధశతాధిక 'శాంతిపరిరక్షక బృందాలు'లో నాయకపాత్ర వహించింది. లక్షల సంఖ్యలో సిబ్బందిని విదేశాల్లో నియోగించింది. భారత్ ఆదర్శనీయంగా నిలిచిందని స్టాక్‌హోమ్ ప్రధాన కేంద్రంగా ఉన్న ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ కొనియాడింది. అన్నింటికన్నా మిన్నగా వైద్యబృందం పాత్ర పోషణ చేసిందని ఆ సంస్థ నివేదిక ప్రత్యేక ప్రస్తావన చేసింది. అప్పటి ఆ బృంద ముఖ్యపాత్ర హిమశ్రీ దే కావడం మన దేశ ఖ్యాతిని పెంచిందనాలి.

ఆమె మాటల్లోనే చెప్పాలంటే: **'విదేశంలో శాంతిపరిరక్షణ అనేక రకాల సవాళ్లతో కూడి ఉంటుందని నా అనుభవం చెప్తోంది. ఆ కృషిలో నిమగ్నమై ఉన్న భారత సైనికుల వైద్యభద్రత మా మీదనే ఆధారపడి ఉంటుంది. ఎంతో అప్రమత్తంగా ఉండేవాళ్లం. క్షతగాత్రులకు సత్వర సాయం అందేలా ఎంత చేయాలో అంతా చేసేవాళ్లం. అనేక రోజులపాటు మా కంటిమీద కునుకు ఉండేది కాదు. నిరంతరం మన సైనికుల కదలికలను గమనిస్తూ, ఏ క్షణాన వైద్యం అవసరమైనా అక్కడికి రెక్కలు కట్టుకు వాలే వాళ్లం. అవతలి నుంచి కొన్ని ప్రమాదకర పరిస్థితులూ ఎదురయ్యేవి. అయినప్పటికీ మేం తగ్గలేదు. భారత సైనికుల ఆరోగ్యపరిరక్షణకే సర్వశక్తులూ ఒడ్డి మంచి ఫలితాలు సాధించాం. వృత్తిగతంగా, నాకు ఎంతైనా సంతోషం కలుగుతుంది ఆ రోజుల్ని తలచుకుంటే!'**

ప్రస్తుతం మన దేశంలోనే మహారాష్ట్రలోని విద్యాపీఠానికి రీసర్చ్ డైరెక్టరుగా ఉంటున్న హిమశ్రీ వైద్య విద్య పరిశోధనలకు సకల శక్తియుక్తులనీ కేంద్రీకరిస్తున్నారు. పరిశోధన రంగాన ఉన్న క్షేత్ర స్థాయి అనుభవాల నేపథ్యంలో తన జీవిత చరిత్ర రాసే పనిలోనూ నిమగ్నులయ్యారు. ఉద్యోగ విరమణ తదుపరి జీవితం గురించి తనలో ఇంకా ఎన్నెన్నో ఆశయాలున్నాయని చెప్తున్నారు. సైనిక వైద్యబృందం నుంచి విరమించుకున్న తనకు ఇప్పటి వైద్యవిద్యా పరిశోధన రంగం మరింత సంతోషాన్ని ఇస్తోందంటున్నారు.

నిస్వార్థ సేవకు నిదర్శనంగా ఉన్న గిడుగు హిమశ్రీని చూసి ఎంతైనా నేర్చుకోవాలి ప్రస్తుత యువత. వైద్య, విద్య, పరిశోధన రంగాలకు ఇప్పటికీ వెన్నుదన్నుగా నిలుస్తున్న ఆమెను అభినందించి తీరాలి ఎవరైనా! జాతి అభినందనను అందుకునేంత సేవానిరతి ఆమెది. ఆదర్శప్రాయురాలు. స్ఫూర్తి కలిగించేంత ధన్యచరితురాలు. ★

జంధ్యాల శరత్‌బాబు
సీనియర్ జర్నలిస్ట్

త్రిశక్తి స్వరూపిణీ! నమోస్తుతే...

భారతీయ సంస్కృతిలో శక్తి ఆరాధనకు విశిష్ట స్థానం ఉంది. ఆ ఆదిశక్తే దుర్గాదేవి. ఆ తల్లిని తొమ్మిది రూపాలలో అర్చించడమే దేవీ నవరాత్రుల పరమార్థంగా చెబుతారు. లక్ష్మీ స్వరూపిణీగా సంపదను, సరస్వతిగా జ్ఞానాన్ని, పార్వతిగా శక్తిని ప్రసాదించే దుర్గమ్మను 'అమ్మలగన్నయమ్మ ముగురమ్మల మూలపుటమ్మ చాల పెద్దమ్మ సురారులమ్మ....' అని పోతనామాత్యుడు శ్లాఘించారు.

దేవీ నవరాత్రులు శక్తి ఉపాసనకు ప్రతీకలు. ప్రకృతిలోని, మానవ ప్రవృత్తిలోని చెడులను దూరం చేయడానికి శక్తిని ఉపాసించవలసిన ఆవశ్యకతను ఈ పండుగ గుర్తు చేస్తుంది. లోకానికి దానవ బాధ ప్రబలినప్పుడల్లా వారి సంహారానికి అవతారాలు దాలుస్తుంటాను' (ఇత్థం యదా యదా బాధా దానవోత్థా భవిష్యతి/తదాతదా వతార్యాహం కరిష్యామి సంక్షయమ్) అని భగవతి చెప్పినట్లు 'దుర్గా సప్తశతి' పేర్కొంటోంది

ఆశ్వయుజ శుక్ల పాడ్యమి నుంచి తొమ్మిది నాళ్లు అమ్మవారిని వివిధ రూపాలలో అలంకరించి అర్చిస్తారు. 'దేవీకవచం'... 'ప్రథమం శైలపుత్రీ ద్వితీయా బ్రహ్మచారిణీ/తృతీయా చంద్ర ఘంటేతి కూష్మాండేతి చతుర్థకీ/పంచమా స్కంద మాతేతీ షష్ఠ్యా కాత్యాయనీతచ/సప్తమా కాలరాత్రేతి మహాగౌరీ చాష్టమీ/నవమా సిద్ధిధాత్రీతి నవదుర్గాः ప్రకీర్తితాः' (శైలపుత్రి, బ్రహ్మచారిణి, చంద్రఘంట, కూష్మాండ, స్కందమాత, కాత్యాయని, కాళరాత్రి, మహాగౌరి, సిద్ధిధాత్రి)అని నవదుర్గలను వివరించింది. దుర్గాదేవి, బాలాత్రిపురసుందరి, మహాలక్ష్మి, గాయత్రీ మాత, అన్నపూర్ణేశ్వరి, మహాకాళి, లలితాంబ, సరస్వతి, మహిషాసురమర్ధని, రాజరాజే శ్వరీదేవి రూపాల లోనూ అమ్మవారిని ఆరాధిస్తారు. ఆశ్వయుజ మాసంలో సకలలోక జనని ఆదిశక్తిని శైవులు, వైష్ణవులు, శాక్తేయులు స్వల్ప తేడాలతో పూజిస్తారు. శైలపుత్రి, బ్రహ్మచారిణి, చంద్రఘంట, కూష్మాండ, స్కందమాత, కాత్యాయని, కాళరాత్రి, మహాగౌరి, సిద్ధిధాత్రి అని 'దేవీకవచం' జగజ్జనని నవ రూపాలను పేర్కొంటోంది.

పాడ్యమినాడు జన్మించిన మహామాయ మహాకాళియై మధుకైటభులను సంహరించింది. విదియనాడు మహాలక్ష్మియై మహిషాసురమర్దిఅయిచ తదియనాడు మహాసరస్వతిగా అవతరించి శుంభనిశుంభులను సంహరించింది, చవితినాడు యోగమాయగా నందుని ఇంట పుట్టి నందగా కంసుడిని భయ పెట్టింది. పంచమినాడు విజృంభించి దమనుడు అనే రాక్షసుడిని చీల్చి రక్తదంతిగా పేరు పొందింది. షష్ఠినాడు శాకంబరి అయి కరవు కాటకాలను దూరం చేసింది. సప్తమి నాడు ఆవిర్భవించి దుర్గముడనే

దేవదేవుడి

'వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన
వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి' అని పురాణవాక్కు. శ్రీ వేంకటేశ్వరుడు అర్చామూర్తియై స్వయంభువుగా వెలసిన వేంకటాద్రితో సమానమైన స్థానం ఈ బ్రహ్మాండంలోనే లేదని, వేంకటేశ్వరు నితో సమానమైన దైవం ఇప్పటి వరకు లేడు, ఇక ఉండబోడని బ్రహ్మాండ, ఆదిత్యాది పురాణాలు పేర్కొన్నాయి. వేంకటేశ్వరుడు ఆశ్వయుజంలో శ్రవణ నక్షత్రంలో ఆర్చామూర్తిగా ఆవిర్భవించి నందున అప్పటికి ముగిసేలా బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తారు. అధికమాసం వస్తే భాద్రపదంలో (వార్షిక బ్రహ్మోత్సవం), ఆశ్వయుజంలో (నవరాత్రి బ్రహ్మోత్సవం) రెండుసార్లు ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తారు.

అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారికి ఏటా 450కి పైగా రకాల ఉత్సవ కైంకర్యాలు నిర్వహిస్తున్నా, బ్రహ్మోత్సవం విశిష్టం, విలక్షణం, వైభవోపేతమైనది. జగత్కల్యాణ కోసం ఈ ఉత్సవాలు జరిపించాలని శ్రీనివాసుడు విధాతను ఆదేశించారట. ఆ ప్రకారం బ్రహ్మ దేవుడు శ్రీనివాసుడి జన్మనక్షత్రం శ్రవణం నాటికి ముగిసేలా తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలకు శ్రీకారం చుట్టారట. లోకహితంతో పాటు భగవంతుని మూలబింబం (ధ్రువ బేరం)లోని శక్తి అభివృద్ధికి కూడా బ్రహ్మోత్సవం నిర్వహిస్తారట. దీనినే మహోత్సవం, తిరునాళ్లు, కల్యాణోత్సవం అంటారు.

బ్రహ్మోత్సవ సన్నద్ధతలో భాగంగా ఆలయంలో శుద్ధి కార్యక్రమం (కోయిల్ ఆళ్వారు తిరుమంజనం) నిర్వహిస్తారు. ఉత్సవాలకు ముందు రోజు, శ్రీహరి సేనాధిపతి విష్వక్సేనుడి ఆధ్వర్యంలో మృత్సంగ్రహణం, అంకురారోర్పణ జరుగుతాయి. ధ్వజారోహణ సమయంలో ఉత్సవమూర్తి మలయప్ప స్వామి ఆలయ ప్రాంగణంలోని తిరుమలరాయ మండపంలోని వేదికపై వేంచేసి నివేదనలు, హారతులు అందుకుంటారు.

ఈ ఉత్సవాల సందర్భంగా శ్రీవారి వాహనం ముందు విగ్రహం లేని బ్రహ్మరథం కదులుతుంది. దాని తరువాత వృషభాలు, అశ్వాలు,గజాలు స్వామి వారికి స్వాగతం పలుకుతూ మందగమనంతో సాగుతాయి.

ఎక్కడెక్కడో ఉన్నవారంతా బ్రహ్మోత్సవాలు చూసేందుకు వానలను కూడా లెక్క చేయక ఉరుకులు పెడతారు (నానా దిక్కుల నరులెల్లా వానలలో ననె వత్తురు గడలి') అని పదకవితా పితామహుడు అన్నమయ్య సంకీర్తనలో కీర్తించారు. కనువిందు చేసే వాహనోత్సవాల గురించి 'తిరువీథుల మెరసే దేవదేవుడు... గరిమల మించిన సింగార ములతోడను...' అనీ కీర్తించారు. బ్రహ్మోత్సవాల వాహన సేవల్లో ఆళ్వారుల రాసిన నాలాయిర దివ్య ప్రబంధాన్ని అఖండంగా గానం చేస్తారు. క్షేత్రవైశిష్ట్యం, అక్కడి అర్చామూర్తులు, వారికి జరుగుతున్న ఉత్సవ విశేషాలు, ప్రకృతి సంపదను వారు తమ కవిత్వం (పాశురాలు)లో పొందు వరిచారు. వీటికే ప్రబంధాలు అని పేరు.

ఈ ఉత్సవాలు ముగిసేంత వరకు సర్వాలంకరణ భూషితులైన స్వామివారు ఉభయ దేవేరులతో వివిధ వాహనాలపై నిత్యం రెండు పూటలూ ఊరేగుతూ

రాక్షసుడిని దునిమి దుర్గగా పేరుపొందింది. అష్టమినాడు మాతంగుని ఇంట్ల మాతంగినిగా జన్మించి అస్పృశ్యతను దూరం చేసింది. నవమి నాడు భ్రమరిగా అవతరించి భ్రమరాల సహాయంతో అరుణుడనే రాక్షసుడిని అంతమొందిం చింది. ఇలా విజయ దుర్గగా లోకమాతగా నిలిచారు.

నవరాత్రుల వ్రతం గురించి దేవీభాగవతంలోని తృతీయ స్కంధంలో వివరంగా ఉంది. దీక్షాకంకణ ధారులై తొమ్మిది రోజులూ కలశస్థాపన చేసి పొలి మేరలు దాటకుండా ఈ వ్రతం చేయాలి. నవ రాత్రు లను శాస్త్రోక్తం నిర్వహించాలనుకునేవారు పాడ్యమి నాడు కలశస్థాపనతో ఉపక్రమిస్తారు.ఆయా తిథులలో అమ్మవారి అవతారాలకు సంబంధించిన అష్టోత్తర, సహస్రనామాలు, పూజాద్రవ్యాలతో అర్చించి, శక్తికొద్దీ నైవేద్యాలు సమర్పిస్తారుగణపతి నవరాత్రుల మాదిరిగానే దేవీ నవరాత్రులను పెద్ద విగ్రహాలు ప్రతిష్ఠించి చివరిరోజున నిమజ్జనం చేస్తారు.

శరన్నవరాత్రులలో అతి ముఖ్యమైనది సప్తమి తిథి, మూలా నక్షత్రం. జగన్మాతను సరస్వతీ అలం కారంలో అర్చిస్తారు. అమ్మవారిది మూలా నక్షత్రం కనుక ఆనాడు ఆదిశక్తిని విద్యల దేవత 'సరస్వతీదేవి'గా అలంకరిస్తారు.. 'దైవం మంత్రా ధీనం'అంటారు సద్గురువులు. ఆ మంత్రాలకు అధిదేవత, ఆరాధ్యదేవత సరస్వతీ మాత. మాఘ మాసంలో వసంత పంచమి నాడు చేసే సరస్వతీ పూజ దుర్గాదేవీ నవరాత్రులలోనూ ఒక రోజు చోటు చేసుకోవడం విశేషం. వ్యాసభగవానుడు ప్రతిష్ఠించి నట్లు చెప్పే బాసరలోని జ్ఞానసరస్వతి క్షేత్రంలో నవరాత్రులు నిర్వహిస్తారు. మూలానక్షత్రం సందర్భంగా పిల్లలతో సరస్వతీ పూజ, అక్షరాభ్యాసం నిర్వహిస్తారు. నవరాత్రుల సందర్భంగా కన్యకాపూజ, సుమంగళి, పూజ, మహాచండీయాగం మున్నగునవి నిర్వహిస్తారు. 2–10 సంవత్సరాల మధ్య వయస్సు గల వారితో చేయించే పూజను 'కుమారీ/కన్యకా పూజ' అంటారు.

ఈ నవరాత్రులు వచ్చే మహాలయ పక్షానికి 'యుద్ధపక్షం' అని మరోపేరు.అసురులతో యుద్ధంలో పరాజితులైన సురలు శరన్నవరాత్రులలో తమ ఇష్టదేవతలను అర్చించి దశమి నాడు విజయం సాధించారని పురాణకథనం.ఒక్కొక్కరోజు ఒక్కొక్క రకమైన నైవేద్యాన్ని నివేదిస్తారు. అమ్మవారికి ఇష్టమైన పాయసాన్ని ఈ మానమంతా ఆరగింపుగా సమర్పిస్తారు. రామాయణ కాలం వరకు దేవీనవరా త్రులను వసంత రుతువులో (చైత్రమాసం)లో నిర్వహించేవారట. రావణుడితో యద్ధం సమయంలో శ్రీరామచంద్రుడు ఆశ్వయుజ మాసంలో చండీ హోమం నిర్వహించి దుర్గాదేవి అనుగ్రహానికి పాత్రు డయ్యాడని, నాటి నుంచి శరదృతువులో నవరాత్రులు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని, అందుకే వీటిని శరన్నవ రాత్రులుగా వ్యవహరిస్తున్నారని ప్రతీతి. తొలినాళ్లలో ఆలయాలు, రాజప్రసాదాలకే పరిమితమైన నవరాత్రి వేడుకలు కాలక్రమంలో సామాన్యుల ఊరూరా జరుపుకోవడం మొదలు పెట్టారు. స్వాతంత్ర్య సముపార్జనకు దుర్గాపూజ ఎంతగానో ఉపకరించింది. ప్రజలను సంఘటితపరచి చైతన్యవంతం చేసేందుకు జాతీయ నాయకులు దుర్గాపూజను వేదికగా చేసుకున్నారు. బహిరంగ ప్రదేశాలలో అమ్మవారి విగ్రహాలు నెలకొల్పి ఘనంగా పూజలు నిర్వహించారు.

విదేశాలలోనూ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. ఈ పండుగను నేపాల్‌లో 'దసైన్'గా పిలుచుకుంటారు.బాంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో ఢాకేశ్వరి ఆలయంతో పాటు ఇతర ఆలయాలలోనూ, సింగపూర్, మలేసియా, బ్రిటన్,అమెరికాలోని వివిధ రాష్ట్రాలలో, జర్మనీ, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్, శ్రీలంకలో స్థిరపడిన భారతీయులు ఈ వేడుకలను ఉత్సాహంగా నిర్వహించుకుంటారు. చైనాలోని భారతీయులు 2004లో షాంగైలో దేవీ నవరాత్రుల ఉత్సవాలను ప్రారంభించారు. గుజరాత్‌లో నవరాత్రుల సందర్భంగా దాండియా, గార్భా నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా ఉంటాయి.

డా॥ ఆరవేల్లి జగన్నాథస్వామి
సీనియర్ జర్నలిస్ట్

బ్రహ్మోత్సవ శోభ

భక్తులను అనుగ్రహిస్తారు. ఉత్సవాలు ముగిసేంత వరకు నిత్యం రెండు పూటలు వివిధ వాహనాలపై దర్శనమిస్తారు. వాహన సేవల దర్శనం ముక్తి ప్రదాయకమని, 'రథస్థం కేశవం దృష్ట్వా పునర్జన్మ నవిద్యతే' (రథంపై గల పరమాత్మ దర్శనంతో పునర్జన్మ ఉండదు) అని పురాణ వచనం. ఒక్కొక్క వాహన సేవ వల్ల ఒక్కొక్క ఫలితం సిద్ధిస్తుందంటారు. శేష వాహనం (కుటుంబశ్రేయస్సు), హంస వాహనం (బ్రహ్మపద ప్రాప్తి), సింహ వాహనం (ధైర్యసిద్ధి), ముత్యపు పందిరి వాహనం (సకల సౌభాగ్యసిద్ధి) కల్పవృక్ష వాహనం (ఐహిక ఆముష్మిక ఫలప్రాప్తి), సర్వభూపాల వాహనం (యశోప్రాప్తి), మోహినీ అవతారం (మాయామోహనాశనం), గరుడ వాహనం (సర్వపాప ప్రాయశ్చిత్తం) హనుమంత వాహనం (భగద్భక్తి ప్రాప్తి), గజవాహనం (కర్మవిముక్తి), సూర్యవాహనం (ఆరోగ్యప్రాప్తి), చంద్రప్రభ వాహ నం (మానసికశాంతి), రథోత్సవం (మనో వాంఛా ఫలసిద్ధి), అశ్వవాహనం (కలికల్మష నాశనం), చక్రస్నానం (సకల పాపవిమోచనం)కలుగుతాయని పురాణ వాక్కు.

తిరుమల బ్రహ్మోత్సవాలలో శ్రీవారి వాహన వైభవం ఒక ఎత్తయితే, మహాప్రదక్షిణ మార్గంలో బారులుగా భక్తజనులు మైమరచి చేసే భజనాలు, నృత్యాలు, ధరించే వేషాలు, సంకీర్తలను, వేద పారాయణం, ఆధ్యాత్మిక ప్రసం గాలు.. ఇలా ఎన్నెన్నో పులకింపచేస్తాయి. ప్రతిపూట వాహన ఆనందోత్సాహా లను కలిగించినా, ఐదవనాటి రాత్రి శ్రీవారి గరుడసేవ అతి విశిష్టమైనది. మూలవిరాట్టే ఈ వాహనాన్ని ఆవహించి భక్తకోటిని అనుగ్రహిస్తారని ఐతిహ్యం.

సుమారు వెయ్యేళ్లకు పూర్వం తిరుమల గిరులు అరణ్యంతో నిండి, ఎలాంటి వసతులు లేనందున శ్రీవారి బ్రహ్మోత్సవాలు తిరుచానూరులో జరిగేవి. ధ్వజారోహణ, ధ్వజావరోహణ మాత్రం తిరుమలలో చేసి, వాహన సేవలను తిరుచానూరులో నిర్వహించే వారని చరిత్ర. అయితే తిరుమల సందర్శించిన భగవద్రామానుజాచార్యులు బ్రహ్మోత్సవాలను తిరుమలలోనే నిర్వహించాలని విధివిధానలు కట్టుదిట్టం చేశారు. అప్పట్లో నెలనెల...ఏడాదికి పన్నెండుసార్లు ఈ ఉత్సవాలు జరిగేవి.

'వేదములే శిలలై వెలసిన దీ కొండ
యేదెన బుణ్యరాసులే యేరులైనది కొండ
గాదిలి బ్రహ్మాది లోకముల కొనలకొండ
శ్రీదేవుడుండేడి శేషాద్రి యీ కొండ' అని తిరుమల క్షేత్ర ప్రాశస్త్యాన్ని అన్నమయ్య ఆవిష్కరించాడు. ★

ఆంధ్రప్రదేశ్‌లో భారతీయ జనతా పార్టీ సారథ్య యాత్ర ముగింపు సందర్భంగా విశాఖ రైల్వే మైదానంలో సెప్టెంబరు 14న నిర్వహించిన భారీ బహిరంగ సభ రాజకీయ, అభివృద్ధి చర్చలకు కేంద్రంగా మారింది. కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జె.పి.నడ్డా ముఖ్య అతిథిగా ఈ సభలో పాల్గొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు నాయకత్వంతో రాష్ట్రం అసాధారణ వృద్ధి సాధించనుందని నడ్డా ప్రకటించారు. గత వైసీపీ పాలనలో అధోగతి పాలైన రాష్ట్రాన్ని కూటమి ప్రభుత్వం హామీల నెరవేర్చడం ద్వారా ప్రజల ఆశలను తీరిస్తోందని స్పష్టం చేశారు.

కూటమి ఏలుబడిలో

ఆంధ్రప్రదేశ్ ప్రధానమంత్రి మోదీ హృదయంలో ఉందని, ఆయన కూడా రాష్ట్ర ప్రజల హృదయాల్లో నిలిచిపోయారని నడ్డా తెలిపారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అవినీతి, అంధకారం, అసమర్థ పరిపాలన రాష్ట్రాన్ని వెనక్కి నెట్టాయని ఆయన ఆరోపించారు. 'ఆర్థిక అస్థిరత, పెండింగ్ ప్రాజెక్టులు లాంటివి ప్రజల్లో అసంతృప్తిని రేకెత్తించాయి. నేను తిరుపతికి వచ్చినప్పుడు ఈ పరిస్థితిని స్వయంగా గమనించి, మార్పు తీసుకురావాలని నిర్ణయించుకున్నాను. ఫలితంగా 2024 ఎన్నికల్లో ప్రజలు కూటమికి భారీ మెజారిటీ ఇచ్చారు. ఇది రాజకీయ మలుపు మాత్రమే కాదు. ప్రజాస్వామ్య విజయం. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిస్తోంది. ఈ అభివృద్ధి కూటమి బలాన్ని ప్రకటిస్తూ,రెండు పార్టీల మధ్య సమన్వయాన్ని సూచిస్తుందన్నారు.

మున్నెన్నడూలేని ప్రాధాన్యం

ఆంధ్రప్రదేశ్‌కు ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ఇస్తున్నంత ప్రాధాన్యం గతంలో ఎన్నడూ లేదని నడ్డా పేర్కొన్నారు. రాష్ట్రంలో 9 వేల కిలోమీటర్ల మేర జాతీయ రహదారులు నిర్మితమవుతున్నాయని,ఇది అనుసంధానతను మెరుగుపరచి, వ్యవసాయ ఉత్పత్తుల రవాణాను సులభతరం చేస్తుందని అన్నారు.స్మార్ట్ సిటీలు, సాగరమాల పథకం కింద 14 పోర్టుల అభివృద్ధి – విశాఖ, కాకినాడ, కృష్ణపట్నం రేవులు రాష్ట్రాన్ని ఎగుమతుల హబ్‌గా మారుస్తాయన్నారు. ఇప్పటికే ఆంధ్ర ఎడ్యుకేషనల్ హబ్‌గా మారిందని, అమరావతి, పోలవరం ప్రాజెక్టులకు సాయం అందిస్తున్నామని తెలిపారు. విశాఖ కేంద్రంగా కొత్త రైల్వే జోన్ ఏర్పాటు, గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టు, రూ.625 కోట్లతో భోగాపురం విమానాశ్రయానికి ఆర్థిక సహాయం – ఇవి రాష్ట్ర అభివృద్ధికి మైలురాళ్లు. ఆరు కొత్త వైద్య కళాశాలలు ప్రారంభించడం ఆరోగ్య రంగాన్ని బలోపేతం చేస్తుంది. ఇవన్నీ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాలని సూచించారు.

బీజేపీ 14 కోట్ల సభ్యులతో, 2 కోట్ల మంది క్రియాశీల కార్యకర్తలతో ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా విస్తరించిందని నడ్డా వర్ణించారు. దేశంలో పార్టీ తరపున అత్యధిక మంది ఎంపీలు, 1,500 మంది ఎమ్మెల్యేలు, వివిధ జిల్లాల్లో ప్రజాప్రతినిధులతో ఉన్నట్టు పునరుద్ఘాటించారు. గతంలో 11 ఏళ్ల కిందటి ప్రభుత్వాలు మేనిఫెస్టోలు లేకుండా అవినీతి, వారసత్వ రాజకీయాలతో నడిచాయని విమర్శిస్తూ, మోదీ ప్రభుత్వం హామీలతో ముందుకు సాగుతూ వాటిని నెరవేర్చినట్లు అడుగుతోందని చెప్పారు.

పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ ఆధ్వర్యంలో సాగిన సారథ్య యాత్ర పార్టీ విస్తరణకు ఒక గొప్ప అవకాశంగా నడ్డా పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై పోరాడుతూ పార్టీ జెండాను ప్రతి గ్రామంలో ఎగురవేయాలని కార్యకర్తలకు సూచించారు. ప్రభుత్వ పథకాలను, ప్రధానమంత్రి ఆవాస్

ప్రగతిపథాన రాష్ట్రం

యోజన, పిఎం కిసాన్, ఆయుష్మాన్ భారత్ లాంటివి ఇంటింటికీ తీసుకెళ్లి ప్రజల్లోకి చేర్చాలని చెప్పారు.

జీఎస్టీ 2.0 భావి తరాలకు మేలు

ఆర్థిక సంస్కరణలను ప్రస్తావించిన నడ్డా.. జీఎస్టీ 2.0ను భవిష్యత్ తరాలకు మేలు చేసే సంస్కరణగా వర్ణించారు. రెండు స్లాబుల్లో పన్నులు ఉండడంతో సామాన్యులపై భారం తగ్గుతుందని, ముఖ్యంగా ఆరోగ్య బీమాపై పన్ను ఎత్తివేస్తూ ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యం ఇచ్చారని చెప్పారు. వ్యవసాయం, చిన్న పరిశ్రమలపై ఆధారపడిన రాష్ట్రానికి జీఎస్టీ తగ్గింపు ఊతం ఇస్తుందని, అన్ని విధాల ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. 11 ఏళ్ల మోదీ పాలనలో దేశం అద్భుత ప్రగతి సాధించిందని పేర్కొన్నారు. ఔషధ రంగంలో భారత్ గ్లోబల్ హబ్‌గా మారిందని చెబుతూ, ప్రపంచ వ్యాప్తంగా మందుల సరఫరా ఒక ఉదాహరణగా పేర్కొన్నారు. అంతేకాకుండా, భారత్‌లో 92శాతం మొబైల్ ఫోన్‌లు తయారవుతున్నాయని చెప్పారు. 'మేక్ ఇన్ ఇండియా' చొరవతో, సామ్‌సంగ్, ఆపిల్ లాంటి కంపెనీలు ఫ్యాక్టరీలు ఏర్పాటు చేశాయన్నారు. తిరుపతి, విశాఖలో పలు పారిశ్రామిక యూనిట్లు ఉద్యోగాలను సృష్టిస్తున్నాయి. ఇది ఆర్థిక వృద్ధికి, యువతకు అవకాశాలకు మార్గం సుగమం చేస్తుందని అభివర్ణించారు.

'సారథ్యం' మరో ఆరంభం

గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వందశాతం అమలు చేస్తున్నామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ స్పష్టం చేశారు. ఈ 'సారథ్యం' ముగింపు ముగింపు కాదని, రాష్ట్రంలో అన్ని ప్రాంతాలకు విస్తరించడానికి ఇదో ఆరంభమని అన్నారు. త్వరలో 'సారథ్యం' మలివిడత యాత్ర ప్రారంభిస్తామన్నారు. ఆంధ్ర రాష్ట్ర ఉనికికి త్యాగం చేసినవారు, సర్వస్వాన్ని సమర్పించినవారి త్యాగాలను స్మరించుకోడానికి ఈ యాత్ర లక్ష్యమని చెప్పారు. ఈ యాత్రలో భాగంగా చాయ్‌పే చర్చ ద్వారా స్థానిక సమస్యలు ముందుకు తీసుకురావడానికి ప్రయత్నం చేశామన్నారు. 'ప్రధానిని కలసిన సందర్భంలో ట్రంప్ సుంకాలను ఎదుర్కోవ డానికి మరో స్వదేశీ ఉద్యమం చేపట్టాలని సూచిం చారు. డబుల్ ఇంజన్ సర్కార్‌తో రాష్ట్రాభివృద్ధికి బాటలు వేస్తున్నాం. జీఎస్టీ సరళీకరణతో నిత్యావసర సరకుల ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. దేశం నుంచి పేదరికం తొలగేలా కేంద్రం పథకాలు రూపొందిస్తోంది. సౌత్ కోస్టల్ రైల్వే జోన్ ఇచ్చి ఈ ప్రాంత ప్రజల కలను మోదీ సాకారం చేశారు. పరిశ్రమల ఏర్పాటుతో ఉపాధి అవకాశాలను కల్పించ నున్నార' అని మాధవ్ చెప్పారు.

భవిష్యత్ వృద్ధి ఆశలు: సత్యకుమార్

రాష్ట్రంలో బీజేపీకి బలం తక్కువని ఇతర పార్టీలు భావిస్తున్నాయని, కానీ ఈ సభకు తరలి వచ్చిన జనసమూహం దానికి సరైన సమాధానం లాంటిదని రాష్ట్ర ఆరోగ్య శాఖమంత్రి వై. సత్యకుమార్ యాదవ్ అన్నారు. మోదీ–చంద్రబాబు నాయకత్వంలో వచ్చే నాలుగేళ్లలో రాష్ట్రంలో అసాధారణ వృద్ధి సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. 2047 నాటికి వికసిత్ భారత్ నినాదంతో విశ్వగురు స్థానానికి చేరుకోవడమే లక్ష్యంగా పాలన సాగుతోందన్నారు. ఐదేళ్ల వైసీపీ విధ్వంసం నుంచి బయటపడేందుకు చర్యలు చేపడు తున్నామన్నారు. బీజేపీని సంస్థాగతంగా విస్తరించా ల్సిన అవసరం ఉందని, ఇందుకు కార్యకర్తలు బాధ్యత తీసుకోవాలన్నారు.

విశాఖకు మోదీ ప్రాధాన్యం

కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ మాట్లాడుతూ, కేంద్రంలో మోదీ మూడో సారి అధికారంలోకి వచ్చాక రూ.2 లక్షల కోట్ల నిధులతో రాష్ట్రంలో అభివృద్ధి అత్యంత వేగంగా జరుగుతోందని అన్నారు. ముఖ్యంగా విశాఖకు మోదీ ఎంతో ప్రాధాన్యం ఇచ్చి రెండుసార్లు వచ్చి పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించారన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విశాఖ గిన్నీస్ బుక్‌లో నమోదైందన్నారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టులకు పెద్ద ఎత్తున నిధులు, స్టీల్ ఫ్యాక్టరీకి రూ.11,500 కోట్లు ప్యాకేజీని ఇచ్చినట్లు చెప్పారు. నక్కపల్లిలో ఆర్ఎస్ఎల్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ అనుమతులు మంజూరు చేస్తోందన్నారు. దేశంలో పలు పార్టీలు నాయకత్వలేమితో ఉన్నాయని, కానీ బీజేపీ కార్యకర్తల నుంచి అగ్రనేతల ఆధారంగా పనిచేస్తోందన్నారు. పార్టీని కేంద్రంలో మూడోసారి అధికారంలోకి తెచ్చిన ఘనత నడ్డాకే దక్కు తుందన్నారు.

బీజేపీ శాసనసభ పక్ష నాయకుడు విష్ణు కుమార్‌రాజు మాట్లాడుతూ, ఏ రాష్ట్రానికి ఇవ్వనన్ని నిధులు రాష్ట్రానికి కేంద్రం అందిస్తోందన్నారు. 2019లో రాష్ట్ర ప్రజలు పొరపాటున వైసీపీకి పట్టం కట్టడం వల్ల రాష్ట్రం ఐదేళ్లపాటు సర్వనాశన మైందన్నారు. మోదీ, చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్ కలయికతో రాష్ట్రం వికసిత్ ఏపీగా రూపాంతరం చెందుతోందన్నారు.

బీజేపీ జాతీయ సంయుక్త కార్యదర్శి శివప్రకాశ్, ఎంపీలు సీఎం రమేష్, ఆర్.కృష్ణయ్య, పాకా సత్యనారాయణ, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు ఆదినారాయణరెడ్డి, రామకృష్ణారెడ్డి, ఈశ్వరరావు, పార్థసారథి, సుజానా చౌదరి, కామినేని శ్రీనివాసరావు, పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు తదితరులు పాల్గొన్నారు.

తురగా నాగభూషణం
సీనియర్ జర్నలిస్ట్

కథ

ఇంద్రచాపం

ఎమ్. విజయ శ్రీముఖి

"శాన్వీ..." పిల్చింది రేవతి.

"....."

'అబ్బబ్బ...ఒట్టి బద్ధకం పిల్లయిపోయింది.. తిండి తినమనికూడా పిలవాలా? ఏదైనా అంటే మళ్లీ అలుగుడొకటి చిన్నపిల్లలాగ 'గొణుక్కుంటూ కూతుర్ని భోజనానికి పిలవడానికి ఆమె గది దగ్గరకు వెళ్లింది రేవతి.

గదిలో లైట్ లేదు. 'అప్పుడే నిద్రా?' అని అనుకుంటూ కర్టెన్ తొలగించ బోయింది.. లోపల నుండి మెల్లగా మాటలు వినిపించే సరికి మౌనంగా కర్టెన్ వెనుకే ఆగింది.

'నాకు భయంగాఉందే సత్యా..' అంటోంది శాన్వి మెల్లగా, మంచం మీద అటుతిరిగి పడుకుని.

రేవతి నొసలు ముడిపడినాయ్!

'శాన్వీకి భయమా! దేనికి? ఏదైనా ఉంటే నాతోనో, వాళ్ల డాడీతోనో చెప్పవచ్చును కదా? మాకు తెలియకుండా స్నేహితురాలితో చెప్పుకునేంత రహస్య భయం..ఏమై ఉంటుందబ్బా?'

అక్కడే ఆగి ఆలకించ సాగింది రేవతి.

'నీకేం చెప్పడం తేలికే..ఇది ఎవరికీ చెప్పలేదు, చెప్పుకోలేను కూడా. పోలీస్ రిపోర్ట్ ఇద్దామా? అమ్మో..ఊరూ నాడూ అల్లరి.

ఇంట్లోగానీ తెలిసిందో...నన్ను చంపేస్తారు. అలాగని ఎంతకాలం ఇలా దాచిపెట్టి భయపడుతూ బతకను? ఏం చేయాలో అర్థం కావడం లేదు, తల పగిలిపోతోంది... ఆఫీసుక్కూడా వెళ్లబుద్ధి కావడం లేదు సత్యా...నాకు చావొక్కటే మార్గం...'

శాన్వి సన్నగా ఏడుస్తోంది...

రేవతికి ఏమీ అర్థంకాక, అయోమయంగా ఆందోళనగా వింటోంది.

'...నువ్వన్నట్లు ఆ పనే చేసినా పోయినవి తిరిగిపొందగలనా? ఇంట్లో పరిస్థితి ఏంటి?

'బయటపడితే బైటెలా తిరగాలి?' సన్నగా ఏడుస్తూనే అడుగుతోంది శాన్వి.

వింటూనే ఉంది రేవతి

'...ఏంటీ? ఇంట్లో చెప్పనా? ఇంకేమైనా ఉందా? డాడీ నన్ను చంపేసి పాతరేస్తారు. ఆయనసలే ముక్కోపి. వాళ్లకు చెప్పాక, సిగ్గుతో తిట్లతో ఆ బాధపడే బదులు చావడమే నయం...'

కూతురు మాటలు వింటున్న రేవతికి గుండె దడదడలాడుతోంది.

'పోయినవి పొందగలనా?' అంటోంది...

'ఏం పోగొట్టుకుంది? పెళ్లిగాని పిల్ల.. చావే నయం అనుకుంటుంది అంటే..' మాకు చెప్పటానికి ఇష్టపడటం లేదన్నమాట?

ఇందుకేనా ఇరవై రోజులుగా ముభావంగా అదోలా ఉంటోంది? ఏమిటంటే ఆఫీస్‌లో పనెక్కువగా ఉందని చెబుతోంది.. మాట్లాడుతూనే ఇటు తిరగబోతున్న శాన్విని చూసి, అప్పుడే వస్తూ ఉన్నట్లుగా కర్టెన్ తొలగిస్తూ అడిగింది రేవతి

"ఎన్నిసార్లు పిలవనమ్మా నిన్ను? డాడీ, తమ్ముడు తినేసారు. ఇంక మన మిద్దరం ఉన్నాం. తొందరగా లేచి రా!"

గుమ్మంలోనే నిలబడి చెప్పింది రేవతి చిరుచీకట్లో ఉన్న శాన్విని చూస్తూ.

శాన్వి చటుక్కున ఫోన్ ఆఫ్ చేసి, తల్లి చూడ కుండా కళ్లు తుడుచుకుంటూ,

"తలనొప్పిగా ఉందమ్మా... తినాలనిలేదు, నువు తినేసెయ్" అంది లేచి కూర్చుంటూ

"ఈమాట ఇందాకేచెబితే నేనూ వాళ్లతో పాటే తినేదాన్నికదా? ఒక్కదాన్ని కూర్చుని తినలేను. ఒక్కముద్ద అన్నంలో వేడిగా పాలుపోసి పెడతాను. ఆకలి, తలనొప్పీ రెండూ తగ్గుతాయ్. లేచి రా!"

తనేం విననంత మామూలుగా చెప్పింది.

'తనదగ్గరకూడా దాస్తోంది. గట్టిగా నిలదీస్తే అసలుదాచి అబద్ధాలు చెబుతుందేమో.. ఈ కాలం పిల్లలకు రోషం, ఆవేశం ఎక్కువ. పెద్దవాళ్లు ఏదైనా చెబితే వినే ఓపిక, ఆలోచించే సహనం లేకుండా పోయాయి..ఆలోచిస్తూ వెళ్లిపోయింది రేవతి.

వెళ్లక తప్పదని లేచివెళ్లింది శాన్వి.

* * *

భోజనాలు అయిన తర్వాత వంటగదిని సర్దేసి శాన్విగదికి వచ్చింది రేవతి.

"నిద్రపోయావా?" పిల్చింది కూతుర్ని

"ఏంటమ్మా?"తలుపు తీసింది శాన్వి

"ఈపూట నేను నీతోపాటు ఇక్కడే పడుకుందా మని వచ్చాను" చెప్పింది.

"ఎందుకు?"

అనుమానంగా అడిగింది శాన్వి

"రాత్రంతా నాకు కలల్లో మా అమ్మే శాన్వీ!

నిద్ర లేచిన దగ్గర్నుంచి పదేపదే మా అమ్మ గుర్తొస్తూనే ఉందీ వేళెందుకనో..."

కూతురు పక్కనే మంచంమీద కూర్చుంటు చెప్పింది రేవతి.

"ఎందుకనమ్మా? నిన్ను డాడీ ఏమన్నా అన్నారా? ఆయనేదైనా కోప్పడినప్పుడే

నీకు అమ్మమ్మ గుర్తొచ్చేది" చిన్నగా నవ్వుతూ అడిగింది శాన్వి

ఆధారం దొరికినట్లైంది రేవతికి. ఆ మాటతో ముందుకు సాగొచ్చునను కున్నదామె.

"నేను పడుకుంటే నీకేమైన ఇబ్బందా?" ఒకపక్క పడుకోబోతు కూతుర్ని అడిగింది

"ఇబ్బందేమి లేదమ్మా...పడుకో" తను అవతలికి జరిగి, తల్లికి మరింతగా చోటిచ్చింది శాన్వి.

"ఎంత జాగ్రత్తగా ఎన్నిచేసినా.. మీ నాన్నకి నా పొరపాట్లు ఏవో కొన్ని కనిపిస్తూనే ఉంటాయి. మనుషులన్నాక ఏదో ఒక పొరపాటు పడకుండా ఉండటానికి మనం ఏమైనా దేవతలమా? సరిపెట్టుకో వడమో, ఇక మీదట అలా చేయొద్దనో చెప్పాలి. అంతేగాని మనసుకి బాధకలిగేలా అంటే ఎలా ఉంటుంది? ఛ..ఏం జీవితం? అని అనిపించదూ?" అడిగింది రేవతి.

"ఇంతకీ దేనిగురించి ఏం అన్నారు?" అడిగింది శాన్వి.

ఆమె ప్రశ్న విననట్లుగానే చెప్పసాగింది... "ఇదివరకైతే ఇలా మనసు బాగా లేనపుడు ఏదైనా సమస్య వచ్చినపుడు మా అమ్మకి చెప్పుకునేదాన్ని. తల్లి తర్వాత తల్లి కూతురే కదా? అందుకనే నీ దగ్గరకు..."

తల్లి చెప్పేది వింటోంది శాన్వి

భండారు సదాశివరావు స్మారక దీపావళి కథల పోటీకి ఎంపికైనది

"మా అమ్మ నీలాగా చదువుకుని ఉద్యోగం చేయడం కాదు కదా, కనీసం నాలాగా కాలేజీ గడప కూడా తొక్కలేదు. ఐతేనేం? తన అనుభవంతో సమస్యని అర్థం చేసుకుని మంచి సలహానో, పరిష్కారమో చెప్పి ఊరడించేది. అప్పుడు నా మనసంతా భారం దిగి తేలికపడేది"

"....."

"... ఇప్పుడెవరికి చెప్పుకోను? చుట్టాలకో, ఇరుగుపొరుగు వాళ్లకో అన్నీ చెప్పుకోలేం. చెబితే అల్లరయి పోతామని భయం"

"ఇంతకీ ఏమన్నారమ్మా డాడీ?"

తల్లి బాధేంటో అర్థంకాలేదు శాన్వికి.

"మనసు వికలమైనప్పుడు.. మనది తప్పు అయినా, ఒప్పైనా కడుపులో పెట్టుకునేది కన్నవాళ్లే. బిడ్డలకు తల్లి, తండ్రిని మించిన శ్రేయోభిలాషులు ఎవరూ ఉండరు కదా.."

"అసలు డాడీ ఏమన్నారో చెప్పలేదు"

అడుగుతూనే ఆలోచిస్తుంది శాన్వి 'ఇందాక సత్యతో తన మాటలు విన్నదా? అని లీలామాత్రంగా అనుమానం వచ్చినా అప్పుడప్పుడు తండ్రి విసుక్కున్నా, లేదా ఈమెకే ఆయనమీద కోపం వచ్చినా తనకి ఫిర్యాదు చేయడం అలవాటే అనుకుంది.

"నాకు ఇంటి మీద, మీ మీద అశ్రద్ధ ఎక్కువై ఏదీ పట్టించుకోవడం లేదని తిట్టారు. అవన్నీ ఏం చెప్పనులే..." మాటలను తేల్చేసింది రేవతి.

"నువు పట్టించుకోకపోతే మా అందరికీ వేళకన్నీ ఎలా అమిరిపోతున్నాయిట? ఏదో విసుగులో అరుస్తూ ఉంటారులే గానీ, నీ మీద డాడీకి చాలా ప్రేమ ఉందమ్మా!" చిన్నగా నవ్వుతూ చెప్పింది శాన్వి.

"ఏం ప్రేమో! అంతేలే, నీవన్నట్లు చికాకులో అరిచి ఉంటారు. చూసావా? నీకు చెప్పుకో బట్టేకదా మనసు తేలికై, మామూలైనాను. లేకపోతే, 'నన్నన్నారు.. నన్ను తిట్టారు.. ఛీ ఛా...అనుకుంటూ ఏడుస్తూ ఉండేదాన్ని" రేవతి నవ్వేసి, ప్రక్కకుతిరిగి పడుకుంది.

శాన్వి కూడా పడుకుంది.

* * *

ఓ అర్ధగంట గడిచింది...

రేవతి నిద్రపోలేదు. అతిమెల్లని కదలికలు నిట్టూర్పుల ద్వారా కూతురు కూడా నిద్రపోలేదని ఆమెకు తెలుస్తూనే ఉంది.

"నామూలాన ఫ్రీగా పడుకోలేక పోతున్నావ్ అనుకుంటాను. సరిగా పడుకో, నే వెళ్తాను" అంటూ లేవబోయింది.

"వద్దమ్మా.. ఉండు పడుకో.." అని క్షణమాగి

"అమ్మా..నీకో విషయం చెప్పాలి..." మెల్లగా

అంది శాన్వి.

"ఏమిటో చెప్పరా..."

ఇటుతిరిగితే తనని చూస్తూ చెప్పలేదని.. అటుతిరిగి పడుకునే అడిగింది రేవతి.

కొన్ని క్షణాలతర్వాత మెల్లగా చెప్పసాగింది శాన్వి...

"మొబైల్స్‌లో వాట్సాప్, ఫేస్బుక్ ఇన్‌స్టాగ్రామ్‌లు అందరూ చూస్తూ ఉంటారు కదా

అలాగే నేనూ..." ఆగింది శాన్వి.

"....." వింటుంది రేవతి

"..అలా చూస్తూ చూస్తూ అప్పుడప్పుడేవో కొన్నింటికి కామెంట్స్ పెట్టే క్రమంలో నాకు ఒకతను పరిచయం అయ్యాడమ్మా..."

'హమ్మా... అనుకున్నంతా అయ్యింది' మనసులో అనుకున్న రేవతి పైకి మాత్రం... "సహజమే! చూస్తూ చదువుతూ దేనికో దానికి స్పందిస్తాం కాబట్టి, ఎవరో ఒకరు పరిచయమవుతారు. ఇప్పుడు మీకు ఫోనుల్లో. అప్పట్లో మాకు పత్రికల్లో. ఐతే?"

అనలేదు రేవతి, అనుకుంది లోలోన.

"..చెప్పు" అంది పైకి.

"ఒకసారి ఏదో జాబ్ కోసం ఇంటర్వ్యూకి వెళ్లానని.. మంచి జాబ్ కనుక ఐదు లక్షలు డిమాండ్ చేస్తున్నారని ఒక మధ్యవర్తి ద్వారా తెలిసి, అప్రోచ్ అయ్యానని.. ఐదు కాదు మూడు లక్షలిస్తానని రిక్వెస్ట్ చేసి చివరికి ఒప్పించానని అన్నాడు..."

ఏమేం వినాల్సి వస్తుందోనని భయంగా వింటోంది రేవతి.

"...నేను కార్పోరేట్ కాలేజీలో జాబ్ చేస్తూ లక్ష వరకు కూడబెట్టుకున్నాను శాన్వీ.. ఇంకా రెండు లక్షలు కావాలి. ఎవర్నడగను? అడిగితే 'లంచానికా?' అని ఇవ్వకపోగా ఎద్దేవా చేస్తారు. నీవు సర్దగలవా?' అని అడిగాడు. జాబ్ వచ్చాక నీబాకీ తీర్చిన తర్వాతే మనపెళ్లి నన్ను నమ్ము' అన్నాడమ్మా"

"అంత డబ్బు పెద్దవాళ్లకు తెలియకుండా నేనెక్కడ తేను? అనలేదా నువ్వు?"

సాధ్యమైనంత మెల్లగా అడిగింది రేవతి

"....." మాట్లాడలేదు శాన్వి .

"నిన్నేనమ్మా" మళ్లీ అడిగింది రేవతి

"..అతను.. అతను...అడ్రస్ లేడమ్మా... మొబైల్ నంబర్ కూడా పని చేయడం లేదు అతను పని చేస్తున్నానని నాకు చెప్పిన కార్పోరేట్ కాలేజీకి నేను, సత్య వెళ్లి ఎంక్వయిరీ చేశాం...

ఆ పేరుగల వాళ్లెవరూ అక్కడ లేరనీ, ఉన్న వాళ్లంతా గత మూడేళ్లుగా ఎవరూ మారలేదని చెప్పారు. తను ఉన్నానన్న రూమ్ అడ్రస్‌కి వెళ్తే... అదీ అబద్ధమనే తేలింది... ఇంత సిటీలో ఎటునుండి వచ్చేవాడో ఏమో..." ఏడుస్తుంది శాన్వి.

"మీ స్నేహం ఎన్నాళ్ల నుండి?"

"నాలుగు నెలల నుండి. ఇరవై రోజులుగా సిమ్ మార్చి అడ్రస్ లేదు" చెప్పింది శాన్వి

హతాసురాలైంది రేవతి.

భోజనానికి పిలవడానికి వచ్చినప్పుడు సత్యతో 'చచ్చిపోవాలనిపిస్తోంది..' అని చెప్పడం గుర్తొచ్చింది. అంటే..? అంటే..?

'హమ్మా... అనుకున్నంతా అయ్యింది' మనసులో అనుకున్న రేవతి పైకి మాత్రం... "సహజమే! చూస్తూ చదువుతూ దేనికో దానికి స్పందిస్తాం కాబట్టి, ఎవరో ఒకరు పరిచయమవుతారు. ఇప్పుడు మీకు ఫోనుల్లో. అప్పట్లో మాకు పత్రికల్లో. ఐతే?" "ఆ పరిచయం స్నేహంగా మారింది... నాల్గు నెలలు గడిచేసరికి మరి కొంచం.." ఆగింది శాన్వి. ఊపిరి బిగబట్టింది రేవతి. "అలా మరింత.. క్లోజ్‌గా... ఫ్రెండ్స్యయ్యాం. తను ఒకసారి మా ఆఫీస్‌కి వచ్చి కలిశాడు రెస్టారెంట్‌కి వెళ్లాం అమ్మా..." "తనేం చేస్తాడు? ఉండేదెక్కడ?"

"ఉండేది ఈ సిటీలోనే. ఎమ్.బి.ఎ. చేసి, జాబ్ కోసం చూస్తున్నానని.. అందాక ఒక కార్పోరేట్ కాలేజీలో ఎ.ఓ.గా చేస్తూన్నాను అని చెప్పాడు..."

"ఆ పరిచయం స్నేహంగా మారింది... నాల్గు నెలలు గడిచేసరికి మరి కొంచం.." ఆగింది శాన్వి.

ఊపిరి బిగబట్టింది రేవతి

"అలా మరింత.. క్లోజ్‌గా... ఫ్రెండ్స్యయ్యాం. తను ఒకసారి మా ఆఫీస్‌కి వచ్చి కలిశాడు రెస్టారెంట్‌కి వెళ్లాం అమ్మా..."

"తనేం చేస్తాడు? ఉండేదెక్కడ?"

"ఉండేది ఈ సిటీలోనే. ఎమ్.బి.ఎ. చేసి, జాబ్ కోసం చూస్తున్నానని.. అందాక ఒక కార్పోరేట్ కాలేజీలో ఎ.ఓ.గా చేస్తూన్నాను అని చెప్పాడు..."

"....."

"తనకి మంచి జాబ్ వచ్చే వరకు మా ప్రేమను, పెళ్లి చేసుకుందామనే విషయాలు ఇద్దరి ఇళ్లలో చెప్పొద్దు అని అనుకున్నాము..." చెబుతోంది శాన్వి..

'అప్పుడే అంతవరకీ వెళ్లారా!'

అనుకుంది రేవతి

"ఎప్పుడన్నా సరదాగా సినిమాకో, షికారో వెళ్దామనేవాడు. రానంటే నిష్టూరంగా మాట్లాడేవాడు. ఎదురు చెప్పలేక... ఒకటి రెండుసార్లు పార్కుకి వెళ్లా"

'వాడు గోతిలో దూకమంటే దూకుతావా?'

"నాకు జాబ్ వచ్చిన ఈ సంవత్సరం నుండి నా శాలరీ నా పేరుతోనే బ్యాంక్‌లో వేసుకోమని చెప్పారు కదమ్మా డాడీ నువ్వు కూడా..." అంది

"అన్నామని అవి తీసి ఇచ్చేశావా?" కంగారుగా అడిగింది రేవతి

"నేను తొందరగా జాబ్‌లో చేరితే మనం మేరేజీ చేసుకుని హేపీగా సెటిల వుదాం.. అన్నాడని..." మళ్లీ ఆగింది శాన్వి.

చివుక్కున లేచికూర్చున్న రేవతి కూతురు శాన్వి గొంతులో దుఃఖం,కళ్లల్లో బెదురు చూసి తనని తాను సంబాళించుకుంటూ

"ఎందుకంత తొందరపడ్డావ్? ఒక్కమాట మాతో... కనీసం నాతో కూడా చెప్పాలని నీకు తోచలేదా?" అడిగింది.

"...మీ ఇంట్లో నువ్వూ, మా ఇంట్లో నేనూ అప్పుడే చెప్పొద్దు. నాకు జాబ్ వచ్చాక అదీ, మనపెళ్లి గురించి ఒకేసారి చెబుదాం సర్‌ప్రైజ్ చేద్దాం... అన్నాడని..." ఆగింది శాన్వి.

"సరే, ఇప్పుడు ఏమంటాడు?" వినుగు ధ్వనించింది రేవతి గొంతులో.

పోయినవి కేవలం డబ్బులేనా? లేక... ఇంకేవేవో ఆలోచనలతో వణికి పోయింది రేవతి.

"ముక్కూ ముఖం తెలియనోళ్లు. సోషల్ మీడియాలో పరిచయాలు.. అవి పెరిగి స్నేహాలు... అవి కూడా ముదిరి ప్రేమలు!

డబ్బు, మనసులు ఇచ్చేసుకునేంత వెర్రి!" కటువుగానే అంది రేవతి.

"నాకు తెల్సమ్మా... ఇది తెలిస్తే డాడీ నన్ను చంపేస్తారనీ..." దోసిలిలో ముఖం దాచుకుని ఏడుస్తోంది.

"మీరు చదివిన చదువులు ఉద్యోగానికి, చాటింగ్ లకు మాత్రమే పని కొస్తున్నాయ్...అంతకు మించిన జ్ఞానాన్ని, నిగ్రహాన్నివ్వలేక పోతున్నాయ్.. ఆవేశంలో డబ్బు మనసు శీలం... అన్నీ.. అన్నీ కోల్పోయి ఏడుస్తూ కూర్చోవడం.."

రేవతికి విపరీతమైన కోపం వచ్చేసింది, లాగిపెట్టి చెంపలు వాయకొట్టాలని ఉంది.

"అమ్మా... వాడి మాటలు నమ్మి డబ్బుని మాత్రమే ఇచ్చాను.అంతే, నమ్మమ్మా... ఇంతకుమించి నేను వివరంగా చెప్పలేను" వెక్కుతూనే అంటుంది

శాన్వి. అర్థమైంది రేవతికి. లోలోన చిన్న ఊరట. కూతురి ఏడుపుతో నిస్సత్తువ కమ్మింది.

"నీకు.. నాన్నకు.. చెప్పలేక మీ మొహాలు చూడలేక, నేను చచ్చి పోవాలను కున్నాను అమ్మా..."

కూర్చున్న శాన్వి కదిలి కదిలి ఏడుస్తోంది.

ఇందాక ఎవడినో ప్రేమ పేరుతో నమ్మేసి, లక్షలు తగలెట్టేసిందని కలిగిన ఆవేశం, ఆగ్రహం..." చచ్చిపోవాలనుకున్నానమ్మా" అనే మాటతో చల్లారి పోయాయి.

రేవతి కూతుర్ని దగ్గరకు తీసుకుంది.

"ఇదంతా మీ స్వయంకృతాపరాధమే.

మీరు అంతర్జాలపు ఉబలాటాలతో ఊగి పోతున్నారు. అక్కడ ప్రేమ, అందం, నమ్మకం, డిగ్రీలు లాంటి నకిలీ మాటలకు అందమైన రంగుల పూతతో 'ఇంద్రచాపం'లా మురిపించే వాళ్లు ఉంటారు! మాటలతో మైమరిపించే మాయగాళ్లు మాటువేసుకుని ఉంటారు. మగపిల్లలే కాదు, కొంతమంది ఆడపిల్లలు కూడా ఆ కోవలో ఉంటున్నారు..."

"....."

"మాయగాళ్ల మాటల్లో మాధుర్యం ఎక్కువ. మీరటు ఆకర్షితులైపోయి.. వాళ్ల జాలంలో చిక్కాక, మీకా ఇంద్రచాపంలో అగుపించిన రంగులన్నీ కరిగి కరిగిపోతూ కనుమరుగవుతాయ్..

ఇంక జీవితాంతం కురిసేది మీ కన్నీళ్లే!"

"....."

శాన్వి తల్లి ఒళ్లో ఉన్నా ఇంకా వెక్కిపడుతూనే ఉంది.

'ఇలాంటప్పుడే కదా కన్నవాళ్లం బిడ్డల పొరపాట్లో, తప్పులో అనునయంగా అడిగి క్షమించి, దారిచూపాలి. పెద్దవాళ్లం కూడా ఆవేశపడితే... పిల్లలు తీసుకునే తీవ్రమైన తొందరపాటు నిర్ణయాలతో జీవితాంతం కుమిలి పోవాలి' మనసులో అనుకుంది రేవతి.

"నీ దగ్గరున్న వాడి నంబర్, ఉంటే ఫొటో ఇవ్వు. తెల్లారాక నేను డాడీకి నెమ్మదిగా చెబుతాను... పోలీస్ కంప్లయింటా.. ఏంటి అనేది మేము చూసు కుంటాం"

"....."

"పసిపిల్లలప్పుడు కాపాడుకోవాల్సింది పోయి, మిమ్మల్ని ఈ వయసులో ఇలాంటి అంతర్జాల ఆకర్షణల నుండి కాపాడటమే కన్నవాళ్లకు కష్టంగా మారింది. సరే, ఇంక నువు మంచినీళ్ల తాగిపడుకో" పక్కనున్న మంచినీళ్ల బాటిల్ అందిస్తూ చెప్పింది రేవతి. మౌనంగా తలూపి, తల్లి అందించిన మంచి నీళ్లు తాగింది. భారం దిగిపోయినట్లుగా తల్లిమీద ఒక చెయ్యేసుకుని పడుకుంది శాన్వి.

వచ్చేవారం కథ..

నారీ రక్షిత రక్షితః

- మంగు కృష్ణకుమారి

గళం విప్పిన గాయం

ఈ సెప్టెంబర్ 5న భారతదేశంలోను,కలకత్తా హైకోర్టు జోక్యంతో దాదాపు పది రోజులు ఆలస్యంగా పశ్చిమ బెంగాల్‌లోను విడుదలైన చిత్రం 'బెంగాల్ ఫైల్స్'. దర్శకుడు వివేక్ రంజన్ అగ్నిహోత్రి. ఆయన తలపెట్టిన చిత్రత్రయంలో ఇది మూడోది. మొదటిది తాష్కెంట్ ఫైల్స్, రెండు కశ్మీర్ ఫైల్స్. ఊహించినట్టే మొదటి రెండు చిత్రాల మాదిరిగానే ఇది కూడా దుమారం మధ్యనే థియేటర్లలో సాగుతోంది.

చారిత్రక వాస్తవాలు మౌనం దాల్చిన చోట సృజన గళం విప్పుతుంది. విప్పాలి కూడా. చరిత్ర ఉదారవాద వక్రీకరణకు, సెక్యులరిస్టు హింసకు గురైతే సృజనాత్మక ప్రక్రియలు జూలు విదల్చక తప్పదు. సృజనాత్మకంగా చెప్పినంతమాత్రాన వాటికి విశ్వసనీయత లేదనడం తొందరపాటు. మన దేశ చరిత్ర రచన మీద వామపక్షం, ఉదారవాదం జరిపిన రాజకీయం అందరికీ తెలుసు. 1948 జూలై నాటికి భారత్‌కు స్వాతంత్ర్యం రావలసి ఉండగా, 11 నెలలు ముందుకు జరిగింది. అదే మహా రక్తపాతానికి దారితీసింది. ప్రత్యక్ష చర్యకు ముస్లిం లీగ్ పిలుపునిస్తే, ముస్లిం మతోన్మాదులు రెచ్చిపోవడానికి వీలుగా నాటి బెంగాల్ ప్రధానమంత్రి సుహ్రావర్ది మొత్తం పోలీసు యంత్రాంగానికి సెలవు ప్రకటించాడు. కోల్‌కతా వీధులు, నవకాలీ (ఒక గ్రామం) సందులు రక్తంతో తడిశాయి. కోల్‌కతాలో గోపాల్ పాతా నాయకత్వంలో హిందువులు పైచేయి సాధిస్తే, నవకాలీలో ముస్లింలు అక్షరాలా హిందువులను చరిత్ర విస్తుపోయే తీరులో ఊచకోత కోశారు. 1946-47 నాటి ఆ హింసాత్మక ప్రవృత్తి, పాకిస్తాన్ మీద ప్రేమ బెంగాల్‌లోని కొందరు ముస్లింలలో ఇప్పటికీ రాజ్యమేలుతున్నాయని చెప్పడమే ఈ సినిమా ఉద్దేశం.

ఇందులో దర్శకుడు తీసుకున్న అంశాలు ఏవీ వక్రీకరణలు కావు. క్రియేటివ్ లిబర్టీ పేరుతో చారిత్రక ఘట్టాలను సత్యానికి సుదూరంగా నెట్టివేయడం, నమ్మిన రాజకీయ సిద్ధాంతానికి బానిసగా మలచడం ఇందులో ముమ్మాటికీ లేదు. చరిత్ర వర్తమానంతో మాట్లాడుతూ ఉంటుంది. గతకాలపు బెంగాల్ మతోన్మాదం ఇప్పుడు కూడా రంకెలు వేస్తోంది. తన అహింసా సిద్ధాంతం గాంధీజీని కూడా వెక్కిరించిందన్నదే దర్శకుడి వాదన. ఆయన సిద్ధాంతాన్ని అతిగా నమ్మి భంగపడ్డామన్న భావన నివురుగప్పిన నిప్పులా ఉందన్నది దర్శకుడి భావన. నాటి హత్యాకాండలో రెండు వర్గాలూ నష్టపోయాయి. కానీ ముస్లింలకు మాత్రమే సాంత్వన వచనాలు చాలు అనుకున్న నాయకుల మీద దర్శకుడికి నిరసన ఉంది. ఈ సాంత్వనను వారు(ముస్లింలు) వేరే విధంగా స్వీకరిస్తున్నారు. ఫలితమే, 2025 నాటికి హిందూ మెజారిటీ దేశంలో ముస్లిం ప్రధానమంత్రి కావాలన్న ఊహ. సెక్యులరిజం, ప్రజాస్వామ్యం అన్న భావనలలోని డొల్లతనాన్ని ఆ మాటలు చెబుతున్నాయి. మైనారిటీ హోదా అంటే లైంగిక అత్యాచారాలకీ, మెజారిటీలను నిరంతరం భయోత్పాతంలో ఉంచడానికీ లైసెన్స్ ఇవ్వడమా అని ప్రశ్నిస్తాడు దర్శకుడు. భారతదేశం వేరు, బెంగాల్ వేరు. అక్కడ రెండు రాజ్యాంగాలు. ఒకటి ప్రభుత్వానిది. రెండు ముస్లింలది. ఈ రాజ్యాంగం విస్తరిస్తున్నది కూడా. మరి సెక్యులరిజం స్థానం ఎక్కడ? అందుకే బెంగాల్ మరొక కశ్మీర్ కానున్నదా అంటూ ప్రశ్నించాడు.



వివేక్ అగ్నిహోత్రి

గుడ్డెద్దు చేలో పడినట్టు సినిమాను నమీక్షించిన వారు ఆత్మ పరిశీలన చేసుకోవాలి. దర్శకుడు వాస్తవాన్ని చూపెట్టే ప్రయత్నమే చేశాడని చెప్పడానికి సాక్ష్యం కావాలంటే నాటి ముస్లింలీగ్ ప్రత్యక్ష చర్య పిలుపునీ, నేటి పీఎఫ్ఐ ప్రణాళికలనూ కలిపి చూడవచ్చు. ఎవరు ఎన్ని విమర్శలైనా చేయవచ్చు. కానీ కొన్ని వాస్తవ చారిత్రక ఘటనల

ఆధారంగా నిర్మించిన చిత్రమని దర్శకుడు ఇచ్చిన ప్రకటన అక్షరసత్యమే. ఇది డిస్‌క్లెయిమర్ కాదు. తన వాదన మీద తాను ఉన్నానని చేసిన ప్రకటన. ఒక ఉదాహరణ: కోల్‌కతా వీధుల నిండా శవాలు, రాబందులు పీక్కు తినడం, రిక్షాల మీద, తోపుడు బళ్ల మీద రక్తమోడుతున్న శవాల దృశ్యాలు ఇవన్నీ 'లైఫ్' పత్రిక (అమెరికా) ఫోటో జర్నలిస్ట్ మార్గరెట్ బౌర్కే వైట్ తీసిన ఫోటోలకు తెరరూపం. ఇది సమీక్షకులు తెలుసుకుంటే సబబు.

ప్రతిభావంతమైన చిత్రానువాదంతో దర్శకుడు ప్రేక్షకులను గతానికీ, వర్తమానానికీ నడుమ ఊయల ఊగిస్తాడు. గీతా మండల్ అనే గిరిజన మహిళా జర్నలిస్ట్ అపహరణ కేసు దర్యాప్తు చేయడానికి శివ్ అలోక్ పండిత్ అనే సీబీఐ అధికారి కోల్‌కతా వెళ్లడం, అక్కడి వాతావరణం, యావగింపు కలిగించే ముస్లిం బుజ్జగింపు, ముర్షిదాబాద్ 'మైనారిటీ' ఎమ్మెల్యే స్వైరవిహారం, సీబీఐ అధికారి ఎదురుగానే ఎమ్మెల్యే ఆ గీతను చంపి చూపించడం, అంతిమంగా ఎమ్మెల్యేని పండిత్ చంపడం ఇదీ కథ. గిరిజన యువతి తప్పిపోవడం, మైనారిటీ ఎమ్మెల్యే ఆగడాలు- వర్తమాన బెంగాల్ రాజకీయ, మత, సామాజిక పరిస్థితులకు అద్దం పట్టేవే. వీటికి నేపథ్యం 1946-1947 దేశ విభజన నాటి పరిస్థితులేనని చెప్పడమే ఈ సినిమాలోని ప్రత్యేకత. ఆ గతానికీ, ఈ వర్తమానానికీ వారధి భారతీ బెనర్జీ పాత్ర. 'బెంగాల్ ఫైల్స్' భారతీయ భారీ చిత్రాల సరసన చేరింది. 204 నిమిషాలు (దాదాపు మూడున్నర గంటలు). అయినా వీక్షకులను రెప్ప వాల్చనీయదు.

'ఈ రోజు మీ జీవితంలోనే అత్యంత ప్రధానమైన రోజు. చరిత్రాత్మకమైన ఘట్టంలో పాల్గొంటున్నారు' అంటూ అద్దం ముందు నిలబడి కోటు సరి చేసుకుంటున్న భారత ఆఖరి వైస్రాయ్ మౌంట్‌బాటన్ వద్దకు వచ్చి ఎడ్వినా మౌంట్‌బాటన్ చెప్పే సన్నివేశంతో చిత్రం ఆరంభించారు. ఆ రోజు జూన్ 3, 1947. ఆ రోజే కేవలం తొమ్మిదిమంది కలసి భారత్-పాక్ అనే రెండు దేశాలను సృష్టించారు. ఇది విభజన ముస్లిం లీగ్ ఆశయం. భారత జాతీయ కాంగ్రెస్ పెద్దల పదవీదాహం. నిజానికి స్వదేశీ సంస్థానాలకు ఏదో ఒక దేశంలో చేరే హక్కుతో పాటు, స్వతంత్రంగా ఉండే హక్కు ఇచ్చి పెద్ద విపత్తుకు కూడా నాడే బీజం వేశారు. అది ఈ చిత్రం పరిధిలో లేదు.

వైస్రాయ్ దగ్గర నుంచి కథ మళ్లీ వర్తమానం దగ్గరకు వస్తుంది. పశ్చిమ బెంగాల్ లోని ముర్షిదాబాద్ నియోజకవర్గంలో తప్పిపోయిన ఒక గిరిజన యువతి గీతా మాండల్ కేసు దర్యాప్తును సీబీఐ డైరెక్టర్ రాజ్‌నాథ్ సింగ్ (పునీత్ ఇసార్) యువ ఐపీఎస్ శివ అలోక్ పండిత్ (దర్శన్‌కుమార్) నెత్తిన పెడతాడు. ఇందులో ప్రధాన సాక్షి 'మా భారతి'. ఈమె ఇంటి నుంచే గీత మాయమవుతుంది. ఆ యువతిని అపహరించినవాళ్లు ముర్షిదాబాద్ ఎమ్మెల్యే సర్దార్ హుసేనీ (శాశ్వత్ చటర్జీ) మనుషులు. ఇది అందరికీ తెలుసు. కానీ దర్యాప్తుకు ఎవరూ సహకరించరు. పోలీస్ యంత్రాంగం సహాయ నిరాకరణ చేస్తుంది. 'ఇది భారత్ కాదు, బెంగాల్. ఇక్కడ రెండు రాజ్యాంగాలు. ఒకటి ప్రభుత్వానిది. రెండు ముస్లింలది. ఎమ్మెల్యే సర్దార్ హుసేనీ చెబితేనే ఎఫ్ఐఆర్ నమోదువుతుంది. మీరు చూసీ చూడనట్టు వదిలేయండి' అని కింది స్థాయి పోలీసులు శివ్‌కు ఉచిత సలహా ఇస్తారు. అదే మంచిది అంటూ మతిస్థిమితం లేని ఓ పాత్ర- చతుర్ (మిథున్ చక్రవర్తి) ఇక్కడ ప్రవేశిస్తుంది. చతుర్ గతంలో ఏదో కేసు దర్యాప్తు చేయ సాహసిస్తే నాలుకతో పాటు మర్మాయవం కూడా కోసేశారు. దర్యాప్తులోనే మా భారతి ద్వారా అటు చారిత్రక ఘటనలు, ఇటు వర్తమాన ఘటనలు ఆవిష్కృతమవుతూ ఉంటాయి.



ఈ చిత్రంలోని చాలా చారిత్రక ఘట్టాలు జనసామాన్యంలో లేవు. అయినంత మాత్రాన వాటి ఉనికిని ప్రశ్నించడమంటే, వక్రీకరణ అని తీర్పు చెప్పడమంటే అజ్ఞానాన్ని ప్రదర్శించుకోవడమే. ఈ చిత్రాన్ని విమర్శించిన చాలామందిలో ఇదే కనిపించింది. ఏమిటా వాస్తవ చారిత్రక ఘట్టాలు! క్విట్ ఇండియా ఉద్యమ ప్రకటనతోనే గాంధీజీ, ఇతర ముఖ్యనేతలను బ్రిటిష్ ప్రభుత్వం అరెస్టు చేసింది. గాంధీ, సరోజినీనాయుడు, నెహ్రూ వంటి వారిని ఆగాఖాన్ భవన్‌లో ఉంచింది. అక్కడే గాంధీ తీవ్ర అస్వస్థులయ్యారు. 1944లో ఆయనను విడుదల చేశారు. అప్పుడే రంజాన్ మాసంలో జిన్నా-గాంధీ చర్చలు బొంబాయిలోని జిన్నా భవంతిలో 19 రోజులు జరిగాయి. దారుణంగా విఫలమయ్యాయి. 1940 కరాచీ ముస్లిం లీగ్ సమావేశం తరువాత జరిగిన ఈ చర్చలలో జిన్నా పరిపూర్ణమైన మతోన్మాదిగా, వేర్పాటువాదిగా కనిపిస్తాడు. ద్విజాతి సిద్ధాంతాన్ని నిష్కర్షగా వినిపించాడు జిన్నా. మీరు గతంలో హిందువులే మనందరి రక్తం ఒక్కటే అని గాంధీ అన్నారు (ఆ చర్చలను లీగ్ పుస్తకరూపంలో ఆనాడే వెలువరించింది). దేశ విభజనను ఆమోదిస్తూ కేబినెట్ మిషన్ చేసిన సిఫారసులను మొదట ఆమోదించిన జిన్నా, లీగ్‌కు లాభసాటి కాదన్న ఉద్దేశంతో పార్టీ ఒత్తిడి మేరకు వెనక్కి తీసుకున్నాడు. ఇంగ్లండ్ భారత్‌ను వీడి వెళ్లడం ఖాయమైంది. కానీ అది హిందూ భారత్ అవుతుందన్నదే ముస్లిం లీగ్ అభిప్రాయం. అందుకే ముస్లిం లీగ్ ఆశయం మేరకు పాకిస్తాన్ ఏర్పాటు అన్న డిమాండ్‌కు అనుగుణంగా జూలై, 1946 బొంబాయి నుంచి జిన్నా ప్రత్యక్షచర్యకు పిలుపునిచ్చాడు. అంటే హర్తాళ్. ఆర్థిక కార్యకలాపాల దిగ్బంధన. ఆగస్ట్ 16, 1946న దీనిని అమలు పరిచారు. కానీ హర్తాళ్‌ను హత్యాకాండగా మలిచాడు బెంగాల్ ప్రధానమంత్రి సుహ్రావర్ది. పోలీస్ శాఖకు సామూహిక సెలవు ప్రకటించాడు. దీనిని ముందే పసిగట్టినవాడు గోపాల్ పాఠా. దుర్గాదేవి భక్తుడైన గోపాల్‌కు పెద్ద తాలింఖానా, అనుచరులు ఉండేవారు. ముస్లిం మతోన్మాదులను నివారించగలిగారు. ముస్లింలే ఎక్కువ మంది చనిపోయారు. దీనికి ప్రతీకారమే నవకాలి హత్యాకాండ. దీనికి బలైన వారే భారతీ బెనర్జీ తండ్రి, తల్లి. భారతిని మాత్రం అమర్‌జీత్ అరోరా (ఏకలవ్య సూద్/రెండో ప్రపంచ యుద్ధంలో సైనికుడు) రక్షిస్తాడు. చివరికి అతడు కూడా ముస్లిం గూండాల చేతిలో దారుణంగా చనిపోతాడు. నవకాలి హత్యలన్నీ గులామ్ సర్వార్ హుసేనీ (నమాశి చక్రవర్తి) చేయించాడు. పీర్ ఆఫ్ దాయిరా షరీఫ్‌గా పనిచేశాడు. ఇది కూడా వాస్తవికమైన పాత్రే. ఇక దేశ విభజనను మరునాడు ఆమోదిస్తారనగా జూన్ 2, 1947న వైస్రాయ్ దగ్గరకు వచ్చిన గాంధీజీ తాను మౌనవ్రతంలో ఉన్నాను

కాబట్టి మాట్లాడడం లేదని నిష్క్రమించడం కూడా వాస్తవమే. దేశం ముక్కలవుతున్నా ప్రతాలేమిటి అన్న ప్రశ్న మనను మనం వేసుకొనేటట్టు చేశాడు దర్శకుడు.

వర్తమాన ఘోరాలకు సంబంధించిన సన్ని వేశాలన్నీ ముక్కు సూటిగా చెప్పాలంటే సీపీఎం, టీఎంసీ కాలంలో జరిగినవే.

ఈ సినిమా ద్వారా అహింసా సిద్ధాంతాన్నీ, గాంధీమార్గాన్నీ దర్శకుడు బోనెక్కించదలిచాడని అర్థమవుతుంది. ముస్లిం లీగ్ మతోన్మాదం, ద్విజాతి సిద్ధాంతం, వేరే దేశం డిమాండ్ రోజురోజుకీ బలపడిన నేపథ్యంలో కూడా గాంధీజీ అహింసను అంతగా నమ్మడం ఆత్మహత్యా సదృశమన్న అభిప్రాయానికి ప్రేక్షకులను తీసుకు వచ్చే ప్రయత్నం చేశాడు దర్శకుడు. అది గతమే. కానీ అది వర్తమానాన్ని శాసిస్తున్నది కాబట్టి చర్చ తప్పదు. కోల్‌కతా హత్యాకాండ తరువాత నిరశనలో ఉన్న గాంధీజీ ముందు ఆయుధాలు విసర్జించే పని మొదలవుతుంది. గోపాల్ పాతా కూడా వస్తాడు. నా సోదరీమణులు, మాతృమూర్తులు అత్యాచారాలకు గురి అవుతుంటే, వారిని రక్షించుకోవడానికి ఏ ఆయుధం ఉపయోగించాలి అని సూటిగా ప్రశ్నిస్తాడు. అంతటి రక్తపాతం నేపథ్యంలోను గాంధీజీ, నిరాహార దీక్షే ఆయుధం, ప్రతిఘటన కాదనే చెబుతారు. అయితే నా ఆయుధాన్ని నేను వదలడం లేదని గోపాల్ నిష్క్రమిస్తాడు. ఒక మహిళ గాంధీజీ వద్దకు వచ్చి కొడుకులు, భర్త, గర్భిణి అయిన కూతురు అంతా చనిపోయారని ఇదే మిగిలిందంటూ ఒక ఎముక పడేసి విలపిస్తూ చెబుతుంది. అంతిమంగా గాంధీజీ కూడా తల బాదుకుంటాడు. గులాం సర్వార్ హుసేనీని చంపే అవకాశం నవకాలీ హత్యాకాండ సమయంలో భారతీ బెనర్జీకి వస్తుంది. విద్యార్థి దశలో గవర్నర్ మీద కూడా కాల్పులు జరిపిన భారతి సర్వార్ హుస్సేనీ పీక మీద పెట్టిన కత్తిని కూడా కింద పడేస్తుంది. గవర్నర్‌పై కాల్పుల తరువాత గాంధీజీని కలిసిన ఫలితం. ఆమె తండ్రి వేరే హత్య కేసులో గులాం సర్వార్‌కు బెయిల్ ఇస్తాడు. సెక్యులరిజం, ప్రజాస్వామ్యం గురించి చెబుతాడు. ప్రత్యక్ష దినం హింసలో సెక్యులరిజం, ప్రజాస్వామ్యం వంటి సిద్ధాంతాలను వెక్కిరిస్తూనే గులాం ఆయనను భయానకంగా చంపుతాడు. ఆరోజు నేను గులాంను వదిలిపెట్టకుండా ఉండవలసింది అంటుంది భారతి, చిట్టచివరి దృశ్యాలలో. తనకో తుపాకీ కావాలని కూడా కోరుతుంది. అంతేకాదు, జిన్నా నూరిపోసిన ద్విజాతి సిద్ధాంతమే తరం తరువాత తరం అన్నట్టు చాలా మంది ముస్లింల మెదళ్లలో ఎలా ప్రవహిస్తూ వస్తున్నదో కూడా చెప్పదలిచాడు దర్శకుడు. విభజన కాలం నాడు హింసకు నాయకత్వం వహించిన ముస్లిం మతోన్మాది పేరును గులామ్ సర్వార్ హుసేనీగా, నేటి పరిస్థితులలో అన్ని రాజ్యాంగ వ్యవస్థల పరిహసిస్తూ, కొత్త ప్రత్యక్షదినం కోసం నిత్యం ఎదురు చూసే పాత్రకు సర్దార్ హుసేనీ అని పెట్టడంలో అంతరార్థం అదే అనిపిస్తుంది. ఇందులో జాతీయ చిహ్నం నాలుగు సింహాలకు ఒక వ్యాఖ్యానం చెప్పాడు దర్శకుడు. అది మిథున్ చక్రవర్తి వంటి నటుడి ద్వారా చెప్పించడమే ప్రత్యేక ఆకర్షణ. మొదట కనిపించే మూడు సింహాలు న్యాయం, ధర్మం, సత్యానికి ప్రతీకలు. నిజమే. కానీ నాలుగో సింహం? అదే ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తుంది. కానీ అది ఇప్పటి వరకు కనిపించడం లేదు అంటాడు మతిలేని చతుర్.

శివ పండిత్ సర్దార్ హుసేనీని ప్రశ్నించడానికి వెళతాడు. అతడికి ఒక కొడుకు ఉంటాడు. భవిష్యత్తులో నీవేమి కావాలని అనుకుంటాన్నావో అంకుల్‌కి (శివపండిత్‌కి) చెప్పమంటాడు సర్దార్. భావి ప్రధాని అంటాడు ఆ పిల్లవాడు. 2050 నాటికి మెజారిటీ హిందూ దేశానికి ఒక మైనారిటీ ముస్లిం ప్రధాని అవుతాడు తెలుసా అంటాడు. అప్పుడు సీబీఐ అధిపతి నుంచి అక్కడికి వెళ్లినందుకు శివ్‌ను క్షమాపణలు చెప్పమంటాడు. రాజీపడినట్టు నటించి రెండోసారి వెళ్లినప్పుడు గీతను తన ఎదురుగా నడిపించాడు సర్దార్. ఆమె శరీరం చిత్రహింసల పాలై ఉంది. శివ్ ఎదురుగానే కాల్చి చంపిస్తాడు. ఆ తరువాత సర్దార్‌ను శివ చంపేస్తాడు. ఎవరు ఎన్నయినా విమర్శించవచ్చు. కానీ బెంగాల్ ఫైల్స్ ఒక లోతైన గాయానికి గళమిచ్చిందని, తన బాధను బిగ్గరగా చెప్పే అవకాశం ఇచ్చిందని చెప్పక తప్పదు.

ఇటీవలి సంవత్సరాలలో వచ్చిన కొన్ని సినిమాలను చూస్తే కాంగ్రెస్, సెక్యులరిస్టులు, ఉదార వాదులు ఎందుకు ఉలికిపడుతున్నారో అర్థం కాదు. కశ్మీర్ ఫైల్స్, కేరళ స్టోరీ, రజాకార్, ఆర్టికల్ 370 చిత్రాలకు చాలా గడబిడ చేశారు. ఇవన్నీ జాతి ఆత్మకు తగిలిన గాయాలే ఇతివృత్తాలుగా తెరకు ఎక్కిన చారిత్రక వాస్తవాలు. ఆ ఇతివృత్తాలన్నీ ఇవాళ్టి తరాలకు తెలియకూడదన్నదే వాళ్ల ఆశయం మనుకోవాలా?

బెంగాల్ ఫైల్స్ ఇతివృత్తం, దాని మీద ఉన్న వివాదం, ఉద్వేగాల వల్ల కొన్ని విషయాలు మరుగున పడ్డాయి. అందులో ప్రధానమైనది– ఈ సినిమాలో నటించిన వారి ప్రతిభ. వారు పాత్రలకు చేసిన గొప్ప న్యాయం. పల్లవీ జోషి, సిమ్రత్ కౌర్ రాంధ్వా, మిథున్ చక్రవర్తి, అనుపమ్ ఖేర్, దర్శన్‌కుమార్, జిన్నా గోపాల్ పాతా, రాయ్‌చౌధురి పాత్రధారులు కూడా విశేషమైన ప్రతిభ చూపారు. గతాన్నీ, వర్తమానాన్నీ కలుపుతూ వివేక్ అగ్నిహోత్రి రూపొందించుకున్న చిత్రానువాదం ప్రశంసనీయం.అది కెమేరాతో చెప్పాలి కాబట్టి, నాటి నేటి నేతల, వైతాళికుల ఫోటోలతో రెండు పార్శ్వాలను చక్కగా ప్రతిబింబించారు. అత్తర్‌సింగ్ సయానీ ఫోటోగ్రఫీ ఇంకా బాగుండవచ్చునని అనిపిస్తుంది. రోహిత్ శర్మ అద్దిన బెంగాలీ సంగీత స్వరాలు చక్కనివే.

పల్లవీ జోషి (తల్లి భారతీ బెనర్జీ), సిమ్రత్ కౌర్ రాంధ్వా (యువ భారతీ బెనర్జీ), దర్శన్‌కుమార్ (శివ్ అలోక్ పండిత్), మిథున్ చక్రవర్తి (మతి స్థిమితం లేని చతుర్), అనుపమ్ ఖేర్ (గాంధీజీ), శాశ్వత్ చటర్జీ (సర్దార్ హుసేనీ), ఏకలవ్య సూద్ (అమర్‌జీత్ అరోరా), గులామ్ సర్వార్ హుసేనీ (నమాశి చక్రవర్తి), రాజేశ్ ఖెరా (జిన్నా), పునీత్ ఇసార్ (రాజనాథ్ సింగ్, సీబీఐ డెరెక్టర్), ప్రియాంశు బెనర్జీ(జస్టిన్ బెనర్జీ), దివ్యేందు భట్టాచార్య (రాజేంద్రలాల్ రాయ్‌చౌధురి), సౌరవ్‌దాస్ (గోపాల్ పాతా), మోహన్ కపూర్ (సుహ్రావర్ది), అనుభ అరోరా (గౌరి), పాలోమీ ఘోష్ (జర్నలిస్ట్ సీత).

– కల్పన



భాగం-4

శ్రీరాముడు బోధించిన రాజనీతి

భారతీయులకు రాజనీతి శాస్త్రమే లేదని పాశ్చాత్య తత్వవేత్తలు భావించారు. అది తప్పు. మనకు రాజనీతిని బోధించే అనేక శాస్త్రాలున్నాయి. వాటిని గురించి లోతైన వివరాలలోకి వెళ్లేముందు.. మన రాజనీతికి ఆదర్శప్రాయమైన శ్రీరాముని రాజ్యం ఎలా ఉండేదన్న సంగతి స్థూలంగా తెలుసుకుందాం. శ్రీరాముడు ఎటువంటి రాజధర్మాలను అనుసరించాడో ఆయనే స్వయంగా పేర్కొన్న సంగతులను నెమరేసుకుందాం.

న రామసదృశో రాజా పృథ్వ్యాం నీతిమా నభూత్
– శుక్రనీతి సారం 5.47

శ్రీరామునితో సమానుడు, నీతిమంతుడు అయిన రాజు ఈ పృథ్విపై అంతకు ముందు లేడు. ఆ తరువాత కూడా పుట్టడం సాధ్యం కాదు. రామాయణంలో రాజధర్మాలను ప్రస్తావించే అనేక ఘట్టాలున్నాయి. వాటిలో శ్రీరాముడు లక్ష్మణునికి బోధించిన రాజనీతిసారం ఇది.

రాజైనవాడు తనకు లభిస్తున్న సుఖభోగాలతో తృప్తి చెందాలి. జనులను పీడించకూడదు. అలా బాధల పాలైతే,దుఃఖజీవనులైన రాజుపై తిరగుబాటు చేస్తారు. అతడిని వినాశమెనర్చుతారు.

ఏ ప్రాణినీ హింసించరాదు. కష్టపెట్టరాదు. మధుర వచనాలు పలకాలి. సత్యభాషణం చేయాలి. అంతరంగంలోనూ, బాహ్యంలోనూ పవిత్రంగా ఉండాలి. శౌచాన్ని చక్కగా పాటించాలి. దీనుల కష్టం పోగొట్టాలి. దయాభావంతో మెలగాలి. క్షమ...అంటే ఇతరులను నిందించడం వగైరా చేయరాదు. నాలుగు వర్ణాలు లేదా నాలుగు ఆశ్రమాల వారూ పాటించే దానిని సామాన్య ధర్మాలు అని చెబుతారు. రాజైనవాడు నాలుగు వర్ణాల ప్రజలనీ చక్కగా పాలించాలి. సదాచారాన్ని పాటించడంలో సంలగ్న మనస్కుడై ఉండాలి.

మధుర భాషణం, దీనులపట్ల దయ, దేశ-కాలాలను దృష్టిలో ఉంచుకుని... పాత్రులకు దానం ఇవ్వడం... ఇవన్నీ సత్పురుషులు పాటించే ఆచారాలు. ఇవన్నీ ప్రజా సంక్షేమాన్ని సాధనకు ఉపాయాలు. ఇవి లోకుల ప్రశంసలు అందుకుంటాయి. శ్రేష్ఠమైనవి. అభ్యుదయాన్ని, సత్ఫలితాలను కలగచేస్తాయి. కనుక వీటిని హితకారకాలుగా పేర్కొనాలి. ఈ శరీరం మానసిక చింతనలతోనూ, రోగాలతోనూ సతమవుతూ ఉంటుంది. ఇది నేడు కాకుంటే రేపైనా వినాశం కావడం నిశ్చయమే. అందువల్ల ఏ రాజూ శారీరక భోగాలను ఆశించి, ధర్మానికి విరుద్ధ పనులు చేయరాదు.

ఇతరులు చేసిన పనులను నిందించడం లేదా వాటిగురించి ఆలోచించడం కూడదు. తనదైన వర్ణానికి లేదా ఆశ్రమానికి అనురూపమైన ధర్మాన్ని నిరంతరం పాలించాలి. దీనుల పట్ల దయ చూపాలి. సమస్త లోకవ్యవహారాలలోనూ సర్వులకూ ప్రీతి కలిగించేలా తియ్యనైన పలుకులు పలకాలి. తన అనన్య మిత్రులకు ఉపకారం చేసేందుకు ప్రాణాలైనా సమర్పించడానికి సిద్ధంగా ఉండాలి.

తన గృహానికి విచ్చేసిన మిత్రులను,సజ్జనులను హృదయపూర్తిగా ఆహ్వానించాలి. వారికి ప్రీతి కలిగేలా కానుకలను సమర్పించాలి. వారిపై ఆదరాన్ని ప్రకటించాలి. వారితో అత్యంత స్నేహంతో మెలగాలి. వారు ఏదైనా కటువుగా ప్రవర్తించినా, కఠోర వచనాలు పలికినా సహనం చూపాలి. తనదైన హోదా, ఐశ్వర్యాలను తలచుకుని నిర్వికారంగా ఉండాలి. దర్పాన్ని ప్రదర్శించకూడదు.

ఇతరుల అభ్యుదయానికి మనస్సులో ఈర్ష్య, అసూయ చెందకూడదు. ఇతరులకు కష్టం కలిగించే మాటలు మాట్లాడకూడదు. అధిక వాచాలత మంచిది కాదు. తగినంతా మౌనవ్రతాన్ని పాటించాలి. బంధుజనులతో చక్కని సంబంధాలు కలిగి ఉండాలి. సజ్జనులతోనూ, సూటియైన సంపూర్ణ భావాలతోనూ గౌరవించాలి. వారి మనోభీష్టాన్ని అనుసరించి, కార్యాలు నెరవేర్చాలి. ఇవన్నీ మహాత్ములు అనుసరించే మార్గం.

కురిసే మేఘం అందరికీ సమానంగా నీటిని అందించినట్లుగా... రాజైనవాడు సమస్త ప్రాణులకు జీవనాధారం కల్పించాలి. ఎవరి వల్ల, ఏయే సాధనల చేత తాను ఈ స్థాయికి చేరగలిగాడో... అట్టివారిని ఆప్తులుగా భావించాలి. వారికి ఎల్లప్పుడూ ఏం కావాలో కనిపెట్టుకుని ఉండాలి. సూర్యుడు తన కిరణాల ద్వారా భూమి నుంచి జలాన్ని స్వీకరించే విధంగా రాజు తాను నియమించుకున్న వ్యక్తుల ద్వారా ధనసేకరణ చేయాలి.

సామం, దానం, భేదం,దండం, ఉపేక్ష, ఇంద్రజాలం, మాయ... ఈ ఏడింటినీ ఉపాయాలని పిలుస్తారు. శత్రువులపై పైచేయి సాధించడానికి వీటిని ప్రయోగించాలి. ఈ ఉపాయాల ద్వారా శత్రువు వశీభూతుడవుతాడు.

ఈ ధర్మాలను ఎరిగిన శ్రీరాముని పాలన ఎలా సాగిందో ఆనంద రామాయణం చక్కగా వివరించింది. ధర్మతత్త్వాన్ని బాగుగా ఎరిగినవాడు, ప్రతాపశాలి అయిన సీతారాముడు,ధర్మమార్గం నుంచి నడలిపోకుండా, నిర్నిద్రభావంతో రాజ్యాన్ని శాంతియుతంగా పాలించాడు. రామరాజ్యాన్ని ధర్మరాజ్యమని చెప్పేవారు. ధర్మ-అధర్మాలను చక్కగా వివేచన చేసి రాజ్యపాలన నిర్వహించాడు. అయోగ్యులైన ఉద్యోగులకు రాజదండాన్ని అందించే వారు కాదు.వారు శత్రువుల హృదయాలను, కన్నులను సూర్యుని వేడిమివలె మండించేవారు. మిత్రులు, స్వజనుల కన్నులకూ హృదయాలకూ చంద్రునివలె చల్లదనాన్ని పంచేవారు. శ్రీరామ పాలనలో అయోధ్యా ప్రజలు సంపన్నులై, నాగరికులై ఉండేవారు. వృక్షాలు ఫల,పుష్పాదులను సమృద్ధిగా అందించేవి. వాటివల్ల ప్రజలు సుఖజీవనం సాగించే వారు. ఆయన రాజ్యంలో ప్రజలందరూ ఏకపత్నీ వ్రతులై ఉండేవారు. ఏ ఒక్క స్త్రీకూడా పతివ్రతా ధర్మాలకు దూరంగా ఉండేది కాదు. ఆ విధంగా రామరాజ్యం మంగళమయంగా, ఏ రాజ్యంతోనూ పోలిక చెప్పడానికి వీలులేనిదై, రామరాజ్యమనే పేరును స్మరించగానే శుభాలను కలిగించేదై ఉండేది.

(వచ్చేవారం : దర్శనము – తత్త్వము)

హిందీమూలం : కరపాత్రీ స్వామి
అనువక్త : నేతి సూర్యనారాయణశర్మ

ఇతిహాస క్రీడ విలువిద్యలో భారత్ అసాధారణ విజయాలతో ప్రపంచ మేటి జట్లలో ఒకటిగా తన ప్రత్యేకతను కాపాడుకొంటూ వస్తోంది. పురుషుల, మహిళల టీమ్, వ్యక్తిగత విభాగాలలో మన క్రీడాకారులు గత మూడు ప్రపంచకప్ పోటీలలోనూ నిలకడగా రాణించి దేశానికే గర్వకారణంగా నిలిచారు.

భారత విలువిద్య జట్ల సరికొత్త చరిత్ర!

విలువిద్య పోటీలో భారత జోరు కొనసాగుతోంది. ప్రపంచ అత్యుత్తమ జట్లలో ఒకటిగా తన ఆధిపత్యాన్ని నిరూపించుకొంటోంది. పురుషుల, మహిళల టీమ్, వ్యక్తిగత అంశాలతోపాటు మిక్సిడ్ టీమ్ విభాగాలలోనూ భారత్ ఏదో ఒక పతకం గెలుచుకొంటూ ఈ క్రీడ ఖ్యాతిని ఇనుమడింప చేస్తోంది.

15 దేశాలతో భారత్ పోటీ....

దక్షిణ కొరియాలోని గ్వాంగ్జు వేదికగా ముగిసిన ప్రపంచ విలువిద్య పోటీలు-2025లో 4వ ర్యాంక్ జట్టుగా ఫ్రాన్స్‌తో కలసి పోటీకి దిగిన భారత్ ఒక్కో స్వర్ణ, రజత పతకాలు సాధించి పతకాల పట్టికలో సంయుక్త నాలుగో స్థానంలో నిలిచింది.ప్రపంచ నంబర్ వన్, ఆతిథ్య దక్షిణ కొరియా, మెక్సికో, స్పెయిన్, ఫ్రాన్స్, చైనీస్ తైపీ, నెదర్లాండ్స్, అమెరికా, జపాన్, బ్రెజిల్, చైనా, డెన్మార్క్, ఎల్ సాల్వడోర్, కొలంబియా, కజకిస్థాన్, స్లవేనియా దేశాలతో భారత్ పురుషుల, మహిళల విభాగాలలో తలపడి సత్తా చాటుకోగలిగింది.

భారత పురుషులజట్టు కాంపౌండ్ విభాగంలో బంగారు పతకంతో సరికొత్త చరిత్ర సృష్టిస్తే..మిక్సిడ్ టీమ్ విభాగంలో తెలుగుతేజం జ్యోతి వెన్నం- రిషభ్ యాదవ్ జోడీ రజతతో పతకాల సంఖ్యను రెండుకు పెంచగలిగారు.

ప్రపంచ విలువిద్యకే అగ్రశ్రేణి జట్టుగా పేరున్న దక్షిణ కొరియా రెండు స్వర్ణ, ఒక రజత, 4 కాంస్యాలు సహా మొత్తం 7 పతకాలతో మొదటి స్థానంలో, మెక్సికో 2 స్వర్ణ, ఒక రజతంతో రెండోస్థానంలో నిలిచింది. ఫ్రాన్స్, భారతజట్లు చెరో స్వర్ణ, రజత పతకాలతో సంయుక్త నాలుగోస్థానం దక్కించుకోగలిగాయి.

ప్రపంచ పోటీలలో భాగంగా పురుషుల, మహిళలకు రికర్వ్, కాంపౌండ్ విభాగాలతో పాటు.. మిక్సిడ్ టీమ్ విభాగంలోనూ పోటీలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అయితే..గత రెండు ప్రపంచకప్ టోర్నీలలోనూ భారత్ కాంపౌండ్ కంటే రికర్వ్ విభాగంలోనూ అత్యధిక పతకాలు గెలుచుకుంది.

బెర్లిన్ వేదికగా జరిగిన 2023 పోటీలలో మనదేశం తొలిసారిగా మూడు పతకాలు సాధించి ప్రపంచ అత్యుత్తమ జట్లలోఒకటిగా నిలిచింది. మహిళల కాంపౌండ్ టీమ్ విభాగంలో బంగారు, పురుషుల, మహిళల వ్యక్తిగత కాంపౌండ్ విభాగంలో జంట స్వర్ణాలను భారత ఆర్చర్లు సొంతం చేసుకోగలిగారు.

మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో భారత్‌కు ఆర్చర్ ఆదితీ గోపీచంద్ స్వామి (17) బంగారు పతకం సొంతం చేసుకొంది. ప్రపంచ విలువిద్య చరిత్రలోనే అత్యంత పిన్నవయసులో విశ్వవిజేతగా నిలిచిన ఆర్చర్‌గా రికార్డు నెలకొల్పింది.

పురుషుల వ్యక్తిగత విభాగంలో భారత్‌కే చెందిన ఓజాస్ ప్రవీణ్ డియోటేల్ పోలెండ్‌కు చెందిన లూకాస్‌ను ఒకే ఒక్కపాయింట్ తేడాతో (150-149) ఓడించి బంగారు పతకం అందుకొన్నాడు.ప్రపంచ విలువిద్య పోటీల పురుషుల వ్యక్తిగత విభాగంలో విజేతగా నిలిచిన తొలి భారత ఆర్చర్ ఘనతను సాధించాడు.

మహిళల కాంపౌండ్ టీమ్ విభాగంలో పర్నీత్ కౌర్, వెన్నెం జ్యోతి, ఆదితిలతో కూడిన భారతజట్టు ప్రపంచ విజేతగా నిలిచింది. బంగారు పతకం కోసం జరిగిన పోరులో మెక్సికోకు చెందిన ఆండ్రియా బెసీరా, డాఫ్నీ క్వింటెరో, అనా సోఫియాలతో కూడిన జట్టును 235-229 పాయింట్లతో చిత్తు చేసి తొలిసారిగా ప్రపంచ టైటిల్ ను కైవసం చేసుకోగలిగింది.జ్యోతి వెన్నం మహిళల టీమ్, వ్యక్తిగత విభాగాలలో రెండు పతకాలు సాధించడం ద్వారా ఆంధ్రప్రదేశ్ కే గర్వకారణంగా నిలిచింది.

మహిళల టీమ్ విభాగంలో పర్నీత్ కౌర్, ఆదితీలతో కూడిన జట్టుతో పాల్గొన్న జ్యోతి స్వర్ణ పతకంతో పాటు ప్రపంచ టైటిల్ అందుకొంది.

మహిళల వ్యక్తిగత విభాగం సెమీస్ లో ఆదితీ చేతిలో ఓడినా..చివరకు కాంస్యపతకంతో సరిపెట్టుకొంది. విజయవాడ నగరానికి చెందిన జ్యోతి గత కొద్ది సంవత్సరాలుగా అంతర్జాతీయ విలువిద్య పోటీలలో భారత్ కు ఏదో ఒక పతకం సాధించి పెడుతూనే ఉంది. 2024 ప్రపంచ విలువిద్య పోటీల కాంపౌండ్ మహిళల టీమ్ విభాగంలో స్వర్ణపతకం సాధించిన భారత్..పురుషుల రికర్వ్ టీమ్ విభాగంలోనూ ఫైనల్స్ చేరడం ద్వారా మరో పతకం అందుకొంది.

ప్రస్తుత ప్రపంచకప్ లో సైతం భారత్ ఆదేజోరు కొనసాగించగలిగింది. మహిళల టీమ్ విభాగంలో గత ఎనిమిదేళ్లుగా ఏదో ఒక పతకం గెలుచుకొంటూ వచ్చిన భారత్ తొలిసారిగా ప్రస్తుత ప్రపంచకప్ లోనే విఫలమైనా..పురుషుల కాంపౌండ్ టీమ్ ఫైనల్లో విజయంతో ఆలోటును పూడ్చుకోగలిగింది.

రిషభ్ యాదవ్, అమన్ సెయినీ, ప్రథమేశ్ ఫ్యూజీలతో కూడిన భారతజట్టు బంగారు పతకం పోరులో ఫ్రాన్స్ పై 235- 233 పాయింట్లతో సంచలన విజయం సాధించడం ద్వారా తొలిసారిగా కాంపౌండ్ పురుషుల టీమ్ స్వర్ణపతకం సాధించగలిగింది.

ప్రపంచ విలువిద్య పోటీలలో ఏడోసారి పాల్గొన్న తొలి తెలుగు, భారత క్రీడాకారిణిగా విజయవాడ ఆర్చర్ జ్యోతి వెన్నం సరికొత్త రికార్డు నెలకొల్పింది. మిక్సిడ్ టీమ్ విభాగంలో రిషభ్ యాదవ్ తో జంటగా బంగారు పతకం వేటకు దిగిన జ్యోతి చివరకు రజత పతకంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

గత ఏడు ప్రపంచకప్ టోర్నీలలోనూ వ్యక్తిగత లేదా టీమ్ అంశాలలో ... జ్యోతి ఏదో ఒక పతకం సాధించడం ద్వారా తెలుగు రాష్ట్రాలకు మాత్రమే కాదు భారత విలువిద్యకే గర్వకారణంగా నిలిచింది.

ప్రస్తుత ప్రపంచకప్ రజత పతకంతో 2028 లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్ లో పాల్గొనే అవకాశాలను మెరుగు పరచుకొంది. ప్రస్తుత ఈ ప్రపంచకప్‌లో జంట పతకాలతో..

కృష్ణారావు చాప్పిరపు
సీనియర్ జర్నలిస్ట్, 84668 64969

సోదర భావంతో కలిసి పనిచేయాలి

విజయవాడ : 1950లో భారత రాజ్యాంగం అమలు సమయంలో 28 రాష్ట్రాల్లో 1,109 ఎస్సీ కులాలు కేంద్రజాబితాలో ఉన్నాయని సామాజిక సమరసత అఖిల భారత సంయోజకులు శ్యామ్‌ప్రసాద్ అన్నారు. సామాజిక సమరసత వేదిక,ఎస్సీఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో సెప్టెంబర్ 13న విజయవాడ అంబేడ్కర్ భవనంలో జరిగిన ఎస్సీ కులాల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్యవక్తగా పాల్గొని ప్రసంగించారు. పూజ్య శివస్వామి ఆశీః ప్రసంగం చేశారు.

శ్యామ్‌ప్రసాద్ ప్రసంగిస్తూ మన ఆంధ్రప్రదేశ్‌లో 59 కులాలు ఉన్నాయి, 75 సం. స్వాతంత్ర్యభారతంలో మన అందరి ప్రగతి సమానంగా లేదు. అందరం సోదర భావంతో కలసి పని చేయాలి, దీనివల్ల మన అందరి అభివృద్ధికి, దేశ ప్రగతికి ఎంతో మేలు కలుగుతుందని తెలియజేశారు.

ఈ సమావేశంలో 13 కులాల నుండి 153(మహిళలు 14)మంది పాల్గొన్నారు. ఎస్సీ క్రీడాకారులకు, ప్రతి కులంనుండి ఒక కులపెద్దకు సన్మానం చేశారు.

ఈ కార్యక్రమంలో సమరసతా సమరసత ఫౌండేషన్ అధ్యక్షులు విష్ణువు, ఎస్సీఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక రాష్ట్ర అధ్యక్షులు గరికముక్కు సుబ్బయ్య, కార్యదర్శి జాషువ, సమరసత రాష్ట్ర సహ కన్వీనర్ రాజరామచంద్ర పాల్గొన్నారు.

కేశవ స్మృతి సంవర్ధన సమితి శిక్షణ- ఉపాధి

భాగ్యనగర్ : సమాజహితం కోసం కేశవ స్మృతి సంవర్ధన సమితి అనేక సేవా కార్యక్రమాలు, ఉపాధికార్యక్రమాలు నిర్వహిస్తున్నది. అనేక వందల మంది ఇప్పటి వరకు సమితిద్వారా ఉపాధి పొందారు. వైద్యరంగం, విద్యారంగం, స్త్రీల

అభ్యున్నతి, యువతీయువకులకు మార్గనిర్దేశం, ఉద్యోగ కల్పన, మానసిక వత్తిడికి గురౌతున్న,అనేక సమస్యలు ఎదుర్కొంటున్న వారికి కౌన్సిలింగ్ ద్వారా ఉపశమనం కల్పించేందుకు ప్రయత్నం జరుగుతున్నది. ఈ సందర్భంగా సెప్టెంబర్ 12న బర్కత్‌పురాలోని కేశవనిలయంలో యువతకు స్వయంఉపాధి అందించేందుకు డిజిటల్ మార్కెటింగ్ శిక్షణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ (రిటైర్డ్) రంగాచార్యులు, ఆర్ఎస్ఎస్ తెలంగాణ పౌరసంబంధాల ప్రాంతప్రముఖ్ గుర్రంసంజీవరెడ్డి, సమితి ప్రధానకార్యదర్శి కె.బాలయ్య, కోశాధికారి రామచంద్ర, ప్రాంత వ్యవస్థాప్రముఖ్ తిరుమల్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు స్టీల్ ప్లేట్, గ్లాస్‌లు బహుకరణ

నిర్మల్ : నిర్మల్ జిల్లాలోని కుంటాల మండలం, అంబా అనే గ్రామంలో గ్రామ వికాస్ ఆధ్వర్యంలో జరిగే ఏ పండుగైన, ఇంట్లో జరిగే కార్యక్రమాలకైనా ప్లాస్టిక్ విస్తరాకులు వాడకుండా, అనారోగ్యం రాకుండా పర్యావరణ పరిరక్షణను కాపాడటంలో గ్రామంలోఉన్న ఉదారస్వభావులు లక్ష్మణమ్మ, సిఐ, లింగురాం ప్రవీణ్, ఎస్ఐ సిందే రాజశేఖర్, అటవీ బీట్ ఆఫీసర్ గడ్డం కమలాకర్ 300 స్టీల్ ప్లేట్లను, స్టీల్ గ్లాసులను గ్రామ వీడీసీకి బహుకరించారు. వీడీసీ, గ్రామ వికాసం జిల్లా సభ్యులు వీరిని ఘనంగా సత్కరించారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

భాగ్యనగర్ : సమాజంలో చట్టం దాని అమలు తీరు గురించి లోతైన అవగాహన ఉండాలని దిల్‌సుఖ్‌నగర్ భాగ్ సంఘచాలక్ ఏ.వెంకటేశ్వర రెడ్డి (రిటైర్డ్ జడ్జ్) అన్నారు. తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ లా కాలేజ్ ఫర్ ఉమెన్ ప్రిన్సిపల్ మానస ఆధ్వర్యంలో సెప్టెంబర్ 11న జరిగిన ఎల్బీనగర్ మాగ్నాజ్యూరిస్ లా ఎగ్జిబిషన్ -2025ను ఆయన ప్రారంభించి, మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ సరూర్‌నగర్ నగర సంఘచాలక్ మేకా లోకనాథం, అష్టలక్ష్మి నగర సంఘచాలక్ వివేకానందరెడ్డి, చైతన్యపురి నగర సంఘచాలక్ మణికొండ విజయ్‌కుమార్, కొండపాక రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

‘కలాంతో కాసేపు’ పుస్తకావిష్కరణ

విశాఖపట్టణం: భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం గొప్ప వైజ్ఞానిక శాస్త్రవేత్త అనీ, భారతదేశం మొట్టమొదటి స్వదేశీ ఉపగ్రహ ప్రయోగ వాహనాన్ని తయారు చెయ్యడానికి ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా ఆయన అందించిన కృషి అమోఘమని డాక్టర్ దుగ్గిరాల పల్లంరాజు అన్నారు. విశాఖపట్నంలోని అల్లూరి సీతా రామరాజు విజ్ఞాన కేంద్రంలో సెప్టెంబర్ 6, 2025 ప్రొఫెసర్ దుగ్గిరాల రాజకిశోర్ రచించిన ‘కలాంతో కాసేపు’ అనే పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న గ్లోబల్ సైంటిస్ట్, ఫిజికల్ రీసెర్చ్ లేబొరేటరీస్ (అహమ్మదాబాద్)లో సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ పల్లంరాజు పుస్తకావిష్కరణ చేశారు. డాక్టర్ అబ్దుల్ కలాం స్వయానా రచించిన 16 పుస్తకాలను అధ్యయనం చేసి, వివిధ విషయాలపై కలాంగారి అమూల్యమైన ఆలోచనలను తెలుగులో పుస్తకరూపంలో సంకలనం చేసేన రాజకిశోర్ కృషి ప్రశంసనీయమని కార్యక్రమానికి గౌరవ అతిథిగా

ప్రసంగిస్తున్నవారు : డాక్టర్ పల్లంరాజు, వేదికపై ఎడమ నుంచి: విశ్వగాయత్రీ శుభప్రద, ఆర్.బంగారురాజు, ప్రొఫెసర్ రాజాకిశోర్,డాక్టర్ పల్లంరాజు, డాక్టర్ మధుకుమార్, ప్రొఫెసర్ బాలమోహన్‌దాస్.

విచ్చేసిన డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలల కార్యదర్శి, కరెస్పాండెంట్ డాక్టర్ జి. మధుకుమార్ అన్నారు.

ఈస్ట్ పాయింట్ చిల్రన్స్ పార్క్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సభకు ఆర్. బంగారాజు అధ్యక్షత వహించగా, ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం పూర్వ ఉపకులపతి ప్రొఫెసర్ వి. బాలమోహన్ దాస్ విశిష్ట అతిథిగా విచ్చేశారు.

తలసేమియాతో జాగ్రత్తలు

కర్నూలు: సక్షం, డీఈఐసీ, ASTER CMI హాస్పిటల్, బెంగుళూరు సంయుక్త ఆధ్వర్యంలో సెప్టెంబర్ 14న బుధవారపేట, కేశవ మెమోరియల్

స్కూల్‌లో జరిగిన ఉచిత వైద్య శిబిరానికి వారు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కర్నూలు డి.ఈ.ఐ.సి డాక్టర్ సృజనారెడ్డి మాట్లాడుతూ తలసేమియా పిల్లలకు శరీరంలో ఐరన్ డిపాజిట్ కాకుండా చూడాలని హెచ్. బి. లెవెల్ 9 కి మించి ఉండేలా చూసుకోవాలని చెప్పారు. నేత్ర దాన పక్షోత్సవాల సందర్భంగా అందరూ మానవహారంగా ఏర్పడి నేత్రదానానికి తమ మద్దతు తెలిపారు.

ఈ కార్యక్రమంలో సక్షం జిల్లా అధ్యక్షులు రామ్మూర్తి, ఉపాధ్యక్షులు ఆర్. పార్థసారథి, సక్షం ప్రాంతకార్యకారిణి సభ్యులు సుబ్బారావు బి.సుబ్బా రావు, ప్రాణదా ఇంచార్జ్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. ఈ శిబిరంలో తలసేమియా బారిన పడిన పిల్లలు, వారి కుటుంబ సభ్యులతో కలిపి 125 మంది పాల్గొని చికిత్స చేయించుకొన్నారు.

గోల్కొండ భాగ్‌లో సంఘ శతాబ్ది కార్యక్రమం

భాగ్యనగర్: సంఘ శతాబ్ది సందర్భంగా భాగ్యనగర్ విభాగ్ గోల్కొండ భాగ్ ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 14న చింతన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఐపిఎస్, అడిషనల్ డిజిపి (రిటైర్డ్), వి.వి. లక్ష్మీనారాయణ, ముఖ్యవక్తగా రాకా లోకమ్ సీఈఓ రాకాసుధాకర్, భాగ్యనగర్ విభాగ్ సహసంఘచాలక్ డాక్టర్ వేదప్రకాశ్ పాల్గొన్నారు. వంద సంవత్సరాల సంఘ ప్రయాణం గురించి వక్తలు ప్రసంగించారు.

భక్తాగ్రేసరులు

తుకారాం

తుకారాం మహారాష్ట్రలోని పూనా సమీపంలోని దేహూ గ్రామానికి చెందినవాడు. విఠోభా పరమభక్తుడు. తండ్రి బల్హోభా గ్రామాధికారిగా పనిచేశారు.వారి పూర్వికులు వ్యవసాయం,అటు తరువాత వ్యాపారం చేసేవారు. తుకారాంకు అవి కలసిరాలేదు. చిన్నతనం నుంచి ఆధ్యాత్మికవాది అయిన భగవత్ సాక్షాత్కారం దీక్ష చేపట్టారు. 'మానవసేవయే మాధవసేవ'గా భావించాడు. ఉన్నదానితో తృప్తి పడాలన్న సంకల్పంతో, ఛత్రపతి శివాజీ ఇవ్వజూపిన సంపదను మృదువుగా తిరస్కరించాడు. తుకారాం రచనలను అభంగాలు అంటారు. వేల కొద్దీ అభంగాలలో మహారాష్ట్రలోని నిరక్షర గ్రామీణులు కూడా పెద్దసంఖ్యలో కఠంతా వచ్చు. దీనిని బట్టి ఆయన రచనలకు గల ప్రాచుర్యం తెలుస్తుంది. ప్రజలను వాటిని మత సంబంధమైన భజనలుగానే భావించక, నిత్యసత్యాలుగా, సూక్తులుగా పరిగణిస్తారు.ఆషాఢ, కార్తిక మాసాల్లో రాష్ట్రంలోని అన్ని వైపుల నుంచి భక్తులు ఆయన అభంగాలను పాడుకుంటూ పండరీపురం చేరుకుంటారు.

కథ

బద్ధకానికి మంత్రం!

సోమాపురం అనే ఊళ్లో శివయ్య అనే వ్యక్తి నివసిస్తూ ఉండేవాడు. ఆయన కొడుకు రాము మహా సోమరి. పెద్దవాడైనా సరే..ఏ పనీ చేయకుండా తిరుగుతుండేవాడు.

ఈ విషయంలో శివయ్య అతన్ని ఎన్నిసార్లు మందలించినా పట్టించుకునే వాడు కాదు. చేసేదేం లేక శివయ్య బాధపడుతూ ఉండేవాడు.

ఒకరోజు సోమాపురానికి కాశీ నుంచి ఒక సాధువు వచ్చాడు. ఊళ్లో వాళ్లంతా ఆయన దర్శనం చేసుకొని ఆశీస్సులు అందుకొని సమస్యల్ని చెప్పుకున్నారు. అక్కడికి వెళ్లిన శివయ్య ఏమీ మాట్లాడకపోగా దిగాలుగా ఉండటం గమనించిన సాధువు దగ్గరికి పిలిచి విషయం కనుక్కున్నారు.

సాయంత్రం గ్రామస్థులతో మాట్లాడేప్పుడు 'ఈ ఊళ్లో ఒక బద్ధకస్తుడు ఉన్నాడు. అతని వల్లే ఊరికి చెడు జరుగుతోంది. వచ్చే గురువారం నాడు అతని ఇంట్లో వాళ్లు మాయమైపోతారు' అని అన్నారు. ఆరోజు వచ్చే సరికి రాము తల్లిదండ్రులు మాయమైపోయారన్న వార్త గుప్పుమంది. అంతే.. రాము వల్లే ఊరికి చెడు జరుగుతోందని ఊరంతా అతన్ని దూరం పెట్టారు. ఇంట్లో వాళ్లూ లేకపోవడంతో అన్నం కోసం కూడా అతను బాగా ఇబ్బంది పడాల్సి వచ్చింది.

ఈ పరిస్థితిని భరించలేని రాము.. స్వామి కాళ్ల మీద పడ్డాడు. ఎక్కడికి వెళ్లినా అందరూ తనని అసహ్యించుకుంటున్నారని భోరుమన్నాడు. అప్పుడా

పద్యం

ఇనుము విరగనేని యిరుమారు ముమ్మారు
కాచి యతకవచ్చు గ్రమముగాను
మనసు విరిగెనేని మరి చేర్చరాదయా
విశ్వదాభరామ వినురవేమ

భావం : ఇనుము విరిగితే దానిని మళ్లీ తిరిగి రెండుమూడు సార్లు అతికించవచ్చు. కానీ అదే మనిషి మనసు ఒక్కసారి విరిగితే (అంటే ఏదైనా విషయం వల్ల మనసు నొచ్చుకుంటే) దాన్ని మరలా అతికించడం చాలా కష్టం అని భావం.

శ్లోకం

కావ్యశాస్త్ర వినోదేన
కాలో గచ్ఛతి ధీమతాం!
వ్యసనేన చ మూర్ఖాణాం
నిద్రయా కలహేన వా!!

భావం : బుద్ధిమంతులు కావ్యశాస్త్ర అధ్యయనం వల్ల కలిగే వినోదంతో కాలం గడుపుతారు. మూర్ఖులు దురలవాట్లతో, నిద్రతోను, కలహాలతోనో కాలం గడుపుతారు.

జతపరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

కోటా	కృష్ణ
నాసిక్	చంబల్
సంబల్పూర్	గోదావరి
విజయవాడ	ముతా
పుణే	మహానది

సమాధానాలు : కృష్ణ-విజయవాడ, గోదావరి-నాసిక్, మహానది-సంబల్పూర్, చంబల్-కోటా, ముతా-పుణే

నిర్వహణ : నయనశ్రీ

శాస్త్రవేత్తలు



లూయీ బ్రెయిలీ (1809-1852)

ప్రపంచ అంధులకు జ్ఞాన కవాటాలను ప్రసాదించిన మహనీయుడు లూయీ బ్రెయిలీ. బాల్యంలో ప్రమాద వశాత్తు రెండు కళ్లను కోల్పోయాడు. అతనికి చదువుపై గల ఆసక్తిని గమనించి తండ్రి పారిస్‌లోని అంధుల పాఠశాలలో చేర్చాడు. అప్పటికి అమలులో ఉన్న "లైన్ టైపు" పద్ధతిలో చదువుకుని, తన ప్రతిభతో చివరికి అదే పాఠశాలలో ఉపాధ్యాయుడుగా ఎదిగాడు బ్రెయిలీ. పగలు విద్యార్థులకు బోధిస్తూ, అంధులు తేలికగా చదవగలిగే, రాయగలిగే లిపి తయారీకై రాత్రులు కృషి చేశారు. దీని ఆధారంగానే ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉన్న అంధులు విద్యనభ్యసిస్తున్నారు. దీనినే బ్రెయిలీ లిపి అంటారు.

జనరల్ నాలెడ్జ్

1. ఇండియన్ డైమండ్ ఇనిస్టిట్యూట్ ఎక్కడుంది?
2. అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) ప్రధాన కార్యాలయం ఎక్కడుంది?
3. భారత ఉపరాష్ట్రపతిగా ఇటీవల ఎన్నికైన సీపీ రాధాకృష్ణన్ ఏ రాష్ట్రానికి చెందినవారు?

జవాబులు: 1. సూరత్, 2. వాషింగ్టన్, 3. తమిళనాడు

సాధువు... 'నువ్వు నీ తల్లిదండ్రుల్ని చూసుకోవలసిన వయసులో ఏ పనీ చేయకుండా ఊరికే తిని తిరుగుతూ కాలం గడుపుతున్నావు. నీ బాధ్యతల్ని నిర్వర్తించకుండా ఉండటం నేరమే కదా...' అని అన్నాడు.

దీంతో తన తప్పు తెలుసుకున్న రాము కష్టించి పని చేయడం మొదలు పెట్టాడు. ఇప్పుడు తల్లిదండ్రులు తనని చూస్తే ఎంతో సంతోషపడతారని అనుకుంటూ ఉండేవాడు.

కొన్నాళ్లకు సాధువు మళ్లీ ఆ ఊరికి వచ్చారు. అందరితో మాట్లాడుతూ 'బద్ధకస్తుడు మారిపోవడం వల్ల అతని ఇంట్లోవాళ్లు తిరిగి వస్తారు' అని చెప్పారు. మర్నాడే రాము తల్లిదండ్రులు ఊళ్లో అడుగుపెట్టారు. అంతా స్వామి మహిమ అని ఊళ్లోవాళ్లకు చెప్పిన రాము తల్లిదండ్రులు తమ కొడుకుని మార్చినందుకు స్వామికి మరీ మరీ కృతజ్ఞతలు తెలుపుకున్నారు. ★

మెదడుకు మేత

రైతుకు జోడి..
కొమ్ములు వాడి..
మోయును కాడి..
లాగును ఘాడి..?

ఇవ్వాళ : ఆబోతు

మంచిమాట

మంచితనం అనేది
మహావృక్షం లాంటిది..
ఎంత నరికినా మళ్లీ
చిగురిస్తూనే ఉంటుంది

వారఫలాలు

22-28 సెప్టెంబర్ 2025

సింహంభట్ల సుబ్బారావు
6300674054

మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

సమాజంలో గౌరవప్రతిష్ఠలు పెరుగుతాయి. చిన్ననాటి స్నేహితులను కలుసుకుని మనస్సులోని భావాలను వెల్లడిస్తారు. వ్యాపారులకు నూతన పెట్టు బడులు అందుతాయి. ఉద్యోగులకు ఆసక్తికరమైన విషయాలు తెలుస్తాయి. రాజకీయ వేత్తలు, సాంకేతికవర్గాలకు సమస్యలు తీరతాయి. పరిశోధకులు లక్ష్యాలు సాధిస్తారు 27,28 తేదీల్లో మానసిక అశాంతి. ప్రయాణాలలో మార్పులు. శారీరక రుగ్మతలు. హయగ్రీవస్తోత్రాలు పఠించండి.

వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు

నిరుద్యోగులకు ఉద్యోగ ప్రాప్తి. సమాజసేవలో భాగస్వాములవుతారు. ఆస్తుల వ్యవహారాలలో మధ్య వర్తిత్వం వహిస్తారు. వ్యాపా రులకు పెట్టుబడులతో పాటు లాభాలు అందుతాయి. ఉద్యోగులు సమర్థతను నిరూపించుకుంటారు. రాజకీయ, పారిశ్రామిక వేత్తలకు అరుదైన అవకాశాలు. క్రీడాకారులు, రచయితలు ఉత్సాహంగా ముందడుగు వేస్తారు. 22,23 తేదీల్లో కుటుంబంలో చికాకులు. ఆరోగ్య సమస్యలు. ఆదిత్య హృదయం పఠించండి.

మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

కొన్ని సమస్యలు తీరి ఊరట చెందుతారు. భూములు, వాహనాలు సమకూరతాయి. వివాహ యత్నాలు అనుకూలం. ప్రముఖుల నుంచి సమాచారం కొంత ఊరటనిస్తుంది. వ్యాపారులు లాభాల దిశగా కొనసాగుతారు. ఉద్యోగులకు అనుకోని బాధ్యతలు దక్కవచ్చు. పారిశ్రామికవేత్తలు, కళాకారులకు అవకాశాలు దక్కవచ్చు. 24,25 తేదీల్లో వృథా ఖర్చులు. మనశ్శాంతి లోపిస్తుంది. హనుమాన్ ఛాలీసా పఠించండి.

కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష

ఎంత కష్టపడ్డా ఫలితం కనిపించదు. ఆకస్మిక ప్రయాణాలు చేస్తారు. విలువైన వస్తువులు కొంత జాగ్రత్తపర్చుకోండి. దైవకార్యాలలో పాల్గొంటారు. వ్యాపారులకు కొంత నిరుత్సాహం. ఉద్యోగస్తులకు పనిభారం ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. పారిశ్రామిక వర్గాలకు గందరగోళంగా ఉంటుంది. రచయితలు, కళాకారులకు సమస్యలు పెరుగుతాయి. 25,26 తేదీల్లో శుభవర్తమానాలు. వాహనసౌఖ్యం.ముఖ్య నిర్ణయాలు. కనకధారా స్తోత్రాలు పఠించండి.

సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

చిరకాల స్వప్నం నెరవేరే సూచనలు. వ్యతిరేకులు సైతం స్నేహితులుగా మారవచ్చు. వ్యాపారులు అధికంగా లాభపడతారు. ఉద్యోగులకు విధుల్లో ఆటంకాలు తొలగుతాయి. రాజకీయవేత్తలు, కళా కారులకు విశేష గౌరవం దక్కుతుంది. క్రీడాకారులు ఉత్సాహంగా ముందుకు సాగుతారు. 26,27 తేదీల్లో కాంట్రాక్టులు అనుకూలించవు. విలువైన వస్తువులు కొంత జాగ్రత్తపర్చుకోండి.

కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు

సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. విద్యార్థులు అవకాశాలు అప్రయత్నంగా దక్కించుకుంటారు. వ్యాపారులు లాభాలబాటలో పయనిస్తారు. రాజకీయ, పారిశ్రామికవేత్తలకు ఊహించని అవ కాశాలు. పరిశోధకులు, సాంకేతికనిపుణులు అంచనాలు నిజం చేసుకుంటారు. 23,24 తేదీల్లో ప్రయాణాలలో మార్పులు. నవగ్రహస్తోత్రాలు పఠించండి.

తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు

ప్రముఖ వ్యక్తులు పరిచయం కాగలరు. కొన్ని వేదుకల్లో పాల్గొంటారు. వ్యాపారులు ముందుకు సాగి లాభాలు పొందుతారు. ఉద్యోగులకు ఊహించని హోదాలు రాగలవు. కళాకారులకు అవకాశాలు మరింత పెరుగుతాయి. రచయితలు, క్రీడాకారులు అనుకున్న లక్ష్యాలు సాధిస్తారు. 25,26 తేదీల్లో ఆరోగ్యసమస్యలు. బంధువులతో విరోధాలు. గణేశ్‌ను పూజించండి.

వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ

గృహం, వాహనాలు కొనుగోలు చేస్తారు. కొత్త కాంట్రాక్టులు ఎట్టకేలకు దక్కించుకుంటారు. భాగస్వామ్య వ్యాపారాలలో అనుకున్న లాభాలు అందుతాయి. ఉద్యోగులకు విధుల్లో అవాంతరాలు తొలగుతాయి. రాజకీయవేత్తలు, కళాకారులు సత్తా చాటుకుంటారు. పరిశోధకులకు నూతనోత్సాహం. 25,26 తేదీల్లో వృథా ఖర్చులు. శారీరక రుగ్మతలు. కనకదుర్గాదేవి స్తోత్రాలు పఠించండి.

ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

దీర్ఘకాలిక రుణాలు తీరి ఉపశమనం లభిస్తుంది. నిరుద్యోగులకు ఆశించిన ఉద్యోగాలు దక్కే అవ కాశం. కోర్టు వ్యవహారాలలో కొంత ప్రగతి. వ్యాపా రులకు లాభాలు ఉత్సాహాన్నిస్తాయి. పారిశ్రామిక వేత్తల యత్నాలు సఫలమవుతాయి. క్రీడాకారులు, రచయితలకు అన్ని విధాలా అనుకూల సమయం. 27,28 తేదీల్లో అనుకోని ప్రయాణాలు. శివస్తోత్రాలు పఠించండి.

మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

వ్యవహారాలలో క్రియాశీల పాత్ర పోషిస్తారు. కుటుంబంలో ఒత్తిడుల నుంచి బయటపడతారు. మీపై వచ్చిన అపవాదులు తొలగుతాయి. సమాజంలో గౌరవం మరింత పెరుగుతుంది. వ్యాపారులకు అనుకోని లాభాలు. ఉద్యోగులు విధి నిర్వహణపై శ్రద్ధ. రాజకీయవేత్తలు, కళాకారులకు ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. 23,24 తేదీల్లో వ్యయప్రయాసలు. సుబ్రహ్మణ్యస్తోత్రాలు పఠించండి.

కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు

భూవివాదాల నుంచి కొంత గట్టెక్కుతారు. భూములు, వాహనాలు సమకూర్చుకుంటారు. విద్యార్థులకు కార్యసిద్ధి. వ్యాపారులకు భాగస్వాముల నుంచి ప్రోత్సాహం. ఉద్యోగులకు విధుల్లో అవాంతరాలు తొలగుతాయి. కళాకారులకు కొత్త అవకాశాలు. పరిశోధకులు, సాంకేతిక రంగాల వారికి కొత్త ఆశలు. 25,26 తేదీల్లో దేవాలయ దర్శనాలు.ఆంజనేయ దండకం పఠించండి.

మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

మీ ఊహలు కొన్ని నిజమవుతాయి. కొంత కాలంగా ఎదుర్కొంటున్న సమస్య ఒకటి పరిష్కార మవుతుంది. ఆహ్వానాలు సంతోషం కలిగిస్తాయి. వ్యాపారులు భాగస్వాముల నుంచి మరిన్ని పెట్టు బడులు సమకూర్చుకుంటారు. పారిశ్రామికవేత్తలు, కళాకారులు లక్ష్యాలు సాధిస్తారు. రచయితలు, క్రీడాకారులు ఊహించని అవకాశాలు పొందుతారు. 24,25 తేదీల్లో వృథా ఖర్చులు. దూరప్రయాణాలు. దక్షిణామూర్తి స్తోత్రాలు పఠించండి.

పదరసం-532



ఆధారాలు

అడ్డం

1. సాధ్యం కానిది (3)
3. ఒడ్డు, తీరం (2)
4. కృష్ణుడి వదినగారు (3)
7. స్యందనం (2)
8. భూమి..(3)
9. కూతురు (3)
11. గుర్రం (3)
13. ఏకాదశి ముందు (3)
15. శలభం (3)
17. అట్లు పోసుకునే పరికరం (2)
18 లక్ష్మీదేవి (2)
20. లేలేత ఆకు (3)
21. అపాయం (3)
23. అతినెమ్మదిగా పాకే ప్రాణి (2)
24. ఆచార్యుడు (3)
26. ప్రజలు (3)
28. ఇదొక రకం సాగు (2)
29. పెండ్లి కుమారుడు.. అటు నుంచి (3)
31. తాత తండ్రి (3)
32. ఆంగ్ల మాసాల్లో ఏడవది (2)
33. నూనె.. ఇంధనం (3)
34. గోరు (2)

నిలువు

2. యముడిని ఎదిరించిన పతివ్రత (3)
3. అనంతరం, పిదప (4)
4. మరునాడు (2)
5. గారెనే ఇలా అంటారు (2)
6. అంధకారం (3)
9. పౌర్ణమే...(3)
10. కవి చెప్పేది (3)
12. అభివాదం (3)
14. ఈ కాయ కారం (3)
16. దీనికి లోకం దాసోహమట (2)
17. పాలు తోడుపెడితే (3)
19. ముక్కంటి కోపానికి బూది అయినవాడు(4)
20. ఒక నక్షత్రం (2)
21. గోమాత (2)
22. కాళిదాసు ఈయన ఆస్థానకవి (4)
23. దమయంతి పతి (3)
25. అప్పు.... (3)
27. సాహిత్య ప్రక్రియ... వనిత (3)
28. భాగవత ఆంధ్రీకరణ కర్త (3)
30. తమిళ పెరుగు... కింద నుంచి (2)

పదరసం - 531 సమాధానాలు



గత యేడాది సంక్రాంతి కానుకగా వచ్చిన 'హను-మాన్' చిత్రంతో జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నాడు తేజ సజ్జా. ఇప్పుడు అతను హీరోగా కార్తీక్ ఘట్టమనేని తెరకెక్కించిన 'మిరాయ్' పాన్ ఇండియా మూవీగా విడుదలైంది. టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ సినిమా క్లైమాక్స్‌లో కనిపించే శ్రీరాముడే ఈ చిత్రాన్ని విజయపథంలోకి తీసుకెళ్లాడని ప్రేక్షకులు భావిస్తున్నారు. అప్పుడు హనుమంతుడు, ఇప్పుడు శ్రీరాముడు తేజ సజ్జాకు బాగా కలిసి వచ్చారన్నది అందరూ అంటున్న మాట.

'మిరాయ్'కు శ్రీరామరక్ష!

ఈ సినిమా కథ అశోకుడు కళింగ యుద్ధానంతరం మొదలవుతుంది. ఆ యుద్ధం తర్వాత జీవితం పట్ల విముఖత ఏర్పడిన అశోకుడు తన దివ్య శక్తులను తొమ్మిది గ్రంథాలలో నిక్షిప్తం చేస్తాడు. వాటిలో ఎనిమిది గ్రంథాలను వివిధ దేశాలకు పంపుతాడు, తొమ్మిదవది 'అమరగ్రంథ'ను ఓ ఆశ్రమానికి ఇస్తాడు. ఈ తొమ్మిది గ్రంథాలను హస్తగతం చేసుకుంటే తిరుగులేని శక్తిని పొందవచ్చని ఎంతోమంది ప్రయత్నించి విఫలం అవుతారు. తమ ఆశ్రమంలోని గ్రంథాన్ని పరిరక్షించే బాధ్యతను చేపట్టిన అంబిక (శ్రియా) తన కొడుకు ద్వారా అది సాధ్యమౌతుందని తెలుసుకుని, పసిగుడ్డును కాశీలో శివలింగం చెంత వదిలి వెళ్ళిపోతుంది. కారణ జన్ముడైన ఆ పిల్లాడు వేద ప్రజాపతి (తేజ సజ్జా)గా పెరిగి పెద్దవాడవుతాడు. అయితే తన కర్తవ్యం ఏమిటనేది అతనికి అర్థం కాకుండా ఉంటుంది. ఆ సమయంలో ఆశ్రమం నుండి వేద ప్రజాపతిని వెతుక్కుంటూ వచ్చిన విభ (రితికా నాయక్) అతనికి చేయాల్సి కార్యం గురించి చెబుతుంది. అప్పటికే ఎనిమిది గ్రంథాలను చేజిక్కించుకున్న తాంత్రికుడైన మహావీర్ లామా (మంచు మనోజ్)కు తొమ్మిదో గ్రంథం దక్కకుండా చూడమని కోరుతుంది. ఆ గ్రంథాన్ని పరిరక్షించే క్రమంలో తనువు చాలించిన అంబిక... ఆత్మబోధతో వేద ప్రజాపతి తన కర్తవ్యాన్ని ఎలా నిర్వర్తించాడు? ఆ సందర్భంగా అతనికి భగవాన్ శ్రీరాముడి ఆశీస్సులు ఎలా లభించాయి అనేది సినిమా క్లైమాక్స్.

త్రేతాయుగం నాటి రాముని ఆయుధం మిరాయ్. దాన్ని పొందగలిగితే విజయం తథ్యం! మిరాయ్‌ను అందుకోవడానికి వేద ప్రజాపతి ఎలాంటి సాహసాలు చేశాడు? తన మీద తనకే నమ్మకం లేని అతను... ప్రజల కోసం, మహావీర్ లామా తాంత్రికశక్తుల నుండి వారిని కాపాడడం కోసం ప్రాణాలకు తెగించి ఎంతటి పోరాటం చేశాడనే దానిని దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని ఆసక్తికరంగా తెరకెక్కించాడు. 'హను-మాన్' మూవీలో హనుమంతుడి సాయంతో ఓ సాధారణ యువకుడు విలన్ పని పట్టినట్టుగా ఇందులోనూ క్లయిమాక్స్‌లో శ్రీరాముని సాయం కథానాయకుడికి లభించిందన్నట్టుగా చూపించారు. నేపథ్య గీతం, సంగీతంతో క్లయిమాక్స్‌ను మరో స్థాయికి తీసుకెళ్లే ప్రయత్నం దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని చేశాడు. 'మిరాయ్'ను అందుకునే క్రమంలో జటాయువు సోదరుడు సంపాతితో చేసే పోరాటం, రాముడు ధ్యానం చేసిన స్థలంలో చిత్రీకరించిన పోరాట సన్నివేశాలు చాలా బాగున్నాయి. ప్రతినాయకుడు మంచు మనోజ్ పాత్ర నేపథ్యం, అతను అలా తయారు కావడానికి చూపించే కారణాలు ఏమంతగా ఆకట్టుకోవు. అలానే పోలీసులు హీరో, హీరోయిన్ల వెంట పడే సన్నివేశాలు పరమ రొటీన్‌గా ఉన్నాయి. కథలో చాలా లూప్ హోల్స్ ఉన్నా... వి.ఎఫ్.ఎక్స్, సినిమాటో గ్రఫీ, బ్యాక్ గ్రౌండ్ స్కోర్‌తో మాగ్జిమమ్ అధిగమించే ప్రయత్నం దర్శకుడు చేశాడు.

నటీనటుల విషయానికి వస్తే తేజ సజ్జా తన పాత్రను చక్కగా పోషించాడు. రుతికా నాయక్ పోషించిన విభ పాత్రను హీరోయిన్ అనుకోవడానికి లేదు. వీరిద్దరిపై చిత్రీకరించి పాటను కూడా చివరి నిమిషంలో తొలగించారు. దాంతో ఆమెను కూడా ఓ ప్రధాన పాత్రగానే చూడాల్సి ఉంటుంది. హీరో తల్లిగా శ్రియా చక్కటి నటన కనబరిచింది. ప్రత్యేకంగా చెప్పుకోవాల్సింది..విలన్‌గా నటించిన మంచు మనోజ్ గురించి. తనకు వచ్చిన అవకాశాన్ని మనోజ్ చక్కగా సద్వినియోగం చేసుకున్నాడు. కొన్ని చోట్ల హీరో పాత్రకంటే అతని పాత్రకే ఎక్కువ ఎలివేషన్ ఇచ్చారు. జయరామ్ పోషించిన సాధువు పాత్రను సీరియస్ గా మొదలు పెట్టి కామెడీ చేసేశారు. జగపతిబాబు, కిశోర్ తిరుమల, వెంకటేశ్ మహా, గెటప్ శ్రీను తదితరులు ఇతర ప్రధాన పాత్రలు పోషించారు. ఈ సినిమా సక్సెస్ అయితే సీక్వెల్ తీయొచ్చు అనే ఆలోచనతో రానాకు లీడ్ ఇచ్చారు.

సాంకేతిక నిపుణుల విషయానికి వస్తే... బేసికల్‌గా సినిమాటోగ్రాఫర్ అయిన కార్తీక్ ఘట్టమనేని సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరించారు. గౌర హరి సంగీతం, మణిబాబు కరణం సంభాషణలు, శ్రీ నాగేంద్ర తంగాల ఆర్ట్ డైరెక్షన్ అన్నీ కూడా సినిమాను ఎలివేట్ చేసే విధంగానే ఉన్నాయి. నిర్మాత టి.జి. విశ్వప్రసాద్ ఎక్కడా రాజీ పడకుండా ఈ సినిమాను నిర్మించారు. దాని ఫలితం తెర మీద కనిపిస్తోంది. ఈ మధ్య కాలంలో కుటుంబంతో సహా థియేటర్‌కి వెళ్లి చూసే సినిమాలు తగ్గిపోయాయి. ఆ మధ్య వచ్చిన 'మహావతార్ నరసింహ' తర్వాత కాస్తంత చెప్పుకోదగ్గ చిత్రం ఇదే. గతంలో 'సూర్య వర్సెస్ సూర్య', 'ఈగల్' చిత్రాలతో పరాజయాలను చవిచూసిన సినిమా టోగ్రాఫర్ టర్న్డ్ డైరెక్టర్ కార్తీక్ ఘట్టమనేని 'మిరాయ్'తో మంచి విజయాన్నే అందుకున్నాడు.

– అరుణ, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్

జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు



వెల : ₹.300/-



వెల : ₹.100/-



వెల : ₹.400/-



వెల : ₹.30/-



వెల : ₹.60/-



వెల : ₹.250/-



వెల : ₹.50/-



వెల : ₹.200/-



వెల : ₹.300/-



వెల : ₹.100/-

వెల : ₹.499/-



వెల:₹.499/-



వెల :₹.450/-



వెల : ₹.499/-



వెల : ₹.125/-

పై పుస్తకములకు మరియు క్రొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

సాహిత్య నికేతన్ : కేశవనిలయం, బర్కత్‌పురా. 040-27563236, 9290127329, 8179163138

సాహిత్య నికేతన్ : వై.ఎం.ఐ.ఎస్. బిల్డింగ్, సిబిఐ ఆఫీస్ రోడ్, కోఠి, హైదరాబాద్. 9440589722,

From: JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 77 Issue : 48

With best compliments from:

Estd : 1994-95

G.PULLA REDDY COLLEGE OF PHARMACY

NAAC

Affiliated to Osmania University, Hyderabad
Approved by PCI & Accredited by NAAC,
G.Pulla Reddy Educational Campus, Mehdipatnam, Hyderabad-500 028.
Phone : +91 8297511177
Email: gprcphyd@gmail.com I website : gprcp.ac.in

EAMCET Code : GPRP **PGECET Code : GPRP1**

COURSES OFFERED

B.Pharm

M.Pharm

1. M.Pharm (Pharma. Chemistry)
2. M.Pharm (Pharmaceutics)
3. M.Pharm (Pharmacology)
4. M.Pharm (Pharma. Analysis)
5. M.Pharm (Pharma. Regulatory Affairs)

Pharm D

Founder Chairman **Late G. Pulla Reddy**

Chairman **Sri P. Subba Reddy**

Managing Trustee **Sri G. Raghava Reddy**

Posting at BPC-IV Patrika Channel, Nampally, Hyd-01